1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 3
సంచిక : 12
పుటలు : 52
రు. 20/-లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఫిబ్రవరి 2018



అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు

ఈ గణతంత్ర దినోత్సవంనాడు మూడు రోజులపాటు తెనాలిలో విజయవంతంగా జరిగిన తెలుగు సాహిత్యమహోత్సవం ప్రజాచైతన్యాన్ని ప్రోది చేసింది. తెలుగు సాధికారత విషయంలో ప్రభుత్వ నేతలకు రాజకీయ సంకల్పం లేకపోవడాన్ని ప్రశ్నించింది రానున్న ఉగాది నాటికల్లా తెలుగు ప్రాధికార సంస్థను నెలకొల్పాలని, పాలనను పూర్తిగా తెలుగులోకి తేవాలని, న్యాయస్థానాలు పూర్తిగా తెలుగులోనే నడవాలని తెలుగులో తీర్పులివ్వాలని ప్రాథమిక విద్యను మాతృభాషలో నేర్పాలని – ఇందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.





1866లో విక్టోరియా మహారాణి బుద్దా వెంగళరెడ్డికి పంపిన బంగారు పతకంపై అన్ని అక్షరాలూ తెలుగులోనే!





తెలుగు భాషావికాస సంవత్సరం- కార్యాచరణ?

న్యాయస్థానాలలో తెలుగు కోసం ఉద్యమ సమాలోచన



2018 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (21 ఫిబ్రవరి) సందర్భంగా

ఫిబ్రవరి 18 ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడలో

సదస్సు

ముఖ్య అతిథి :జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు
ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

విశిష్ట అతిథి :శ్రీ మంగారి రాజేందర్ (విశ్రాంత న్యాయమూర్తి)
తెలంగాణ సర్వీస్ కమిషన్ సభ్యుడు

ఆత్మీయ అతిథి : డా॥చుక్కా రామయ్య
తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు

సభాధ్యక్షుడు : డా॥సామల రమేష్‌బాబు
తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు

కీలకపత్ర సమర్పణ: బి.హనుమారెడ్డి న్యాయవాది

వేదిక

బెజవాడ బార్ అసోసియేషన్ హాలు
కోర్టులప్రాంగణం, గోపాలరెడ్డి రోడ్, విజయవాడ

పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యమకారులు ప్రసంగిస్తారు

రాష్ట్రంలో క్రిందిస్థాయి న్యాయస్థానాల్లో తెలుగునే వాడేట్లు ప్రతిజ్ఞ చేద్దాం.
దావా అర్జీలు, సాక్ష్యాలు, వాదోపవాదాలు, తీర్పులు, మాతృభాషలో రాద్దాం.
పేద ప్రజలకు కూడా న్యాయస్థానాలలో భాషాపరంగా న్యాయం జరగాలి.
ప్రజల భాషలోనే న్యాయస్థానాలు పనిచేయాలి.

ఈ అంశంపై ఆసక్తిగల వారందరికీ ఇదే మా ఆహ్వానం

వివరాలకు :

1. డా॥ సామల రమేష్‌బాబు - 9848016136
2. డా॥ వెన్నిసెట్టి సింగారావు - 9393015584
3. తిరువరంగం ప్రభాకర్ - 9848336848
4. సి.వి. సుబ్రహ్మణ్యేశ్వర రావు - 9399975668

తెలుగు భాషోద్యమ సమాఖ్య
బెజవాడ బార్ అసోసియేషన్
ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మనుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



ఫిబ్రవరి 2018

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము. **అమ్మనుడి** లో ప్రచురణ ఐన తరువాత ఇతర పత్రికలలోగాని, సోషల్ మీడియాలో గాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

లోపలి పుటలలో....

సంపాదకహృదయం :	2018 తెలుగు భాషావికాస సంవత్సరం –కార్యాచరణ?		5
ముఖచిత్రం :	తెలుగుతోనే సమాజాభివృద్ధి...	ప్రత్యేక ప్రతినిధి	6
ప్రాచీన భాష :	తెలుగు ప్రాచీన భాషాధ్యయన కేంద్రం	రెహమానుద్దీన్	9
	తెలుగు భాషకి ఆధునిక హోదాకోసం జాలమే వేదిక	వీవెన్	11
ప్రపంచ తెలుగు మహాసభలు:	డా॥ సామల రమేష్‌బాబు ప్రసంగం		12
మరణ వాఙ్మూలం:	చనిపోయీ జీవిస్తున్న వ్యక్తి గురజాడ.	వేదగిరి రాంబాబు	16
స్పందన :	తెలుగు అక్షరమాల గురించి దిద్దుబాట్లు	వావిలాల సుబ్బారావు	18
స్పందన :	తెలుగు లిపి సంస్కరణ సవరణ ఆధునీకరణ	గారపాటి ఉమామహేశ్వరరావు	20
పెద్దోరి తీపి గురుతులు :	ఆరుద్ర వాత్సల్య ముద్రలు	సన్నిధానం నరసింహ శర్మ	23
జానపదం:	తెన్నాటి తెలుగు పాటలు3	సామల మురళి	25
ఆదర్శం :	నాయుడుగారి కాలేజి	కీ.శే. ఇస్మాయిల్	27
లేఖా సాహిత్యం :	నిగమశర్మకు అక్కరాసిన లేఖావళి–3	గజానన్ తామన్	29
సాహిత్యరంగం :	మన తెలుగూ మన తెలుగు ప్రపంచమూ	మధురాంతకం నరేంద్ర	36
మన రాజులు వారి బిరుదులు :	విజయనగర చక్రవర్తుల బిరుదులు – 4	ఈమని శివనాగిరెడ్డి	48
పిట్ట చూపు :	ఆర్థిక ప్రగతి ఎవ్వరి కోసం...	చలసాని నరేంద్ర	49
ప్రత్యేకం :	విక్టోరియా మహారాణి బంగారు పతకం	నూర్ బాషా రహంతుల్లా	50
ధారావాహికలు :			
1. మౌనంలోని మాటలు4:	సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ –	ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు	38
2. బౌద్ధం–వైజ్ఞానిక మార్గం –10	.....	బొర్రా గోవర్ధన్	45
భాషోద్యమ కథానికలు :			
	1. దాహార్తి	సింహ ప్రసాద్	32
	2. ప్రసంగి, అదన ప్రసంగి	పోట్లూరి సుబ్రహ్మణ్యం	42
కవితలు :			
	1. సృష్టిలో తీయని బంధం అమ్మ	రాయవరపు సరస్వతి	24
	2. అక్షరానిదే అంతిమ విజయం	కత్తి పద్మారావు	28
	3. తోటలోకి అడుగెయ్యాలి	ఏనుగు నరసింహారెడ్డి	35

రేఖా చిత్రాలు : చిదంబరం, కార్టూన్లు : సరసి, శేఖర్
ఫొటోలు : సాయినాథ్ కంప్యూటరీకరణ : లంకె జనార్దన్

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

	వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా :	రూ.5000	రూ.7500	--
5 సం॥ :	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥ :	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥ :	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అకౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి' 8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి** గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244 ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు** -1. ఫోన్:7386223538.

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికంగా 500రూ. ఇవ్వబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- తరువాత ఈ కథానికలతో ఒక సంకలనాన్ని తెస్తాం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.
- మన భావాలకు శాశ్వత రూపాన్నిచ్చే మన మాతృభాష కేంద్రంగా మీరు పంపే కథానికల కోసం ఎదురు చూస్తుంటాం. అమ్మభాష కోసం నిర్వహిస్తున్న ఈ వినూత్న శీర్షికకు విలువైన మీ కథానికలను పంపాల్సిన చిరునామా:

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. కార్యాలయం ఫోన్ : 0866-2439466. సంపాదకుడు : 9848016136. e-mail : editorammanudi@gmail.com

గమనిక : కథలను అనుఫాంట్స్‌లో గాని, యూనికోడ్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి.ఫైల్సులోపంపించాలి. చేతివ్రాతలో పంపేట్లయితే వ్రాసిన దానిని స్కాన్ చేయించిపంపాలి. లేదా వ్రాతప్రతిని పోస్టులో గాని, కొరియర్‌లో గాని పంపించాలి.

సంపుటి : 3 సంచిక : 12
అమ్మనుడి
ఫిబ్రవరి 2018

సంపాదక హృదయం

2018:తెలుగు భాషావికాస సంవత్సరం - కార్యాచరణ?

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి ఆలోచనలన్నీ పూర్తిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో వేగంగా నడిపించాలనే దిశగానే; ఇందులో భాగం సాటిలేని రీతిలో రాజధాని నిర్మాణం. వీటితోనే ఆయన బాగా బిజీ! ఆయన ఎజెండాలో ప్రజల హక్కుగా మాతృభాష – ఆ భాషకు సాధికారతను చేకూర్చడం, విద్యాబోధనను మాతృభాషలో జరపాలి అనే శాస్త్రీయ, హేతుబద్ధ అంశాలు లేవు. ముఖ్యమంత్రిగారు ఆలోచిస్తున్న అభివృద్ధి ప్రణాళికలో అవి భాగం కావు. రాష్ట్రం భాషా ప్రాతిపదికన ఏర్పడింది గనుక ప్రజల భాషలోనే పరిపాలన, చదువు అనే సైద్ధాంతిక దృక్పథమే ఆయనకు లేదు.

ఆయన రాజకీయవేత్త, పాలనా నిపుణుడేగాని, జాతి భావనతో మునుముందుకు చూడగల రాజనీతిజ్ఞుడు (స్టేట్స్‌మన్) కాదు. రాజనీతిజ్ఞుడు ఎప్పుడూ స్వదేశాన్ని, స్వజనాన్ని, స్వభాషను, స్వజన నిపుణతను ఆధారంగా చేసుకొనే భవిష్యత్తు గురించి ఆలోచిస్తాడు. మన ఇరుగు పొరుగున వున్న రాష్ట్రాల నేతలను చూచి అయినా, ఇజ్రాయిల్, జర్మనీ, జపాన్, చైనా వంటి దేశాలను చూచి అయినా తెలుగు రాష్ట్ర మౌలిక లక్ష్యాలెలా వుండాలో, అందుకు చేపట్టవలసిన వ్యూహాలేమిటో చంద్రబాబుగారు నిర్ణయించుకోవాలి.

ఆయన దృష్టిలో తెలుగంటే ఏవో పద్యాలు, పాటలు, వేద ప్రవచనాలతో పాటు తెలుగు పేరిట చెప్పే సూక్తులు, దేవతా పూజలు, మంత్రాలూ – నాట్యాలూ, ఆటలూ వగైరా. కనుక భాషా వికాసమంటే సాంస్కృతిక కార్యకలాపాలు, సాహితీ చర్చలు, పండితులు వెలయించే భాషా విన్యాసాలూ వగైరా! విద్యారంగంలో తెలుగు ఉపయోగం గురించీ, పరిపాలనలోనూ అన్ని విధాలా తెలుగును ఉపయోగించడం గురించీ ఆయనకు నమ్మకం, సద్భావం లేవు. ఇంగ్లీషే ఇహపరాలకు దేవత. దాన్ని ఎంతగా ఔపాసన పట్టగలిగితే తెలుగుజాతికి అంత మంచిది అని, వారి లోలోపలి నమ్మకం. చంద్రబాబుగారిని సన్నిహితంగా పరిశీలిస్తే – ఎవరికైనా కలిగే అభిప్రాయం ఇది.

కాకపోతే ఆయన ఒక చురుకైన రాజకీయవేత్తగా, పాలకుడిగా, ఎప్పటికప్పుడు సమస్యల్ని ఉపశమన పరచే చర్యలను చేపడ్తారు. పదిమంది కలిసి ఎక్కడ ఏమి కోరినా ఆయన కాదనరు. వెంటనే అన్నీ ఒప్పుకొంటారు. ఆచరణ ఎంతవరకు అనేది తర్వాత సంగతి! ఇదీ ఇంతకాలంగా నడిచిన, నడుస్తున్న చరిత్ర. అందుకే ఆయన మాటల్ని వెంటనే ఎవరూ నమ్మనిస్థితి వచ్చేసింది.

ఇంతకూ వత్తిడికి లొంగి ఆయన ఏమైనా వరాలిచ్చినా వాటి గతి ఏమిటో – మనం చూస్తూనే ఉన్నాం. జి.ఒ.86, మంత్రిత్వశాఖలో తెలుగుకు బడ్జెట్టు లేకపోవడం, ప్రాథమిక స్థాయిలో సమూలంగా తెలుగు మాధ్యమాన్ని పీకేసే ప్రయత్నంలో ఆడిన దొంగాటకం, చివరికి – జరిగిన, జరుగుతున్న మోసం – ఇవన్నీ ఉదాహరణలే. కొన్ని ఆలంకారిక పదవుల కోసం ఆశపడే వారి కోరికల్ని తీర్చేస్తూ, ఉద్యమాలపై నీళ్ళు చల్లడం ఆయనకే గాదు, రాజకీయాల్లో సాధారణంగా అధికారంలో వున్నవారు ఆడే ఆట. దీనికి తెలుగు భాషోద్యమాలు మినహాయింపు ఏమీకాదు.

ఇప్పుడు – కారణాలేమైనా డిసెంబరు నెలాఖరులో చంద్రబాబు నాయుడుగారు '2018ని తెలుగు భాషా వికాస సంవత్సరంగా ప్రకటించారు. ఇప్పటివరకూ తెలుగు విషయంలో ముఖ్యమంత్రిగారు చేసిన వాగ్దానాలన్నీ, వారి పార్టీ మానిఫెస్టోలో పెట్టిన వాగ్దానాలన్నీ – ఈ ఏడాదిలో అమలులోకి ఒస్తాయని ఆశ పెట్టుకోవడం తప్పుకాదు. కాకపోతే – సమస్య అంతా భాష పేరుతో ఉత్సాహంగా ముందుకు వచ్చే సాహితీ వేత్తలతోనూ, కళారంగ నిపుణులతోనూ! వారంతా బోళా శంకరులు. భాష ఉంటేనే సాహిత్యం ఉంటుందని బుద్ధప్రసాద్‌గారివంటి సాత్వికుడు, సర్వజన ప్రియుడు మొన్న కఠినంగా తెనాలి సభలో చెప్పవలసి వచ్చిందంటే ఇది ఎంత సున్నితమైన సంగతో కదా!

సరే. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం. ఉద్యమాలతోనే ఏదైనా సాధించగలుగుతాం. ఉద్యమాలంటే విధ్వంసానికి పూనుకోవడం కాదు. నిర్మాణాత్మక ఉద్యమాలను విధ్వంసం చెయ్యాలని చూస్తే మాత్రం చివరికి మిగిలేదీ విధ్వంసమే. ప్రజాస్వామిక స్ఫూర్తితో జనం భాషకు సాధికారతనూ, ప్రయోజనాన్నీ అభివృద్ధినీ సాధించగలిగే దిశగా మన ప్రయత్నాలు సాగాలి. ఇందుకు గల అన్ని అవకాశాలనూ వినియోగించుకోవాలి. తెనాలిలో జరిగిన తెలుగు సాహితీ మహోత్సవం ఇందుకు ఒక ఉదాహరణ. ఫిబ్రవరి 18 న విజయవాడలో జరుగనున్న "న్యాయస్థానాల్లో తెలుగుకోసం ఉద్యమ సమాలోచనా సదస్సు"లో అందరూ పాల్గొనండి. రానున్న సంవత్సర కాలానికి ఉద్యమ కార్యక్రమం కోసం జరుగనున్న సమాలోచనల్లో పాలు పంచుకుందాం రండి.

సామల రమేష్ బాబు

తేదీ : 31-1-2018

'తెలుగుతోనే సమాజాభివృద్ధి' అని చాటి చెప్పిన తెనాలి – తెలుగు సాహిత్య మహోత్సవం

గణతంత్ర దినోత్సవం నాడు మొదలై మూడు రోజుల పాటు గొప్పగా, విజయవంతంగా తెనాలిలో జరిగిన 'తెలుగు సాహిత్య మహోత్సవం' తెనాలి ప్రాంతంలో తెలుగుచైతన్యానికి సాక్ష్యంగా నిలిచింది.

తెనాలి శాసన సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తనంత తానుగా తలపెట్టిన ఈ పండుగకు నైతిక మార్గదర్శకత్వం, తోడ్పాటు మండలి బుద్ధప్రసాద్‌గారిది. భాష, సాహిత్య సాంస్కృతిక రంగాల్లో చురుకుగా పనిచేసే కొందరు కార్యకర్తల సహకారంతో రాజేంద్రప్రసాద్ తను తలపెట్టిన మూడు రోజుల కార్యక్రమాన్నీ ఎంతో సమర్థంగా, నిర్వహించి, విజయవంతం చేశారు.

తెనాలిలో ఇటీవలి కాలంలో ఆధునికంగా నిర్మించిన తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం 500 మంది సుఖంగా కూర్చొని కార్యక్రమాల్ని తిలకించడానికీ, సభలకు సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన అన్ని సౌకర్యాలతో వున్న వేదికతో, చుట్టూ విశాలమైన స్థలంతో ఉంది. దానికి ఈ సందర్భంగా తెనాలికి చెందిన గొప్ప రచయిత కీ.శే. 'బొల్లిముంత శివరామకృష్ణ సాహితీ ప్రాంగణం' అనే పేరు పెట్టడంతో దానికి మరింత అదనపు విలువ, స్థాయి చేకూరినట్లయింది. జనవరి 26న ప్రఖ్యాతమైన రణరంగ చౌక్‌లో అమరవీరులకు నివాళి, తెలుగుతల్లికి వందనం సమర్పించి, 'తెలుగు కోసం నడక' ను కళాక్షేత్రం వరకూ సాగించారు. ఆ నడకలోపెద్దలు, పురజనులు, విద్యార్థులతో పాటు కొన్ని జానపద కళా రూపాల ప్రదర్శనలు కూడా తోడు నడవడంతో శోభాయమానంగా అంతా కళాక్షేత్రానికి చేరుకున్నారు.

తెలుగు సమాజంలో వందలాది ఏళ్ళుగా అనేక సామాజిక, రాజకీయ, సాంస్కృతికోద్యమాలకు పుట్టినిల్లుగా, కీలక కేంద్రంగా తెనాలి చరిత్ర వుంది. దానికి తగ్గట్లుగా ఇప్పుడు ఈ సాహిత్య మహోత్సవాన్ని స్థానిక శాసనసభ్యుడే – అదీ అధికార పక్షానికి చెందిన నేత తల పెట్టడంతో ఇదొక సంచలన విషయం అయింది. తగ్గట్లుగానే పత్రికలు, ప్రసార మాధ్యమాలు కూడా ఎంతో సమర్థననిచ్చి, తోడ్పడ్డాయి. ఎక్కడా ఎటువంటి వైరుధ్యమూ ఘర్షణా భేదభావాలూ లేకుండా నిజంగా పండుగ లాగే జరగడం విశేషం. ఆ ఘనతంతా నిర్వాహకుడు రాజేంద్ర ప్రసాద్ గారిదే.

ప్రారంభ సభ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతనే జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించిన **సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ – 'ప్రాథమిక విద్య తెలుగులోనే ఉండాలి' అని స్పష్టం చేశారు**. తెలుగును రక్షించుకోవలసిన అవసరం గురించి ఒక దిన పత్రికలో తాను వ్రాసిన వ్యాసం తనకెంతో గుర్తింపు తెచ్చిందని, మనం పరస్పరం తెలుగులోనే మాట్లాడుకోవాలని, పిల్లల్లో మాతృభాషపై మమకారం పెంచాలని, **ప్రభుత్వమే కాదు, ప్రజలు కూడా మౌలిక సమస్యల్ని పట్టించుకోవాలని అన్నారు.** తెనాలిలో ఇలాంటి సభలు జరగడం సంతోషదాయకంగా ఉందని, **అన్నిచోట్లా ఇలాంటి కార్యక్రమాలు జరగాలనీ** జస్టిస్ వెంకటరమణ అన్నారు.

సభల్ని ప్రారంభిస్తూ మాట్లాడిన శ్రీ బుద్ధప్రసాద్ సమాజాన్ని జాగృతం చేసే ఎన్నో ఉద్యమాలకు నెలవు అయిన తెనాలిలో వర్ధిల్లిన పెద్దల పేర్లను ప్రస్తావించి, **తెనాలిలో తెలుగు భాషాసంస్కృతులను కాపాడు కొనేందుకు నడుం బిగించి ఇలాంటి కార్యక్రమం మొదలైనందుకు ఎంతో సంతోషంగా ఉందని, ప్రజల్లో ఏర్పడిన నైరాశ్యాన్ని పోగొట్టి చైతన్యాన్ని కలిగించేందుకు ప్రణాళికను తయారు చెయ్యండి, తెనాలి నుంచే పని మొదలు పెడదాం అన్నారు. ఆయన స్వరంలో స్పష్టతతో పాటు కొంత కాఠిన్యం ధ్వనించింది. భాష లేకపోతే సాహిత్యం ఉండదని ఆయన చెప్పిన తీరు కొందరు సాహిత్య వేత్తల్లో చర్చకు దారి తీసింది.**

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న జస్టిస్ భవానీ ప్రసాద్ ప్రభుత్వ వ్యవస్థలో పట్టుదల లేదని, ప్రభుత్వం నుంచి అద్భుతాలు జరుగుతాయని ఆశించకండి అంటూనే హాస్యోక్తులతో కూడిన సందేశాత్మక ప్రసంగాన్ని చేశారు.

మరొక ఆత్మీయ అతిథి, సినీ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు హాస్యోక్తులతో, సున్నితంగా విమర్శిస్తూనే, తన కవితా ప్రతిభను వ్యక్తం చేసే విధంగా తన రచనలను తన గొంతుతో పాడి వినిపించి శ్రోతల్ని ముగ్ధులను చేశారు.

భాషా సాంస్కృతిక మండలి సంచాలకుడు డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ మాటల్లో కూడా ఒక అధికారిగానేగాక, చైతన్య శీలి అయిన తెలుగు వాడిగా లోతైన ఆలోచనలను ప్రజల ముందు పెట్టడం కొందరిలో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది. **డా॥ విజయభాస్కర్ ఉద్వేగంగా మాట్లాడుతూ 'భాషను కోల్పోతే అది గణతంత్రమైనా ఒకటే, పరతంత్రమైనా ఒకటే అన్నారు. మరొక కోణాన్ని వెల్లడి చేస్తూ 'మాన్యుడు ఏది చేస్తే సామాన్యుడు దాన్ని అనుసరిస్తాడు' అని. ఈ అంశాలను ఆయన ముగింపు సభలో వివరంగా చెప్పారు. మంత్రిగారి అనుమతితో ప్రకటిస్తోన్నా – 'అందరూ ముందుకు వస్తే అన్నిచోట్లా ఇలాంటి సభలు పెడతాము' అన్నారాయన. ఆయన ప్రసంగం ప్రశంసలను చూరగొంది.**

సదస్సులు

26ననే 'బాల సాహిత్యం – భాషా వికాసం' అనే అంశంపైనా, 'భాషా వికాసం – మహిళా సాహిత్యం' పైనా సదస్సులు జరిగాయి. తొలిసభ పన్నాల సుబ్రహ్మణ్య భట్టు అధ్యక్షతన – శాసన మండలి సభ్యుడు ఎ.ఎస్.రామకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి రావుల శ్రీనివాస గంగాభవాని, ముంజులూరి కృష్ణకుమారి, చొక్కాపు వెంకటరమణ, డి. సుజాతాదేవి, దాసరి వెంకటరమణ, అలపర్తి వెంకట సుబ్బారావు, రెడ్డి రాఘవయ్య వంటి ప్రముఖులు పాల్గొన్నారు. మహిళా సాహిత్యం పై సదస్సు విశ్రాంత ఆచార్యులు పి. హైమవతి అధ్యక్షతన జరిగింది. 27 ఉదయం కె.శివారెడ్డి అధ్యక్షతన జరిగిన 'భాషా – వికాసం సాహితీ ప్రక్రియలు' సదస్సులో నగ్నముని, శ్రీరమణ, సి.ఎస్.రావు, కందిమళ్ళ సాంబశివరావు, మీగడ రామలింగ స్వామి, ధవళ సత్యం, కర్నాటి లక్ష్మీనరసయ్య, దేవీప్రియ, వెన్నా వల్లభరావు మున్నగువారితో జరిగింది. మధ్యాహ్నం 'తెనాలి సాహితీ కళా చారిత్రక వైభవం అనే అంశంపై జరిగిన సభ మొదలి నాగభూషణ

శర్మ అధ్యక్షతన ఈమని శివనాగిరెడ్డి, డా॥ పాటిబండ్ల దక్షిణామూర్తి, ముత్తేవి రవీంద్రనాథ్, నేతి పరమేశ్వరశర్మ, ఎన్ఆర్ తపస్వి, గుమ్మా సాంబశివరావు, గోళ్లనారాయణరావు, మృత్యుంజయరావు మున్నగు వారితో జరిగింది.

28 ఆదివారం ఉదయం 'భాషా వికాసం – ప్రసార మాధ్యమాలు' అంశంపై ఆచార్య కొలకలూరి ఇనాక్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆముదాల మురళి, ఆచార్య వెలమల సిమ్మన్న, సమ్మెట ఉమాదేవి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ ప్రసంగించారు. సాయంత్రం 'సమాజ వికాసం – పౌర బాధ్యత' అనే అంశంపై ఆచార్య చందు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీపతి రాయుడు, జి.ఎస్.నాగేశ్వరరావు, ఎస్. చెల్లప్ప, జె.చెన్నయ్య, డా॥ కె.వి.కృష్ణకుమారి ప్రసంగించారు.

చివరగా సాయంత్రం 4 గం.లకు 'భాషాభివృద్ధిలో ప్రభుత్వం పాత్ర' అనే అంశంపైన జరగవలసిన సదస్సును గం. 6లకు జరగవలసిన సమాపన (ముగింపు) సభతో కలిపి నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించవలసియున్న తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు, నిర్వాహకులు శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్ణయం ప్రకారం ఈ సంయుక్త సభకు అధ్యక్షత వహించారు.

'భాషాభివృద్ధిలో ప్రభుత్వ పాత్ర' సదస్సులో పాల్గొనవలసియున్న కొత్తపల్లి రవిబాబు, డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, బి.హనుమారెడ్డి, నూర్‌బాషారహంతుల్లా, కె. మధుజ్యోతి, అంబటి మురళీకృష్ణలు ఈ సభలో పాల్గొన్నారు. వీరంతా భాషాభివృద్ధికై ప్రభుత్వం ఏం చెయ్యవలసి వుందో చక్కగా వివరించారు. (వీరి ప్రసంగాల సారాంశాన్ని వీలైతే వచ్చే సంచికలో ఇస్తాము...సం)

ముఖ్య అతిథిగా పాల్గొనవలసిన రాష్ట్ర శాసన సభాపతి డా॥ కోడెల శివప్రసాద్, విశిష్ట అతిథిగా పాల్గొనవలసియున్న భాషా సాంస్కృతిక శాఖామంత్రి భూమా అఖిలప్రియ పాల్గొనలేదు. మరొక విశిష్ట అతిథి రాష్ట్రమంత్రి నక్కా ఆనందబాబు మాత్రం పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు పద్మభూషణ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ప్రముఖ రచయిత, నటుడు గొల్లపూడి మారుతీరావు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యా లయం ఉపకులపతి యస్వీ సత్యనారాయణ, రాష్ట్ర ప్రణాళికా సంఘ సభ్యుడు పెద్ది రామారావు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా॥ డి.విజయభాస్కర్, చెన్నై ఆదాయపన్ను శాఖ కమీషనర్ ఎం.శ్రీనివాసరావు, తూమాటి సంజీవరావు చెన్నై, తెనాలి పురపాలక సంఘం ఛైర్మన్ పెండేల వెంకటరావు, తెనాలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు సూర్యదేవర వెంకట్రావు, జిల్లా పరిషత్ సభ్యురాలు అన్నా బత్తుని జయలక్ష్మి మున్నగువారు పాల్గొన్నారు.

ముగింపు సభలో అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు 'భాషాభివృద్ధిలో ప్రభుత్వ పాత్ర'ను వివరిస్తూ చేసిన ప్రసంగం సభికుల ప్రశంసలను చూరగొంది. **ప్రభుత్వాలు భాషాభివృద్ధికి బాధ్యత వహించాలని, పాలకుల చేతిలో నిర్ణయాధికారం ఉన్నందున, ఇది తప్పనిసరి అని స్పష్టం చేశారు.** ఆయన తన ప్రసంగ ప్రతులను సభలో అందరికీ అందజేశారు. దానిలో ఈ క్రింది మాటలు ఉన్నాయి.

"రెండేళ్లవుతున్నా, ఇంతవరకూ తెలుగు భాషాభివృద్ధి, ప్రాధికార సంస్థ నిర్మాణం ఏ దశలో వుందో తెలియదు. దానికోసం నియమింపబడిన కమిటీ తన నివేదికను ఇచ్చి కూడా చాలాకాలం గడిచిపోయింది. **స్వతంత్ర ప్రతిపత్తిగల 'తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ'ను వెంటనే నిర్మాణం చెయ్యడానికి సిద్ధపడాలి. కనీసం రానున్న 'ఉగాది' నాటికి సంస్థను స్థాపించగలిగితే – ఇది తెలుగు భాషాభివృద్ధికి చంద్రబాబుగారు చేపట్టిన గొప్ప చర్య అవుతుంది.** అని మనవి చేస్తున్నాను.

ఇక – రెండవ అతిముఖ్య అంశం. **పరిపాలనను నూరుశాతం పాలనను తెలుగులోకి తేవడం. దీనికి కూడా 'ఉగాది'ని గడువుగా పెట్టుకొని ఆనాటినుంచి ముఖ్యమంత్రి కార్యాలయం, ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి – అంటే రాష్ట్ర సచివాలయం నుంచి గ్రామస్థాయి పంచాయితీ కార్యాలయం వరకు తెలుగులోనే పరిపాలన జరిగేట్లు అధికారిక ఉత్తర్వులు ఇచ్చి, దాని అమలుకు ముఖ్యమంత్రిగారే పూనుకోవాలి.**

మూడవది – **జిల్లాస్థాయి వరకు న్యాయస్థానాలు అన్నిటిలో తెలుగులో వాదోపవాదాలేగాక, తీర్పులూ వెలువడాలి. మొత్తం న్యాయస్థానపాలన అంతా తెలుగులోనే జరగాలి. ఇందుకై ఇప్పటికే ఉన్న జి.ఒ.నెం.485 (1974)ను అమలుచెయ్యాలి.**

నాల్గవది–**ప్రాథమిక విద్యలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని తప్పనిసరి చేస్తూ చట్టాన్ని తేవాలి. ఇందుకోసం అవసరమైన అన్నిచర్యల్నీ తీసుకోవాలి. 6 నుండి తెలుగు, ఇంగ్లీషు రెండు మాధ్యమాల్లోనూ బోధనకు ఏర్పాటుచేయాలి.**

జాగ్రత్తపడవలసిన సంగతి ఏమిటంటే – ప్రాధికార సంస్థను స్వతంత్ర సంస్థగా – నిపుణులతో మాత్రమే ఏర్పాటుచెయ్యాలి. దాన్నొక రాజకీయ ఆశ్రయసంస్థగా చెయ్యరాదు. పై నాలుగు అంశాలపై ముఖ్యమంత్రిగారూ, తక్కిన నేతలూ, అధికారులు దృష్టిసారించి, చిత్తశుద్ధితో సంకల్పించి, సాధించాలి. ఇదే ఈ సందర్భంగా బాధ్యులందరికీ నా విన్నపం.

◇ ◇ ◇

మూడు రోజుల సదస్సులతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అలరించాయి. 'మార్క్సిస్టు గాంధీ బొల్లిముంత', 'తెనాలి చారిత్రక వైభవం' అనే పుస్తకాల్ని ఆవిష్కరించారు. రాజేంద్ర ప్రసాద్‌గారికి తోడుగా పని చేసిన చందు సుబ్బారావు, మార్కండేయులు తదితర కార్యకర్తలు అభినందనీయులు.

◇ ◇ ◇

2018 సంవత్సరాన్ని తెలుగు భాషా వికాస సంవత్సరంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో తొలిగా తెనాలిలో ఈ సభలు నిర్వహించారు. తరువాత కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళంలో ఫిబ్రవరి 10, 11లలో నడుపబోతున్నారని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్య, పాలనా రంగాలలో తమ భాషా విధానాన్ని స్పష్టం చేయకుండా వాటిని అమలు చేయకుండా కేవలం సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలతో సరిపెట్టి ఇదే భాషాభివృద్ధి అంటే నమ్మేందుకు జనం సిద్ధంగా లేరు. ఎన్నికల సంవత్సరంలో ఇలాంటి విషయాలపై స్పష్టత లేకపోతే మొదటికే మోసం వస్తుందని విజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

(ముఖపత్రంపై చిత్రాలతోపాటు, మూడవ అట్ట పై బొమ్మలను కూడా చూడండి)

– 'అమ్మనుడి' ప్రత్యేక ప్రతినిధి

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం -2018
ఫిబ్రవరి 21 : మన కర్తవ్యం


నేడు ప్రపంచవ్యాప్తంగా 7000 భాషల్లో మాట్లాడుకుంటున్నామని ఒక అంచనా. ఇందులో 50% భాషలను ఇంకొన్ని దశాబ్దాలలో పూర్తిగా రూపు మాపెయ్యనున్నాము. ఈ 7000 భాషల్లో 96% భాషలు కేవలం 4% జనాభా మాత్రమే మాట్లాడే మాట్లాడుతున్నారు. కేవలం పదుల్లో భాషలకే చదువులో భాషా మాధ్యమంగా ఉండే అవకాశం ఇచ్చింది ప్రస్తుత సమాజం. డిజిటల్ ప్రపంచం – ఇంటర్నెట్ కంప్యూటర్లలో వంద కంటే తక్కువ భాషలకే అస్తిత్వం ఉంది. భాషలను పెంపొందించేందుకు, సంస్కృతీ వైవిధ్యాలను గుర్తిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 2000 నుండి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నాం.

మన ప్రత్యక్ష పరోక్ష వారసత్వాన్ని కాపాడి, అభివృద్ధి చేసేందుకు భాషలు మన దగ్గరున్న ప్రభావవంతమైన ఆయుధాలు. మాతృభాష పరిరక్షణకు జరిగే ప్రతి చర్య, భాషా వైవిధ్యాన్ని, బహుభాషావిద్యను పెంపొందించడమే కాక ప్రపంచానికి అవగాహన కల్పిస్తూ మనుషుల మధ్య ఉన్న వైరుధ్యాలను తగ్గిస్తుంది. తద్వారా ప్రపంచశాంతికి దోహదపడుతుంది.

2018 ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మన సంకల్పం ఈ విధంగా : భాషా వైవిధ్యాన్ని భద్రపరచడం, బహుభాషత్వాన్ని పెంపొందిస్తూ ఐరాస 2029కు సాధించాల్సిందిగా ప్రపంచ దేశాలకు నిర్దేశించిన శాశ్వత అభివృద్ధి లక్ష్యాలలో ఒకటైన 'అందరికీ విద్య' ను అందించడం. అందరికీ విద్య అందాలంటే ఆ విద్య చదువరి మొదటి భాషతో పాటుగా అతని ఆమె మాతృభాషలో అందుబాటులో ఉండాలి. చదవడం, రాయడం, చిన్నపాటి లెక్కలు ముందుగా మాతృభాషలో నేర్చుకుంటేనే అవి జీవితాంతం మనతో ఉండిపోతాయి.

– ఐక్యరాజ్య సమితి విద్యా సాంస్కృతిక మండలి (యునెస్కో)

భాషలు మన మానవజాతి మనుగడకు ముఖ్యమైనవి. ఈ భాషలే మన అస్తిత్వానికి, సంభాషణలకు, సమాజంలో మెలిగేందుకు, చదువుకు, అభివృద్ధికి మాధ్యమాలు. అలాంటి భాషలు ప్రపంచీకరణ ముసుగులో కనుమరుగవుతున్నాయి. భాషలు అంతరించిపోయేపుడు తమతో పాటుగా ఆ ప్రాంతపు సంస్కృతి సాంప్రదాయాలను తీసుకుని అంతరించి పోతున్నాయి. ఆ విధంగా ప్రపంచ సంస్కృతీ వైభవం కుంటుపడుతోంది. అవకాశాలు, పద్ధతులు, సంప్రదాయాలు, జ్ఞాపకాలు, అద్వితీయ ఆలోచనలు. ఇవన్నీ ఎంతో విలువైన సంపద – భాషలు కనుమరుగైతే ఇవీ మాయమై పోతాయి.



రెహమానుద్దీన్
9686903386

తెలుగు ప్రాచీన భాషాధ్యయన కేంద్రం

ఒక చర్చ ఇంటర్నెట్ లో రాజుకుంది. అందులో వచ్చిన కొన్ని అంశాలపై చరిద్దాం.

తెలుగు భాషా విశిష్ట కేంద్రం అనేది తెలుగు వారి సొత్తు. అది ప్రాంతాలకతీతం. ఆంధ్ర-తెలంగాణలకన్నా, ఈ రాష్ట్రాల వెలుపల ఒక అంచనా ప్రకారం అంతేమంది తెలుగు మాట్లాడేవారు నివసిస్తున్నారు. (నిరూపణ అలభ్యం). అంటే తెలుగు వారి కోసం నెలకొల్పే సంస్థకు తెలుగు వారికీ కచ్చితంగా భౌతిక సంబంధం అనవసరం. అరవ వాళ్ళు నెలకొల్పుకున్న తమిళ్ వర్చువల్ యూనివర్సిటీ తరహాలో ఒక పూర్తి ఆన్లైన్‌లో పనిచేసే సంస్థను నెలకొల్పుకోవాలి. అలా చేసిన వాళ్ళం మనమే మొదటి వాళ్ళం కావచ్చును కూడా. ఇక నిధులూ గట్రా ఏమయినా ఖర్చు చెయ్యాలంటే అంతర్జాలం కంప్యూటర్ అందుబాటులో లేని వారికి అవి అందించే ప్రయత్నాలకు వాడాలి. స్వామి కార్యం స్వకార్యమూ నెర వేరుతాయి. కాదూ లేదూ ఒక గుమస్తా కచేరీ కావాలంటే రెండు పెట్టుడు కార్యాలయాలు రెండు ప్రాంతాల్లో పెట్టుకోవచ్చు. మిగతా ప్రభుత్వ కార్యాలయాల సంగతేమో కానీ, విశిష్ట భాషా కేంద్రం ఒకవేళ కన్నడ, అరవం, ఒడ్రం లా స్థాపిస్తే ఆ రెండు ప్రాంతాల కచేరీల్లో సందడే సందడి.

కేంద్రప్రభుత్వ వాటాలో 100 కోట్లు విడిగా కేవలం భాషాభివృద్ధికి ఖర్చు పెట్టేందుకు విడుదల అవుతున్నాయి. రాష్ట్ర బడ్జెట్ లో సంక్షేమ పథకాల సరసన ఏనాటికీ భాషాభివృద్ధి సరితూగలేదు - ఏ నాయకుడికీ భాషాభివృద్ధి అత్యావశ్యక అంశం కాదు కాబట్టి. పైగా మొత్తం తెలుగు వారికి జవాబుదారీ పుచ్చుకున్న కొద్ది మంది మధ్య తరగతి తల్లిదండ్రులు స్కూళ్ళేంటి, ఇళ్ళేంటి, ఆఖరుకి ఏడుపు కూడా ఆంగ్లంలోనే ఏడవమని పిల్లలపై ఉరుముతున్నారు. వీరే ప్రభుత్వానికి మార్గదర్శకం చేసేవారూను. ఈ నాయకులంతా వాళ్ళకి నిష్పూచీ - ఏనాటికీ ఆంగ్లానికి పైచేయిగా తెలుగును ఒప్పుకోరు. అందువల్ల పై నుంచి వచ్చిన డబ్బు అయితే సక్రమంగా ఖర్చు అయ్యే అవకాశాలు ఎక్కువ కదా!

సాహిత్య అకాడమీ పుస్తకాలనే తీసుకోండి. దక్షిణ భారతదేశానికి కేంద్రం బెంగుళూరులో అన్ని భాషలకన్నా అతి తక్కువ పుస్తకాలు తెలుగువే, పైగా ఒక సారి ముద్రణ పొందిన పుస్తకాలకు మళ్ళీ మోక్షం లేదు. ఆ డబ్బు ప్రభుత్వం ఖర్చు పెట్టే బదులు పాత పుస్తకాల పునర్ముద్రణకు ఏ సంస్థకు అప్పగించినా కొందరికి ఉపాధి, నాలాంటి వారికి ఆ పుస్తకాల అందుబాటూ కలుగుతాయి. తెలుగులో ప్రారంభ స్థాయి-బాలసాహిత్యం-ఇతర భాషల నుండి తెలుగులోకి అనువాదాలు చాలా తక్కువ. ఇవి లేనిదే తెలుగు మీద ఆసక్తి కలుగదు, ఇవి మొట్టమొదట రూపొందించాల్సినవి! ఇవి లేకుండా ఎన్ని విశ్వవిద్యాలయాలలో పీఠాలు ఏర్పరిచినా లాభం లేదు.

అయినా ఎంత కాదికీ ప్రభుత్వం ఏదో చేసిపెడుతుంది, చేసిపెట్టాలి అన్న ధ్యాసే కానీ, సామాన్యులుగా మనం తెలుగుకు ఏం చేయగలము, భాషను ఆధునిక భాషగా చూసేందుకు ఏం ఏం కొలమానాలున్నాయన్న సంగతి సామాన్యుడికి పడుతుందా? అసలు ఇలాంటి విషయాలు తెలుసుకోడం సామాన్యుడికి ఎంతవరకూ అవసరం?

నేడు అంతర్జాలం వాడుతున్న వారు ప్రధానంగా ఆంగ్ల మాధ్యమంలో నిత్యం సంభాషణలు జరిపే వారు కాబట్టి మనకు పెద్ద ఇబ్బంది కనిపించడం లేదు. కానీ ఈ సంఖ్య అసలు తెలుగు వారి సంఖ్యలో అత్యల్పం అని మనం గుర్తించం. అది మన అజ్ఞానం. దాదాపు 95% మంది ఇంకా తెలుగులోనే ఆలోచిస్తారు, కూడికలు, తీసివేతలూ చేస్తారు. వీరంతా అంతర్జాలం వాడాలంటే తెలుగులో సమాచారం అంతర్జాలంలోకి వాడుకునే రీతిలో(యూనికోడ్)లోకి రావాలి. ఇతర భాషల వారు చెయ్యలేనిది తెలుగువారు చేసి చూపించే అవకాశం చాలానే ఉంది. ఇంక ఏ భారతీయ భాషలో లేనంత సాహిత్యం జాతీయంగా తెలుగులో ఉంది. అదంతా అంతర్జాలానికి వికీసోర్స్ లాంటి వేదికల ద్వారా తరలించగలిగితే ఆ 95% మందికి కాస్త ఊరట కలుగుతుంది. మనందరి కసరత్తు ఈ దిశలో ఉండాలి. ఇక ఇవన్నీ బాహ్య సౌందర్యాన్ని పెంచుతాయి, కానీ లోలోపలి భావ సౌందర్యం పెంచాలంటే?

తెలుగు భాషా వైభవాన్ని తెలిపే పాటలూ, కథలూ, కవితలూ జనాల నరనరాల్లోకి వెళ్ళాలి. భాషాభిమానం అనేది ప్రతిఒక్కరికీ ఉండాల్సిన గుణం. భాషలేందే భావమే లేదు కదా!

అసలు తెలుగు భాష ప్రాచీనమా అనే విషయంలో ఎన్నో తగాదాలు ఉన్నాయి. వేరేవారికి ఈ హోదా దొరికింది కాబట్టి మనకూ కావాలని అర్రులు చాచడం వ్యర్థం. అలాగే ప్రాచీన భాషగా కాక ఆధునిక భాషగా చేస్తే మంచిదా అన్న ఆలోచనను తేలిగ్గా కొట్టేయలేము.

కొత్త యుగం 500 నాటికే తెలుగు ఉందన్న నిరూపణలు కలవు (ధనంజయుని కలమళ్ళ శాసనం). 1000 కొ.యు. నాటికి నన్నయ్య వాగనుశాసనం వ్రాయగలిగాడంటే అప్పటికే తెలుగు పూర్తి వాడుకలోకి వచ్చేసింది. తెలుగు ఎంత అభివృద్ధి చెందిన భాష అంటే దక్షిణ భారత శాస్త్రీయ సంగీతపు రాగాలకు ఏ రాగానికైనా తగిన పదాలతో వినసొంపుగా సాగే భాష మనది, అంతగా భాషలోని పదాలు అభివృద్ధి చెందాయి అంటే ఏనాటి నుండీ భాష అభివృద్ధి చెందుతూ వస్తుందో అంచనా వెయ్యడమే కష్టం. నేటికీ కావ్యాల సంఖ్యలో కానివ్వండి, గద్య-సాహిత్యాల పరంగా చూడండి, లిపి అభివృద్ధి పరంగా చూడండి తెలుగు చాలా పరిణామానికి గురి అయిన భాష-ఈ విషయాన్ని ఎవ్వరూ కాదనలేరు. ఇక తెలుగు పూర్తి ఆధునిక భాష కూడా! ఏ శబ్దాన్నైనా తెలుగులో ఆ భాష మాతృక కలవారు పలికే విధంగా వ్రాసే అవకాశం ఉంది! (భారతీయ భాషా లిపుల మీద నేను గమనించిన చిన్న విషయం)

ప్రభుత్వ రంగ బడ్జెటులను గమనిస్తే వంద కోట్లు పెద్ద మొత్తం కాదు. ఉ.చౌక బియ్యం పథకానికి రెండున్నర వేల కోట్లు కేటాయింపులు ఉన్నాయి. కేంద్రం ఇవ్వకపోయినా వంద కోట్లు పెట్టుకోలేనంత బీద స్థితిలో ఎవరూ లేరు.

కానీ భాషాభివృద్ధికి ఖర్చుపెట్టే విధానం ప్రభుత్వం వద్ద లేదు. ఎలా ఖర్చు పెట్టాలో ప్రభుత్వానికి తెలీదు. ఏం విషయమై ఖర్చు పెట్టాలో తెలీదు. భాషాభివృద్ధికి ప్రభుత్వ పరంగా ఏం చేయవచ్చో అన్న విధి విధానాలు లేవు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (లేదా ఇంకో అందమయిన పేరు) అంటూ భవనాలకు ఇతర హంగులకు ఖర్చు పెట్టడం ప్రభుత్వాలకు మాంచి సరదా. ఉచిత పబ్లిసిటీ, ఏదో సాధించామన్న ఊకదంపుడుతో పాటు కాంట్రాక్టర్లకు వడ్డింపులు ఉంటాయి మరి. ఆయా సంస్థలలో ఎలాంటి పరిశోధన జరగాలి, వాటి ద్వారా వచ్చే ప్రయోజనం ఏమిటి అనే విషయాలపై ఎవరికీ ధ్యాస ఉండదు.

ఈ విషయమై తెలుగు బ్లాగరులు, జాలరులకు మంచి అవకాశం ఉంది. అంతర్జాలం వేదికగా ప్రభుత్వానికి ధీటుగా ఇలా కూడా భాషాభివృద్ధికి తోడ్పడవచ్చా, ఔరా!, అని అనుకునేలాంటి పనులు మనమే చేసి చూపవచ్చు. అదీ సున్నా ఖర్చుతో.

తెలుగు భాష పునరుజ్జీవనం అంశంలో ఎంతో కృషి చేయాల్సిన అవసరం ఉంది. అందుకు భాషాభిమానులు, పండితులు మరియు భాషాశాస్త్ర నిపుణులు (linguists) కలిసి మేధోమథనం చేయాలి.

ఈ విషయం అందరూ ఏకీభవించేదే.

లిపి/వ్యాకరణ సంస్కరణ, నిఘంటువులు, భాషా సరళీకరణ, మరుగున పడ్డ తేటతెలుగు పదాలను తిరిగి వాడకంలో తీసుకురావడం, పద్య రచన పునర్వైభవ ప్రాప్తి, కోల్పోయిన పద్య/గద్య సంపద పునర్నిర్మాణం, చేతిరాతల (manuscripts) స్కానింగ్/డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్/కీబోర్డు వ్యవస్థ లాంటి స్థూలాంశాలను (broad headings) ముందుగా గుర్తించాలి. ప్రతిదానిలో కొన్ని కొన్ని ముఖ్యమయిన సూక్ష్మ పరిశోధనా విషయాలను (specific research outline) ఖరారు చేయాలి. ఆయా పరిశోధనల లక్ష్యాలు, మానవ, ధన వనరులు, కాల పరిమితి వగైరా విషయాలను రికార్డు చేసుకోవాలి.

లిపి/వ్యాకరణ సంస్కరణ : తెలుగులిపి చాలా వరకూ తాళపత్రాలపై త్వరగా వ్రాసేందుకు అనువుగా రూపుదిద్దుకుంది. అందరిలో బాగా జీర్ణించుకుపోయిన అంశం. ఇది మారాలంటే క్షేత్ర స్థాయిలో ప్రక్షాళన జరగాలి. అరవంలో ఇలా రెండు పర్యాయాలు జరిగింది. మొదట అరవంలో లేని వర్ణాలన్నీ (శ, విసర్గం, క-ఖ లకు 1,2 ద్వారా తేడా మొ?) స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో భాషా నిపుణుల ద్వారా చేర్చబడ్డాయి, ఇవి జీర్ణించుకునేందుకు దాదాపు మూడు తరాలు పట్టింది, వెంటనే అన్నాదురై నుండి వచ్చిన సంస్కృత-హిందీ వ్యతిరేక ఉద్యమం వలన ఇవి మళ్ళీ లుప్తాక్షరాలుగా చెయ్యాలి అనీ, అంతకు ముందు వాడిన వర్ణాలనే వాడాలనే నిర్ణయం జరిగింది. ఇప్పటికీ ఈ అంశం వారిలో చాలా అయోమయాన్ని నింపుతుంది. అంతర్జాలమే అన్నీ అని నమ్ముతున్న నేటి తరానికి ఇది అవరోధం కాదు. తెలుగులిపి కష్టతరం అనుకునే వారు పూర్తి రోమన్ లిప్యంతరీకరణ వాడుతున్న రోజులివి. 'ఈమాట' లాంటి జాలస్థలాలు RTS లో చదివే విధానాన్ని అదనంగా ఇస్తున్నాయి. లిపి పరంగా సంస్కరణలు తేవాల్సిన అగత్యం అయితే లేదు. ఇక వ్యాకరణ పరంగా ఏ విధమైన సంస్కరణలు రావాలని చూస్తున్నదీ వ్యాఖ్య రచయిత తెలుపలేదు.

నిఘంటువులు : ఇవి అత్యంత అవసరం. పారిభాషిక పదకోశాలు, మాండలిక పదకోశాలు, యాస పదకోశాలు, బూతుల పదకోశాలు, సాంకేతిక నిఘంటువులు రూపొందించడమే గాక అన్ని రకాలుగా (అంతర్జాలంలో, పుస్తకాలుగా, దృశ్యక శ్రవ్యకాలుగా) అందుబాటులోకి తేవాలి.

భాషా సరళీకరణ : తెలుగు ఇప్పటికే సరళమయిన భాష. కానీ ఎందరో సంస్కృత మోహం కలిగిన పండితుల వలన సాహిత్యంలో తేట తెలుగు మాటలు చోటు చేసుకోలేక పోయాయి. సినిమాలు ఈ విషయంలో నిరాశను ఇస్తున్నాయి. అందువలన సరళ పదాలతో సాహిత్యం రావాల్సిన అవసరం ఉంది. ప్రారంభ స్థాయి సాహిత్యం ఉండటం ఆ భాష నిలకడకు ఉపకరించే ప్రధాన తొలిమెట్టు, తెలుగులో చాలా తక్కువ ప్రారంభ స్థాయి సాహిత్యం ఉంది. ఇది బాగా అభివృద్ధి చెందాలి.

మరుగున పడ్డ తేటతెలుగు పదాలను తిరిగి వాడకంలోకి తీసుకు రావడం : జనాలకు నిత్యం వినపడే, కనపడే వనరుల ద్వారానే ఇది జరుగుతుంది, అందుకని సినిమాలు, ఎఫెం రేడియో, వార్తా పత్రికలు, బ్లాగులు, సంభాషణలు అన్నింటా మెల్లి మెల్లిగా కొన్ని పదాలను చొప్పించాలి. సంభాషణలలోకి తేట తెలుగు పదాలను ఇమిడ్చి మాట్లాడుకోవాలి. ;

పద్య రచన పునర్వైభవ ప్రాప్తి : ఇప్పటికే ఆంధ్ర ప్రభుత్వం 100 కవితలు వ్రాసిన కవులకు ముద్రించుకునేందుకు డబ్బు సహాయం అంది స్తామని వారి మేనిఫెస్టోలో ప్రకటించారు. ఇంకా ఎన్నో సంస్థలు, ఎందరో పెద్దలు కవులకు సత్కారాలు చేస్తూ పురస్కారాలు అందిస్తున్నారు. ఈ సంస్థలు లేదా ఆ సహాయం అందించే ప్రభుత్వ అధికారులు నెల నెలా కవి సమ్మేళనాలను వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తూ కవితకు ఉండాల్సిన స్వరూపాన్ని వక్కాణిస్తూ సూచనలు పంపగలిగితే బాగుంటుంది.

కోల్పోయిన పద్య/గద్య సంపద పునర్నిర్మాణం : ఇప్పటికే ఎందరో ఈ విషయమై కృషి చేస్తున్నారు. కోల్పోయిన సాహిత్యంతో పాటూ ప్రస్తుతం ఉన్న సాహిత్యాన్ని శాశ్వత పరిచే దిశగా అందరూ కృషి చేయాలి. కానీ శాశ్వత పరచడమంటే స్కాన్ చేసి పెట్టడమనే అల్పబుద్ధి గల వారున్నంత వరకూ ఏమీ చేయలేము. పూర్తి యూనికోడ్ పాఠ్యం చేసి భద్రపరచడమే సరియయిన మార్గం. లాభాపేక్షతో కొందరు సంగ్రహ కర్తలు స్వార్థంతో వారి వద్దనే కొన్ని అపురూప రచనలను జనసామాన్యానికి దూరంగా ఉంచుతున్నారు. వారు చనిపోవడంతో ఆ రచనలూ నాశనమవుతున్నాయి, తెలుగువారు ఈ అలవాటును విడనాడాలి.

చేతివ్రాతల; (manuscripts) స్కానింగ్/డిజిటల్ లైబ్రరీ : ఒక రాష్ట్రానికి చెందిన చేతివ్రాతలను వేరే రాష్ట్రం వారు కనీసం బొమ్మల రూపంలోనైనా తీసుకుపోరాదు అన్న నిబంధనలు పెట్టే కుచించుకుపోయిన మనస్తత్వం కల వారి మధ్య మనమున్నాము. ఏం చేయగలం? కుదిరినన్ని విధాలలో వీటిని పలుచోట్ల భద్ర పరచాలి.

కంప్యూటర్/కీబోర్డు వ్యవస్థ లాంటి; స్థూలాంశాలను;(broad headings) ముందుగా గుర్తించాలి. ప్రతిదానిలో కొన్ని కొన్ని ముఖ్యమయిన సూక్ష్మ పరిశోధనా విషయాలను (Specific research outline) ఖరారు చేయాలి. : ఈ దిశగా ఎందరో ఇప్పటికే పని చేస్తున్నారు (IIT-M imli, IIITh, HCU, JNTU వారి పరిశోధనలు). ఇక ఎందరో కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను (వీవెన్ గారు, ఇతర


– తెలుగు సభ్యులు, నేనూను) సంప్రదించేలా ఒక వ్యవస్థ ఏర్పడాలి.

ఆయా పరిశోధనల లక్షాలు, మానవ, ధన వనరులు, కాల పరిమితి వగైరా విషయాలను రికార్డు చేసుకోవాలి. : ఇది పరోక్షంగా, ప్రత్యక్షంగా కొన్ని సందర్భాలలో జరుగుతోంది.

ఒక్క మాటలో చెప్పాలంటే – తెలుగు భాషకు ఒక మానిఫెస్టో కావాలి. ఇదంతా చేయడానికి ఎందరో పెద్దల సహకారం అవసరం. ఈ ప్రక్రియకు ఖర్చు ఆట్టే కాదు కానీ అందరినీ ఒకదగ్గర జమ చేయడం, వారి చర్చలను రికార్డు చేయడం మరియు వారి నిర్ణయాలను ప్రచురించడం కోసం ఎంతో ఓర్పు, శ్రమ పడుతుంది. సమన్వయ కృషి కావాలి.

వీవెన్
9963029061

తెలుగు భాషకి ఆధునిక హోదాకోసం జాలమే వేదిక!



సమిష్టి కృషికీ సమన్వయానికీ అత్యుత్తమ వేదిక జాలం. వెనుక తరాలకు అందుబాటులో లేని ఈ అద్భుతమైన వేదిక మనకు అందుబాటులో ఉంది. జాలం వేదికగానే అతి పేద్ద విజ్ఞాన సర్వస్వం వికీపీడియా (http://te.wikipedia.org) (287 భాషలు, 3 కోట్ల వ్యాసాలు) సాధ్యమయ్యింది. సురక్షితమైన కంప్యూటర్ నిర్వాహక వ్యవస్థ గ్నూ/లినక్స్ నిర్మాణానికి జాలమే ఆధారం. ఇలాంటి భారీస్థాయి పరియోజనలే కాకుండా అనేక చిన్న చిన్న వ్యాపకాలూ ఇంతకు మునుపెన్నడూ సాధ్యం కాని రీతిలో జాలం ద్వారానే జరుగుతున్నాయి. ఔత్సాహికులు చిన్న సినిమాలు తీసి యూట్యూబులో విడుదల చేస్తున్నారు, కథలు వ్రాసి బ్లాగుల్లో ప్రచురిస్తున్నారు, పద్యాలు రాస్తున్నారు. జాలం మూలంగా మన తలసరి సాంస్కృతిక దిగుబడి మెల్లగా పెరుగుతోంది.

తెలుగు భాష విషయానికి వస్తే ఇదో మహత్తర అవకాశం. సామాన్యులుగా వ్యక్తి స్థాయిలోనూ సంఘటితంగానూ ఏమైనా చెయ్యడానికి ఇప్పుడున్నంత వెసులుబాటు మునుపెన్నడూ లేదు. ఇంగ్లీషు మీడియం బదులు తామరతంపరగా రాక మునుపు తెలుగు భాష మాధ్యమంగా చదువుకున్న చివరి తరం మధ్యవయస్కులుగా మారబోతున్న తరుణం ఇది. ఇప్పుడు కాకపోతే, ఇక ముందు ఏమీ చేయలేం.

వేయి మైళ్ళ ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. తెలుగుకి మేనిఫెస్టో తయారు చెయ్యడానికి మొదటి మెట్టుగా మనందరం మన ఆలోచనలను మన బ్లాగుల్లోనూ, ప్లస్సులోనూ, ఫేస్‌బుక్కులోనూ రాద్దాం. తెలుగుకి ఆధునిక హోదా అంటే ఏమిటి? అది సాధించడానికి ఎవరెవరు ఏమేం చెయ్యాలి? మనం ఏం చెయ్యొచ్చు? కేవలం మీ ఆలోచనలే కానవసరం లేదు. పండితుల తోనూ, మేధావుల తోనూ, మీ తోటి సామాన్యులతోనూ మాట్లాడండి. వారి ఆకాంక్షలను తెలుసుకోండి. బయటి ప్రపంచంలో జరిగే చర్చల సారాంశాన్ని జాలంలో పంచుకోండి. ఈ మేనిఫెస్టో తయారీ తతంగం అంతా ఒక్కచోటే జరగాల్సిన పనిలేదు. జాల పుటలను లంకెలతో కలిపి ఎక్కడి నుండి ఎక్కడికైనా చేరుకోగలిగే సౌలభ్యాన్ని వాడుకుందాం. సంబంధిత అంశాలకు మీ టపాల నుండి లంకెలు వేయండి. తెలుగు భాష, అభివృద్ధి గురించి మీరు ఇప్పటికే ఏమైనా అచ్చు పత్రికలకు వ్రాసి ఉంటే, వాటిని వెతకగలిగేలా చేయండి, వాటికి లంకె వెయ్యగలిగేలా చెయ్యండి (అంటే యూనికోడ్ తెలుగులో జాలంలో పెట్టండి).

కొందరు ఔత్సాహికులం ఇటువంటి ఆలోచనలను క్రోడీకరించడానికి ఒక వికీని మొదలుపెట్టాం. http://www.irusu.in వద్ద ఆ వికీని చూడవచ్చు.

ఆదర్శాలు కాకుండా తేలికగా అమలుపరిచగలిగే వినూత్న, సృజనాత్మక ఆలోచనలను చేయండి, వాటిని అందరితో పంచుకోండి.

తెలుగు కేవలం కథలు, కవితలకో లేదా మామూలుగా మాట్లాడుకోడానికో మాత్రమే మిగిలిపోకుండా సమాచార సాంకేతిక రంగంలో, పాలనలో, బోధనలో ఎలా ఉండాలి? వాదాలలో పడి కొట్టుకుపోకుండా, కార్యాచరణ దిశగా ఫలితాల దిశగా, ఎలా ప్రయాణించగలం? ఆలోచించండి, ప్రశ్నించండి, ప్రేరణనివ్వండి!

అడగందే అమ్మైనా అన్నం పెట్టదు.

నేటి మార్కెట్ – నిర్దేశిత ఆర్థిక వ్యవస్థలో, వ్యాపార సంస్థల నుండి తెలుగుకి ఏమైనా ఆశించడానికి (అంటే వారి ఉత్పత్తులను తెలుగులో అందించడం వంటివి), మన తెలుగుకి మార్కెట్ ఉందనిపించగలగాలి. మనం వారిని అడగాలి. ఆయా నిర్ణయాలు తీసుకునే వారు మన ఆశయం ఆవేశాలపై గాక దత్తాంశంపై ఆధారపడతారు. అదెలా పెంచగలం?

ఇంకా... ఇంకా... మీ ఆలోచనల కోసం ఎదురుచూస్తున్నాను.

భాష లేకపోతే భావం లేదు ; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

19.12.2017న ఉదయం ఉదయం గం. 10 లకు తెలుగు విశ్వవిద్యాలయం-శ్రీబిరుదురాజు రామరాజు ప్రాంగణం 'తెలంగాణలో తెలుగు-భాషా సదస్సు'లో

తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు ఉపన్యాసం



మిత్రులారా!

అనవసరమైన మాట ఒకటి మనలో ప్రచారంలో ఉంది. అదేమిటంటే తెలుగు ప్రజలకు భాషంటే ప్రేమలేదు, అభిమానం లేదు-అని. నేను వృత్తిరీత్యా వైద్యుడిని. తెలుగు అధ్యాపకుడిని కాదు. తెలుగులో పరిశోధన చేసినవాడిని కాదు. నాకు 72 ఏళ్లు సమీపిస్తున్నాయి. దాదాపు 45 ఏళ్లు పూర్తిగా వృత్తిలోనే ఉన్నాను. తరువాత నా అనుభవంలో...మీలో అనేకమంది బాధపడుతున్నట్లే, తెలుగుజాతి పరిస్థితి ఇట్లయ్యిందేమిటి అని ఆలోచనలో పడి, అనుకోకుండా వచ్చిన పరిణామంతో నేను పూర్తిగా భాషోద్యమంలోకి వచ్చాను. తెలుగు భాషోద్యమ సమాఖ్యను 2003లో సి. ధర్మారావుగారు, బుద్ధ ప్రసాద్‌గారు మిగతా మిత్రులతో కలిసి స్థాపించాము. మొదట్లో కార్యదర్శిగా ఉండి, 2009 నుండి అధ్యక్షుడిగా ఉన్నాను.

తెలుగు భాషోద్యమ సమాఖ్య అనేది కేవలం ఒక రాష్ట్రానికి పరిమితమైనది కాదు. మొత్తం తెలుగు వాళ్లు ఎక్కడెక్కడ ఉన్నప్పటికి కూడా అందరికీ సంబంధించిన ఉద్యమం ప్రారంభించాము. అదికూడా చాలా శాస్త్రీయమైన ఆలోచనతో...2003 ఫిబ్రవరి 21వ తారీఖునాడు, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంనాడు...మాతృభాషను కాపాడుకోవాలని యునెస్కో వారు ఇచ్చిన ఆ పిలుపును అందుకొని. దానికి ముందు మన తెలుగువారి పరిస్థితి ఎట్లా ఉన్నదనే దానిపై 2, 3 సంవత్సరాల క్షేత్రస్థాయి పరిశోధన చేశామని తమకు మనవి చేస్తున్నాను.

తెలుగువాళ్లంటే మనలో చాలా మందిమి ఏమనుకుంటాం, అప్పటి సమైక్య రాష్ట్రం లేదా ఇప్పటి రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్ర అనుకుంటాం. కాదు... మొత్తం తెలుగువాళ్లు భారతదేశంలో ఎంతమంది ఉన్నారో అందులో సగం మంది మాత్రమే ఈ రెండు రాష్ట్రాల్లో కలిపి ఉన్నారు. ఇది మొదట్లో తెలుగు భాషోద్యమ సమాఖ్య చెప్పినప్పుడు చాలామంది ఆశ్చర్యపోయారు. కొందరు అతిశయోక్తిగా కొట్టిపారేశారు. తరువాత ఇవన్నీ నిరూపిస్తూ అనేక వివరాలను బయటపెట్టిన తరువాత ఇప్పుడు ఎవర్ని కదిలించినా, రాజకీయ నాయకులను కదిలించినా తెలుగువారు 18 కోట్లమంది అని టక్కున చెప్పే పరిస్థితి – ఈ పది పదిహేనేళ్లలో వచ్చింది. తెలుగువారు 10 కోట్లని, 15 కోట్లని కొందరు రాస్తున్నారు కాని తెలుగువారు అచ్చంగా 18 కోట్లు పైమాటే. మరి ఇంతటి తెలుగుజాతికి వాళ్ల మాతృభాష మీద, తెలుగు భాష మీద అభిమానం లేదా? ఎంత తీవ్రమైన ఆరోపణ ఇది! ఈరోజు రాజకీయ రంగంలో ఉన్నవారు, కేవలం మేధావులం అనుకునేవారు మాత్రమే మాట్లాడతారు. మనకు ఎందుకు ప్రేమలేదండి?!

ఇవాళ భాషను విస్మరించిన వాళ్లు ఎవరంటే మేధావులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు. చాణక్యుడు ఒక మాట చెబుతాడు అర్థశాస్త్రంలో...అర్థశాస్త్రం అంటే రాజకీయాలు, ఆర్థికం, పాలన సంబంధ విషయాలు కలిసింది. దానిలో రాసిన మాట ఏమిటంటే అన్ని శాస్త్రాల్లోకి అర్థశాస్త్రం గొప్పది అని. అంటే పొలిటికో ఎకనమిక్స్ అని ఇప్పుడంటుంటామే – అది. రాజు చేతిలో నిర్ణయాధికారం ఉంటుంది. ఆనాడు రాజరికం గాని ఇవాళ ప్రజాస్వామ్యంలోగాని... అధికారం ప్రజల చేతిలో అంటుంటాంగాని, అలా ఎప్పుడూ లేదు. అధికారం ఉండేది పరిపాలకుల చేతిలో. ఇవాళ ఉన్న వ్యవస్థలో ప్రధానమంత్రి చేతిలోగాని ముఖ్యమంత్రి చేతిలోగాని, అది ఉంటుంది. వాళ్లు ఎట్లా అనుకుంటే అట్లా అన్ని పనులూ జరుగుతాయి.

ఈ పరిస్థితుల్లో ఆలోచించి...'తెలుగుజాతి మొదటినుంచి ఎక్కడెక్కడ ఉంది? ఎట్లా విస్తరించింది? ఏ విధంగా భౌగోళికంగా, రాజకీయంగా మోసపోయింది?' అనే వివరాల్లోకి వెళ్లినప్పుడు మనకు తెలుస్తుంది. భారతదేశంలో విస్తృతంగా ఉన్నటువంటి కొన్ని సంచార కులాల వారి చరిత్ర చూస్తే... వారి మూలాల్లోకి వెళితే తొంభైశాతం మందివి తెలుగు మూలాలే. అయితే ఈ వివరాల్లోకి పోతే ఇక్కడ సమయం చాలదు. మొత్తం తెలుగువాళ్లు ఎక్కడెక్కడ ఉన్నది, వారి చరిత్ర, భాష ఎట్లా ఉన్నది కూడా చెప్పగలను. కారణం 15, 20 సంవత్సరాలుగా మేము చేస్తున్న కృషి.

తెలుగుభాషోద్యమ సమాఖ్యకు అనుబంధంగా తెలుగువాణి అనే ట్రస్టును 2004లో పెట్టాం. ఆ ట్రస్టు పని అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో కాదు. ఇప్పటి రెండు రాష్ట్రాల్లోనూ కాదు, పొరుగు రాష్ట్రాల్లో. తెలుగు రాష్ట్రాలు కాకుండా ఉన్న ఇతర రాష్ట్రాలన్నమాట. ఎందుకు అక్కడ పనిచేస్తూన్న దంటే, ఇందాక మనవి చేశాను చూడండి. తెలుగువారు సగంమంది అక్కడ ఉన్నారు. మిగతా సగం మంది పొరుగు రాష్ట్రాల్లోనూ ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్నారు. వాళ్లు ఇంట్లో తెలుగు మాట్లాడుకుంటారు. ఇందాక మిత్రులు చెప్పారు...సమైక్య రాష్ట్రంలో తెలంగాణ నేల, తెలంగాణ యాస ఎలా అవమానం పాలయ్యిందో.. అదే పరిస్థితి ఎన్నో రెట్లు తమిళనాడులోని

తెలుగువారికీ ఉంది. కర్ణాటకలో ఉంది. ఇతర రాష్ట్రాల్లో ఉన్నది.

విభిన్న తీరుల్లో ప్రజలు తెలుగును మాట్లాడడాన్ని విమర్శించేవారు చదువుకున్నామని అనుకునేవాళ్లే...తెలుగంటే ఇట్లాగే ఉండాలి అనుకునేవారు. వాళ్లంతా కూడా గిడుగు రామ్మూర్తిగారు చెప్పిన ఒక విషయం తెలుసుకోవాలి. "వచ్చింది"... 'అమ్మ వచ్చింది' అని అన్నప్పుడు 'నాన్న వచ్చిండు' అన్నది ఎందుకు కరెక్టు కాదు? చాలా సున్నితమైన విషయం...ఆలోచించండి. అమ్మ వచ్చింది అని కోస్తాలో .. మిగతా అన్ని ప్రాంతాల్లో కూడా అంటాం. అట్లా అమ్మ వచ్చింది అన్నప్పుడు నాన్న వచ్చిండు అంటే తప్పు ఎట్లా అవుతుంది. నాన్న వచ్చాడు అంటున్నాం. బాగానే ఉంది. కానీ వచ్చిండు తప్పు ఎట్లా అవుతుంది. గిడుగు రామ్మూర్తిగారు వేసిన ప్రశ్న ఇది. భాషా శాస్త్రంలో ఏ విశ్వవిద్యాలయాల సర్టిఫికెట్లూ లేని మొదటి తెలుగు భాషాశాస్త్రజ్ఞుడాయన అని అందరూ గుర్తించారు. ప్రజల నోటినుంచి భాష ఏ రకంగా వస్తే, ఏ రకంగా జాలు వారితే అది కరెక్టే. అంతేగాని పండితులు దాన్ని వ్యాకరణ భూతద్దంలో చూసి దాని ఈకలు పీకి చెప్పేది మాత్రమే భాష కాదు.

ప్రజల భాషలో పాఠాలు చెప్పాలి. ప్రజల భాషలో పరిపాలన చేయాలి. ఇది కనీస కర్తవ్యం. ప్రత్యేకించి భాషారాష్ట్రాల ఏర్పాటు జరిగింది. మిత్రులారా బాగా గుర్తుపెట్టుకోండి. భాషా రాష్ట్రాల ఏర్పాటు ఎందుకు జరిగింది? భాషా రాష్ట్రాలను ఎందుకు కోరారు? స్వాతంత్ర్య ఉద్యమం బలంగా సాగుతున్న రోజుల్లోనే మనకు భాషారాష్ట్రాలు కావాలని కోరడం జరిగింది. అప్పుడు గాంధీగారు 'ముందు స్వాతంత్ర్యం రానివ్వండి. వచ్చిన తరువాత అలానే చేసుకుందాం, అన్నారు. ఆ ప్రకారం భారత కాంగ్రెస్ ఆ రోజుల్లోనే తీర్మానం చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఆ లక్ష్యం నెరవేరకపోతే అప్పుడు ఉద్యమాలు సాగాయి. ఆ ఉద్యమంలో ముందున్నవాళ్లు తెలుగువాళ్లని మనం చెప్పుతాం. కాని భాషారాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ పోరాటంలో పాల్గొన్నవాళ్లుగాని, తరువాత ముఖ్యమంత్రులు అయినవాళ్లుగాని, వివిధ రకాల రాజకీయ అధికారంలోకి వచ్చినవారు గాని ఏన్నాడైనా భాషను పట్టించుకున్నారా? పట్టించుకోలేదు. కేవలం పి.వి. నరసింహారావుగారి హయాంలో కొంతకాలం, ఆ తరువాత ఎన్టీఆర్ హయాంలో కొంతకాలం తప్ప మిగతా కాలంలో ఏనాడు కూడా భాషను పట్టించుకోలేదు. ఇవాళ గొప్ప సంగతి.. మనం గర్వించతగ్గ సంగతి ఏమిటంటే ముఖ్యమంత్రిగా ఉన్న కెసీఆర్ గారు, ఆయనే ఇక్కడ ఇప్పుడు భాషోద్యమాన్ని ప్రారంభించారు. ఇక్కడ అది మనం గుర్తించాలి. ఇక్కడ కేవలం ఆయన పరిపాలకుడుగా కాదు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమం జరుగుతున్నప్పుడే తెలుగుభాషోద్యమ సమాఖ్యగాని, మా పత్రిక గాని, మా ఉద్యమకారులుగాని అందరం ప్రత్యేక రాష్ట్ర వాదాన్ని సమర్థించాం.

2013లోనే నడుస్తున్న చరిత్రలో 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలుగు భాష పునర్నిర్మాణం, తెలుగు వైభవంకోసం మళ్లీ కృషి, తెలుగు భాష పునరుద్ధరణ తెలంగాణ నుంచే మొదలవుతుందని' రాశాం. ఎప్పుడిదీ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు. అదే ఇప్పుడు జరుగుతున్నది. నేను పూర్తిగా కేసీఆర్‌గారి చర్యను సమర్థిస్తున్నాను. రెండు మూడు విషయాలను ఇక్కడ లోతుగా గమనించాల్సిన అవసరం ఉంది. కేసీఆర్‌గారిప్పుడు తీసుకున్న నిర్ణయమే చాలా మంచి నిర్ణయం. కానీ

మిత్రులారా...తెలుగుని ఒక భాషగా మాత్రమే చదువుకుంటే అది ఒక బి.టి. విత్తనం వంటిది అవుతుంది. బి.టి. విత్తనం అంటే తెలుసుకదా బయోలాజికల్లీ టర్మినేటెడ్ సీడ్, అది మళ్లీ పంటకు వేయడానికి పనికిరాదు. మరొక పోలిక చెప్తాను క్షమించండి. సంతాన యోగ్యత లేనటువంటి అమ్మాయికి, అబ్బాయికి పెళ్లి చేస్తే సంతానం కలుగదు. జాతి పెరగదు. ఒక భాషగా మాత్రమే – ఒక సబ్జెక్టుగా మాత్రమే తెలుగును నేర్పడం అంటే జరిగేది అదే. కావలసినది ఏమిటంటే ఆ భాషను పరిపాలనలోని అన్ని రంగాల్లోను, విద్యా రంగం అన్ని స్థాయిల్లో కూడా తెలుగును మీడియంగా ఉపయోగించుకున్నప్పుడు మాత్రమే భాష ఎదుగుదల ఉంటుంది. ఉపయోగించని భాష ఎదగదు.

కేవలం ఒక భాషగా, సబ్జెక్టుగా చెపితే... మొదట కొన్నాళ్లు వాచకం చెపుతారు. ఆ రాజు గొప్పవాడు లేదా ఈ ముఖ్యమంత్రి గొప్పవాడు. ఆధునిక సాహిత్యం గొప్పదనం, మళ్లీ శ్రీకృష్ణదేవరాయలు, సోమన, నన్నయ, మరొకటి మరొకటి సాహిత్యం గురించి చెప్పుకుంటాం. ఇలా చదువుకున్నవారందరూ కూడా సైన్సు, టెక్నాలజీ మొదలైన ఇతర సబ్జెక్టులన్నీ ఇంగ్లీషులో చదువుకుంటారు. కాబట్టి వాళ్లంతా నిత్య వినియోగంలో ఏం వాడతారు? ఇంగ్లీషే వాడతారు. ఇందాక మన మిత్రులు ఎంతో కష్టపడి నిఘంటువులు తయారు చేస్తున్నాం అని చెప్పారు. వాటిని ఉపయోగించుకోవాలి కదా. ఎవరికీ అవసరం లేదు. ఈ రోజు తాజాగా ప్రపంచంలో వస్తున్న కొత్తకొత్త పరిణామాల్లో అనేక కొత్త కొత్త పదాలకు మన భాషలో మాట లేనప్పుడు మళ్లీ ఎలా చదువుకొంటాం. అయితే ఇదంతా కెసిఆర్‌గారికి తెలియదా? బాగా తెలుసు. తెలిసే వ్యూహాత్మకంగా ఇది తలపెట్టారని అనుకుందాం. ముందు ఏదో ఒకటి ప్రారంభింప చేయాలి. 1 నుండి 12 వరకు కనీసం తెలుగు భాషను ఒక సబ్జెక్టుగా నిలిపేటటువంటి యత్నంతో మొదలు పెట్టారు. సంతోషం.

ఒకప్పుడు పి.వి. నరసింహారావుగారి హయాంలో కేజీ టు పీజీ తెలుగు మాధ్యమం వచ్చిన సంగతి ఎవరూ మరిచిపోకూడదు. భారతదేశంలోనే ఒక మాతృభాషలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చకచకా పాక్కుంటూ వెళ్లిన ఘనత కేవలం తెలుగు రాష్ట్రానిదే. అది కేవలం పివి నరసింహారావుగారిదే. పి వి నరసింహారావుగారితో ఈ విషయంమీద కొందరు మిత్రులం చాలాసేపు చర్చించాం. తెలుగు భాషోద్యమసమాఖ్య స్థాపనకు ముందు. ఆయన ఎన్నో విషయాలను చెప్పారు. చిన్న వీధి బడిలో చదువుకున్న వ్యక్తి ప్రధానమంత్రి అయ్యాడు. మనవాళ్లు రకరకా లుగా చెపుతారు. మాతృభాష అంటే కళ్లు, ఇతర భాషలు కళ్లద్దాలు – ఇవన్నీ చెపుతుంటారు. బాగానే ఉంది. ఇలాంటి పోలికలు చాలా చెప్పవచ్చు. కాని ఇవన్నీ చెప్పినంత మాత్రాన ప్రజల్లో ఉద్వేగం, ఉత్సాహం కలుగుతాయా? కలుగవు. ఇంటికి వెళ్లిన తరువాత మా పిల్లల్ని.. లేదా నా మనవడిని ఏ బడిలో వేయాలి? ఎట్లా చదివించాలి? వాళ్ల భవిష్యత్తేమిటి...తెలుగు మాధ్యమంలో చదువుకుంటే వాళ్ళకు ఉద్యోగాలే మైనా వస్తాయా? చదువుకుంటే వారికి పరపతేమైనా ఉంటుందా? ఇవన్నీ ఆలోచిస్తారు. నిన్న రవీంద్రభారతిలో డిజిపి మల్లారెడ్డిగారు మాట్లాడుతూ 30 ఏళ్లబట్టి సంతకం తెలుగులో పెడుతున్నా అన్నారు. నేను దాదాపు 17, 18 ఏళ్లక్రితం దాక ఇంగ్లీషులోనే పెట్టేవాడిని. నాకు సంస్కృతం అంటే పిచ్చి. ప్రసంగాలు కొన్ని ఇంగ్లీషులోనే చేసేవాడిని. మెడికల్

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు

సెమినార్స్‌లో, ఇంగ్లీషులోనే పత్ర సమర్పణ చేసేవాళ్లం. ఆయుర్వేదం చదువుకున్నాం గాబట్టి సంస్కృతంలో పత్రసమర్పణ చేసేవాళ్ళం. ఆ పిచ్చి నాకు వదిలింది దాదాపు 17 ఏళ్ల క్రితమే. నాకునేనే ఆ పిచ్చిని వదిలించుకున్న తరువాత ఒక పూట బ్యాంకుకు వెళ్లి, ఒక అఫిడవిట్ దాఖలు చేశాను. అప్పటినుండి ఇప్పటివరకు తెలుగు సంతకం తప్ప మరొకటి చేయలేదు.

కనుక మల్లారెడ్డిగారికంటే నేను చాలా వెనుక ఉన్నాను. ఆయన ఒక ఉద్యోగంలో, అదీ పోలీస్ డిపార్ట్‌మెంట్, ఐపిఎస్ అధికారిగా ఉంటూ చుట్టూ ఉండే వాతావరణాన్ని ధిక్కరించి ఇలా తెలుగు సంతకం చేయడం చాలా గొప్ప సంగతి. ఇలా ఈ ప్రాంగణంలో ఉన్నవాళ్లల్లో ఎవరూ బయటికి చెప్పనక్కరలేదు, చేతులెత్తనక్కరలేదు. మనసులో చెప్పుకోండి, ఎంత మందిమి తెలుగులో సంతకం చేస్తున్నామో ఒకసారి ఆలోచించండి. మనలో చాలామంది తెలుగులో సంతకం పెట్టాలని ఆలోచించరు. అటువంటి ఆలోచన వచ్చినవాళ్లు మహానుభావులు. మల్లారెడ్డిగారి లాంటివాళ్లు మరి కొద్దిమంది ఉండే వుంటారు.

మరి మనం మన జాతియొక్క గుర్తింపును నిలుపుకొనేదెట్లా? ఇవన్నీ ఆలోచించాలి. ఈ మొత్తానికి ఒక కారణం కనిపిస్తున్నది. నేను నింద వేస్తున్నది కేవలం రెండు వర్గాల మీద. ఒకటి మేధావులు, రెండు ప్రభుత్వాలు. మేధావులకు ఏమీ అక్కరలేదు. మేధావులంటే ఎవరో మీకందరికీ తెలుసు. ప్రత్యేకించి నిర్వచనం అక్కరలేదు. రకరకాల మేథోస్థాయి ఉద్యోగాలలోను, బోధనా వృత్తిలోనూ, న్యాయవాద వృత్తిలోను, డాక్టర్లుగాను, రకరకాలుగా సమాజాన్ని ప్రభావితం చేయగల శక్తి ఉన్నటు వంటివాళ్లు. కళ్లు తెరవాలి. వాళ్లు కళ్లు తెరిస్తే ప్రభుత్వం తోకాడించదు. అప్పుడు రాజకీయ నాయకులు దారిలో ఉంటారు. దారి తప్పరు. ఇవాళ మంత్రుల్ని, ముఖ్యమంత్రుల్ని ఎందుకు ఇంగ్లీషుమీడియంకు పోతున్నారని అడిగితే వాళ్లు ఏం చెబుతున్నారు...'ప్రజలు కోరుతున్నారు' గనుక అని వారంటున్నారు.

ప్రజలు దేన్ని బట్టి కోరతారు! వాళ్లు అవసరాన్ని చూసుకుంటారు. వాళ్ల పిల్లల భవిష్యత్తు చూసుకుంటారు – ఉన్న పరిస్థితులను బట్టి. అంతేగాని వేరేకాదు. ఈ వలయం ఎట్లా ఉంటుందో చూడండి. ఇవాళ కేసీఆర్ గారు చాలా గొప్పపని చేస్తున్నారు. నేను వారిని ప్రశంసించడం వల్ల నాకేదో పదవులు వస్తాయని ఆశించడంలేదు. ఆంధ్రప్రాంతంలో ఉంటున్నాను గనుక, నెల్లో 15 రోజులు అక్కడ ఉంటాను. ఇక్కడా ఉంటాను. ఆంధ్రావాణ్ణని ఎవరూ గూడా నాకు ముద్రవేయవద్దు. నేను తెలుగువారు ఎక్కడ ఉంటే అక్కడ ఉంటాను. అదేదో సినిమాలో చెప్పినట్లు 'ఆడా ఉంటాను, ఈడా ఉంటాను, అట్లా తెలుగు ఎక్కడ ఉంటే అక్కడ ఉంటాను'. తమిళనాడు లోతట్టు ప్రాంతాల్లో, ఓపిక ఉన్నప్పుడు తిరిగాను, కర్ణాటకలో తిరిగాను. వివిధ రాష్ట్రాల్లో తిరిగాను. అతి పేద తెలుగు వారు ఎక్కడ ఉన్నారో వాళ్లింటికి వెళ్లేవాడను. వారి భాషను చూసేవాడిని. లెస్స అనే మాట ఇప్పుడు మనకు లేదు. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని బోర్డుమీద రాస్తాం, బస్సుమీద రాస్తాం, కబుర్లు చెబుతాం. 'లెస్స' అనే వాళ్లు ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లోకాని, తెలంగాణలో కాని ఎవరైనా ఉన్నారాండి? లేకపోవడం అనేది తప్పుకాదు. ఇవాళ దక్షిణాదిలో ఉన్నారు. నా అనుంగు పుత్రుడు స.వెం. రమేశ్ భాషోద్యమ కార్యకర్త. మమ్మల్ని తంజావూరులో ఒక టీకొట్టుకు తీసుకుపోయాడు. 'ఏం నాయనా... లెస్సగుంటివా?' అని అడిగిందామె. 78 ఏళ్ళ వృద్ధురాలు. అక్కడ 'లెస్స' మాట ఇంకా పోకుండా ఉంది. నిన్నటి రాత్రి కొన్ని జానపద గీతాలను – రికార్డు చేసిన వాటిని నాకు వినిపించాడు స. వెం. రమేష్. తమిళనాడులో ఉన్నటువంటి గీతాలను లోతట్టు ప్రాంతాలలోని 80 ఏళ్ళ, 90 ఏళ్ళ వృద్ధులు పాడారు. వాళ్ళ కులం చెపుతున్నా నన్ను మన్నించండి. మంచి ఉద్దేశంతో చెపుతున్నాను. వాళ్లంతా మాదిగలు. మాదిగలు అంటే మన హిందూ సమాజంలో అట్టడుగు వర్గంగా వర్గీకరింపబడినారు. కమ్మటి తెలుగులో రాగాలు తీస్తూ వాళ్లు వందలాది పాటలను ఇప్పటికీ పాడుతున్నారు. వాటిలో లెస్స అనే మాట అనేకసార్లు వాడారు. ఇలా చాలా అనుభవాలు ఉన్నాయి.

పాలకులకు కావలసింది – చిత్తశుద్ధి. తెలుగు విషయంలో ఆ చిత్తశుద్ధి కేసీఆర్‌గారికి ఉన్నదన్న నమ్మకం నాకుంది, అదే నమ్మకం చంద్రబాబుగారిమీద లేదు. పొరుగు రాష్ట్రంలో ఉండి ఇట్లా అంటున్నానని అనుకోనక్కరలేదు. ఇద్దరూ ఒకటే. తెలుగును సబ్జక్టుగా నేర్పడంతో ప్రారంభించారు కనుక ఒకటి నుండి పన్నెండు వరకు అదయినా తప్పనిసరిగా అమలులోకి వచ్చేటట్లు చూడాలి. ఇక్కడ అతిముఖ్య విషయం గమనించాలి. జీవో నెంబరు 86/2003.. సమాఖ్య కార్యకర్తలు పట్టుబట్టి సాధించారు. ఆనాడు చంద్రబాబునాయుడు గారు టర్మ్ చివరిలో ఉన్నారు. మండవ వెంకటేశ్వరరావుగారు తెలంగాణ వ్యక్తి. విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. శాసనసభలో రెండురోజులు చర్చించాక జీవో నెంబరు 86 వచ్చింది. అప్పుడు మేము పట్టుబట్టిందేమిటంటే ఒకటో తరగతినుంచి ఐదో తరగతి వరకు మాతృభాషా మాధ్యమంలో బోధన పెట్టండి అని అడిగాం. దానిమీద రెండురోజులు చర్చ జరిగాక "మా వల్ల కాదండి ఇది. మేం ఒక పనిచేస్తాం.. మీరు ప్రయివేటు తీర్మానం ఉపసంహరించు కోండి. (ఆ ప్రయివేటు తీర్మానం బుద్ధ ప్రసాదుగారు పెట్టారు...) మేము ఒకటి నుంచి పది వరకు తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడానికి జీవో ఇస్తాం" అన్నారు. జీవో నెం 86/2003 వచ్చింది. ఆ జీవోమీద అభివృద్ధే ఇప్పుడు చేస్తున్నపని.

మిత్రులారా, ఆ జీవో ఎన్నడూకూడా సరిగా అమలు పరచబడలేదు. ఎందుకు అమలు పరచబడలేదంటే... అది అమలు పరచేట్లు చూసేటటువంటి సంస్థ లేదు, వ్యవస్థ లేదు. ముఖ్యమంత్రిగారు కూర్చొని మొత్తం చూడరుకదా...ఇక్కడ కూడా ఇప్పుడు అతిముఖ్యమైన పని. ఒకటి నుంచి పది దాకా కొత్త విషయం కాదు. ఇక్కడ దానిని అమలు పరచడం ఒకటి. రెండు...దానిలో పదకొండు, పన్నెండు తరగతులు అంటే ఇంటర్మీడియేట్ వరకూ చేర్చడం కీలక విషయం. దగ్గర వుండి చర్చ జరిపి సరైన దారిలో పనిచేయడానికి నియమాలు రూపొందించిన ఘనత ఎస్వీ సత్యనారాయణగారికి దక్కుతుంది. ఆయన అధ్యక్షతన ఏర్పాటైన ఆ కమిటీ చాలా పని చేసింది. నాకు తెలుసు. ఈ విషయంలో మేం మాట్లాడుకున్నాంకూడా. ఇంటర్మీడియేట్‌లో దొంగ సంస్కృతం నేర్పుతున్నారు. ఇంటర్మీడియేట్‌లో సంస్కృతం చదువుకున్న వారెవరికీ సంస్కృతం రాదు. వందమందిని దగ్గరనుండి పరిశీలించాం. మా మిత్రుడు రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు చెబితే – మేము చాలా సంస్థలు తిరిగి చూశాం. ఎవ్వరికీ పొట్టకోస్తే అక్షరం ముక్కరాదు సంస్కృతం. కాని తొంభై మార్కులు, తొంభై ఎనిమిది మార్కులు వస్తాయి. ఇంత పెద్ద కుట్ర రెండు దశాబ్దాలుగా జరుగుతోంది తెలుగు నేల మీద. ఆ కుట్రను ఛేదిస్తున్నారు కేసీఆర్‌గారు ఇప్పుడు. దీనికి ఎన్నో ముళ్ల కంచెలు అడ్డాలు ఉన్నాయి. దానికి తొలి నుంచీ సమాఖ్య ఒక సూత్రం పదేపదే చెపుతూ



డా॥ సామల రమేష్‌బాబును సత్కరిస్తున్న మంత్రి శ్రీ జగదీశ్వర్ రెడ్డి, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, డా॥ కె. ముత్యం తదితరులు

వస్తున్నది. దానిని సత్యనారాయణగారు అందిపుచ్చుకున్నారు. ఎందుకంటే సమాఖ్య ఉద్యమంలో మొదటినుంచీ భాగస్వామి ఆయన. ఆయన దగ్గరుండి పెట్టించిన సూత్రం ఏమిటంటే... ఒకటి నుంచి పది దాకా ఏ భాషలో ఆ పిల్లవాడు నేర్చుకున్నాడో లేక ఏ భాషను మాతృభాషగా కలిగి ఉన్నాడో అదే భాషను ఇంటర్మీడియేట్‌లో కంటిన్యూ చేయాలి. సింపుల్. నువ్వు తెలివిగల వాడివి అయితే ఇంటర్లో నీ నోరు మూసేస్తారు. నీ నోట్లో సంస్కృతం కుక్కుతారు. లేదా మార్కులు వేయనంటారు. ఏమిటసలు ఈ దుర్మార్గం. ఇది తెలుగు నేలా? పరాయి నేలా? నా భాషలో చదువు చెప్పరు ! నా భాషలో పరిపాలించరు ! ఏం జరుగుతోందో సామాన్య ప్రజకు తెలియదు. అసలు ఇది ప్రజాస్వామ్యమెట్లా అవుతుంది? తెలుగు రాష్ట్రాలు ఎట్లా అవుతాయి? పైగా ఇంత మోసం చేస్తూ ఇంకో భాషను తెచ్చి కుక్కుతారా... సంస్కృతం అంటే మనకు గౌరవమే. సంస్కృత మాటలు తెలుగులో బోలెడు ఉన్నాయి. వాటిని తీసేయమనం. అవి మన ఇంట్లో మన ఒంట్లో ఉన్నాయి. సంస్కృత వ్యతిరేకినని పొరపాటునకూడా అనుకోకండి. కానీ సంస్కృతాన్ని అడ్డుపెట్టుకొని చేసేటువంటి దొంగ వ్యాపారాన్ని అడ్డుకోవాలి.

మిత్రులారా, నేను కోరుతున్నది రెండే రెండు పాయింట్లు. ప్రపంచంలో అందరూ చెబుతున్నారు, యునెస్కో చెబుతోంది, భారత రాజ్యాంగం చెబుతోంది. కంపల్సరీ ఎడ్యుకేషన్ యాక్టు చెబుతోంది, ప్రాథమిక విద్యను తప్పనిసరిగా మాతృభాషలో నేర్పాలి. అంతేగాని, బుడిబుడి అడుగులతో అమ్మ ఒడినుండి పాఠశాలకు వెళ్ళగానే 'ఒరే ఇంగ్లీషు మాట్లాడాలి... తోలు తీస్తాను'...అంటే, 'తెలుగు మాట్లాడకూడదం'టే వాడు ఏమౌతాడు. ఇంగ్లీషు మాట్లాడడం అప్పుడే నేర్పుతారా... ఏ మాత్రం మానవత్వం లేని విధానాలు ఎందుకుండాలి? ఈ విధానాలు పోవాలంటే ఒకటినుంచి ఐదు దాకా మాతృభాషలోనే తప్పనిసరిగా బోధించాలి. ఆ పిల్లాడిది ఏ మాతృభాష అయితే ఆ మాతృభాషలో నేర్పాలి. ఒక తెలుగే అనడంలేదు, మాకేమీ భాషా ఉన్మాదం లేదు. ఇది శాస్త్రీయమైనటువంటి, మానవీయమైనటువంటి, రాజ్యాంగబద్ధమైన టువంటి, అంతర్జాతీయ న్యాయ సూత్రాలు ఆమోదిం చినటువంటి సిద్ధాంతం. దీనిని తీసుకురావడంకోసం కేసీఆర్ గారు తప్పకుండా పనిచేస్తారని నమ్మకం మాకు న్నది. దానితోపాటు... ఇప్పుడు నా మనుమరాళ్లను. హైదరాబాదులో తెలుగుమీడియంలో చేర్చాలంటే ఎక్కడా స్కూలు దొరకలేదు. దొరకకపోతే ఏం చేస్తాం.. పక్కనున్న స్కూల్లో చేర్చాం. ఈ పరిస్థితి పోవాలి. తెలుగు మీడియంలో పిల్లల్ని చేర్చాలి అనుకున్నప్పుడు.. నాకు తెలుగు మీడియం స్కూలు దొరకాలి. అది అందుబాటులో ఉండాలి. ఇది ప్రభుత్వ బాధ్యత. ఎలాగైతే తెలుగు భాషను ఒకటి నుండి పన్నెండు వరకు ఒక కంపల్సరీ సబ్జెక్టు చేస్తున్నారో ఆ మాదిరిగా ఈ తెలుగు మీడియం బడిని అందుబాటులో ఉంచి మాట్లాడండి. 'తెలుగు మీడియంలో ఎవరు చేర్పిస్తున్నార'ని అడగే హక్కు ఎవరికున్నదని అడుగుతున్నాను. ముఖ్యమంత్రిగారికి నా విన్నపం ఏమిటంటే, అందరికీ ఆ బడులను అందు బాటులో ఉంచితే ఎంతమంది చేరతారో చూద్దాం. అంతేగాని, ఆంధ్రప్రదేశ్ మాదిరిగా చేయకండి. జీవో నెంబరు 14ను ఇష్యూ చేసి తెలుగుకు ప్రవేశం లేదు అని పెట్టేశారక్కడ. అట్లా చేయకూడదు.

చివరిగా రెండో పాయింట్...శాసనం చేయాలి. లేకపోతే ఎన్ని చెప్పినా అన్నీ కబుర్లే. అమలు కావు. ఒక మంత్రిత్వ శాఖ కావాలని, దానితోపాటు అనేక డిమాండ్లు పెట్టి దేనికీ ప్రభుత్వం ఒప్పుకోనందున – తిరుపతిలో 2012లో జరిగిన ప్రపంచ మహాసభలను మేము బహిష్కరించాం. రోడ్లమీద పడి సత్యాగ్రహం చేశాం. నిరసన వ్యక్తం చేశాం. ఆ సభలను అప్పుడు పెట్టొద్దని మేం అడిగాం. అయినప్పటికీ పెట్టారు గనుక మేం కొన్ని డిమాండ్లు పెట్టాం. దానిలో ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను పెట్టండి అని అడిగాం. ఏవండీ...రాజకీయ నాయకులకు ఇంగిత జ్ఞానం లేదా... భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినాక కర్ణాటకలో మంత్రిత్వ శాఖ పెట్టారు. మంత్రిని ఇచ్చారు. తమిళనాడులో పెట్టారు. వాళ్ల భాషను అభివృద్ధి చేసుకున్నారు. మరి ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు రాలేకపోయింది? ఇది ఎవరు చేసిన కుట్ర? అని ఆ రోజు నిగ్గదీసి అడిగాం. ఒక వాగ్దానం. ఆ తీర్మానం తరవాత సరిగ్గా సంవత్సరానికి 2013 డిసెంబరు 31న జీవో వచ్చింది. అది జీవో నెంబరు 909. ఆ ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఇవాళ భాషా మంత్రిత్వశాఖలు సాంస్కృతిక శాఖతో కలసి ఉన్నాయి. దీనికల్లా ఏం చేయాలంటే.. జి.ఒ.లు అమలు జరగాలని కోరటం..గాలిలో మాటలమూటలు కడితే చాలదు. ప్రాధికారిక సంస్థ – అదే డెవలప్‌మెంట్ అథారిటీ ఉండాలి. అది చేసే నిర్ణయాలు శాశ్వతం కావాలి. బోర్డుమీద పేర్లు రాయిస్తామంటే సరిపోదు, అడిగారు కదా అని అని ఏదో మూల నాలుగు అక్షరాలు రాస్తారు. మొత్తం బోర్డు ఇంగ్లీషులో ఉంటుంది. ఇట్లా మోసాలు జరుగుతున్నాయి. ఇట్లా కాకుండా చట్టాలు జి.ఒ.లు అమలు పరచాలంటే మొన్న ఇచ్చిన జీవో, దానికి ఒక రెగ్యులేటరీ అథారిటీ, డెవప్‌మెంట్ అథారిటీ. తెలుగు ప్రాధికార సంస్థ ఉండాలి. ఇప్పుడున్నటువంటి అధికార భాషా సంఘం సరిపోదు. అది ఒక శవాకార సంస్థ. అనవసరంగా పెద్దవాళ్లను పెట్టి వాళ్ల పరువు తీస్తున్నారంతే తప్ప,

(...తరువాయి 22వ పుటలో)

డా॥ వేదగిరి రాంబాబు
9391343916

మహనీయుల మరణ వాఙ్మూలం- 1

మరణ వాంగ్మూలం ఈ పదాన్ని సాధారణంగా వ్యతిరేకార్థంలో వాడుతుంటాం. అంటే, ఓ వ్యక్తి మరణానికి కారణం తెలుసుకోవాలను కుంటున్నప్పుడు అతడు చనిపోతూ చెప్పిన మాటలకు ప్రాధాన్యముంటుంది. అదే మరణ వాంగ్మూలం.


అయితే, చనిపోయేముందు భాష సాహితీవేత్తల వాఙ్మూలాన్ని తీసుకుంటే అది భాషా సాహిత్యాల పట్ల వారికున్న నిబద్ధతని చెబుతుంది. ఆ ఆరాటాన్ని సరిగ్గా గుర్తిస్తే మన భాషా సాహిత్యాలని కాపాడుకోవాలనే పోరాటధోరణి పెరుగుతుంది.

అందుకే కొందరు ఆధునిక భాషా సాహిత్యవేత్తలు మరణ సమయ మాసన్నమైనప్పుడు కూడా దానికి వెరవక, భాషా సాహిత్యాల కోసం ఎంతగానో తపన చెందారు. అటువంటి మహనీయుల 'మరణ వాఙ్మూలాల్ని' కథానికల రూపంలో మీ ముందుంచడానికి చేస్తున్న సాహసమిది. మీ అభిమానాన్ని ఈ శీర్షిక చూరగొంటుందని ఆశిస్తున్నాం.

చెప్పదలచుకున్న విషయాల పట్ల పాఠకులాలోచించేట్టు, ఒక పద్ధతిలో ఉత్సుకతతో చదివేట్టు క్లుప్తంగా ఓ విషయాన్నందించే ప్రక్రియ కథానిక. ఈ ప్రక్రియ వస్తు వైశాల్యాన్ని వివరిస్తూ పాలగుమ్మి పద్మరాజుగారు "ఈ ప్రక్రియ వస్తు వైశాల్యం చాలా విచిత్రమైనది. ఒక పెద్ద కావ్యాన్ని కథానికగా చెప్పవచ్చు. చిన్న సంఘటనను కథానికగా చెప్పవచ్చునన్నారు. అలాగే ప్రాచీన కవుల జీవితాలలోని ప్రత్యేక సంఘటనలతో కవి, రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రిగారు కొన్ని కథానికలు రాశారు. ఈ రెండూ ఈ ప్రయోగం చేయడం వెనుకున్న ముఖ్య స్ఫూర్తులు. ఈ కథానికలను చదివి మేమెంతవరకూ సఫలీకృతులమయ్యామో దయచేసి తెలియజేయండి.

– రచయిత

చనిపోయీ జీవిస్తున్న వ్యక్తి-గురజాడ



"అపుడే సభ అయిపోయిందా?"

"ఇంకెన్ని గంటలాయన మాట్లాడాలి?. ఇప్పటికే అయిదు గంటలు దాటింది!"

"ఆయన వయస్సెంతో తెలుసా? –

"ఏడు పదులు ఉండవచ్చు. ఈ వయస్సులోనూ ఎంతధారణ!... ఎంత నిబద్ధత!"

"ఉపన్యాసాలంటే జనం పారిపోయే రోజుల్లో...అదీ భాషా విషయంలో...ఓ పెద్దాయన అనర్గళంగా మాట్లాడడం, దానిని మనందరం ఎంతో ఉత్సాహంతో వినడం... గంటలు నిముషాలుగా మారడం... ఎంత అద్భుతం!" అలా సభకు విచ్చేసిన అందరూ ఆ పెద్దాయన్ని తలోరకంగా మెచ్చుకుంటూ సభ అయిపోయినా అక్కడే నిల్చుండిపోయి మాట్లాడుకోసాగారు.

ఇంతలో కార్యకర్తలు గబగబా వచ్చి జాగ్రత్తగా ఆ పెద్దాయనను పక్కనే ఉన్న పెంకుటింట్లోకి తీసుకెళ్ళారు. ఆయన వెంటే ఆయన కుమారుడు సీతాపతి బయల్దేరాడు. తండ్రి గిడుగురామమూర్తిగారి ఆరోగ్యాన్ని కనిపెట్టుకుని ఉంటూ, తండ్రి మాట్లాడేటప్పుడు భాష గురించి చెప్పే విషయాలన్నింటికీ, ప్రాచీన సాహిత్యంలోని అవసరమైన ఆధారాలు అప్పటికప్పుడు, అవసరమైన గ్రంథాల్ని అందిస్తూ తోడ్పడుతుంటాడతను.

అన్నిగంటలు ఓ పెద్దాయన ఉపన్యసించడం ఆనందం కలిగినా, ఆయనను ఇబ్బంది పెట్టామేమోనన్న అభిప్రాయం నిర్వాహకులకు కలిగింది. దాంతో ఆయనని ఓ పడకకుర్చీలో విశ్రమింపజేసి తమలో తామే నెమ్మదిగా మాట్లాడుకోసాగారు.

"నిజం కదా! సాహిత్యం ఎక్కువమందికి లబ్ది కలగాలంటే మాట్లాడే భాషలో రావడం అవసరం కదా" "గ్రంథభాషే కాదు, విద్యాశాలలో బోధనాభాషా మాట్లాడే భాషే కావాలి"

"అందుకు ఆరోగ్యాన్ని, వయసుని పట్టించుకోకపోవడం ఎంతగొప్పా?"

వాళ్ళందరూ తనను పొగుడుతున్నా పట్టించుకోవడం లేదు ఆ పెద్దాయన. అందరూ ఆయనని, అలసటతో పడకకుర్చీలో విశ్రమించాడు అనుకుంటున్నారే గాని ఆయనలో మనస్సు నిండా అప్పుడు అతని ఆత్మీయమిత్రుడు అప్పారావు నిండి ఉన్నాడన్న విషయం ఎవరూ ఊహించనుకూడా ఊహించడం లేదు. ఎవరి ఊహలకూ అందనిది వాళ్ళ ఆత్మీయ బంధం! అదే తెలుగు భాష, సాహిత్యాల మధ్య సంబంధమని ఎవ్వరూ అనుకోనికూడా అనుకొని ఉండరు!

'ఆ పెద్దాయన ఆలోచనల్లో మిత్రుడు సజీవుడు!

ఆరోజు తన మిత్రుడికి బాగులేదని తెలిసి చూడడానికి వెళ్ళాడు.

అప్పారావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అంత బాధలోనూ ఆయన "మిత్రమా! నేను వెళ్ళిపోయినా నువ్వీ భాషోద్యమాన్ని కొనసాగించాలి" అంటూ చేయిజాచి అడగడం తానెప్పుడూ మరిచిపోలేదు.

ఆ మాటలే తన ఈ భాషోద్యమానికి పెద్ద స్ఫూర్తి. "మన ఉద్యమాన్ని ఇద్దరమూ కలిసి ప్రారంభించాం. నేను ఉన్నా ఉండకపోయినా నేనిదే శక్తితో ఉద్యమాన్ని కొనసాగిస్తానని మాటివ్వు" అప్పారావన్నాడు. తను చేతిలో చేయివేసాడు.

కళ్ళ వెంట ఆయనకు తెలియకుండానే ధారగా కన్నీళ్ళు రాసాగాయి. సీతాపతి తన దగ్గరున్న కండువాతో ఆయన ముఖాన్ని తుడిచాడు. తండ్రి మనసులోని భావాల్ని జల్లెడ పట్టేయగల కుమారరత్నమతను.

''పెద్దాయన్ని అనవసరంగా ఇంతసేపు మాట్లాడించి బాధపెట్టామా?" అన్నారు నిర్వాహకులలో ఓ వ్యక్తి.

అవేవీ వినిపించుకోవడం లేదు పెద్దాయన. తన ఆలోచనలో తానున్నాడు. ఆ రోజు మిత్రుడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిసి పలకరించడానికి ఆయనున్న కింగ్‌జార్జ్ హాస్పిటల్‌కి వెళ్ళాడు. కాని వైద్యులు తనతో అప్పారావుని చూడడానికి వీల్లేదన్నారు. ఎంతో బాధవేసింది తనకి!

"మిమ్మల్ని చూడగానే తెలుగు భాష, సాహిత్యమంటూ ఆయన ఆవేశానికి లోనవుతారు. దానితో ఆయన ఆరోగ్యం వెంటనే మరింతగా క్షీణిస్తుంది. అందుకని దయచేసి ఆయనను చూడడానికి మీరు రావొద్దు. ఉత్తరం రాయడం లాంటి ప్రయత్నాలూ చేయవద్దు' అన్నారు వైద్యులు. ఇక తాను మాట్లాడలేక వెనుదిరిగాడు.

'అప్పారావుతో స్నేహం ఈనాటిదా? ఎప్పుడో తొమ్మిదో తరగతి నుంచీ ఉన్నది. అతనో ద్రష్ట. వందేళ్ళకుపైగా ముందుప్రపంచాన్నే చూడగలడు. కేవలం చూడగలగడమే కాదు, అవసరమైన విధంగా ఆచరణలోకి దిగడం ఆయనకిష్టం. అందుకే ఆయనంటే తనకు ప్రత్యేక అభిమానం. వ్యక్తిగతంగా ఆయన ఆలోచనలు తక్కువ. ఏ విషయాన్నైనా సామాజికపరంగానే ఆలోచించగలడు! అందుకే ఆయనతో కలిసి మాట్లాడే భాషలో విద్యాబోధన చేయడానికి తను ముందుకురికాడు. విద్యా బోధన విషయంలో గ్రాంధికవాదుల ప్రభావం ఎక్కువై,గ్రాంధికంలోనే బోధన జరగాలని నిశ్చయించినపుడు, ఆయన సకాలంలో తన అసమ్మతిని తెలపడానికి 'మినిట్ ఆఫ్ డిసెంట్' అనే పుస్తకాన్ని రాయడానికి కూర్చున్నప్పుడు రక్తవిరేచనాలులాంటి అనారోగ్యాలతో బాధపడుతూ ఆయన చిన్నా పెద్దా అక్షరాలతో రాయడానికి చాలా కష్టపడ సాగారు. ఆ రాసిన దానిని ఎదురుగా ఉన్న వ్యక్తికి అందించడానికి చాలా బాధ పడసాగారు. దాంతో తాను ఆయన కాళ్ళ దగ్గర కూర్చుని ఆయన రాసి కిందకు దిగవిడిచిన కాగితాల్ని తీసుకొని సాఫు ప్రతిని ఆయన సిద్ధంచేశాడు. సకాలంలో దానిని సబ్‌కమిటీకి సమర్పించడం జరిగింది. అంతటి అనారోగ్యంలోనూ అతని అంకిత సేవాభావం తనని కలచివేసింది. తానెంత ఆత్మీయుడైనా అతని అనారోగ్యాన్ని పంచుకోలేక పోయానన్న బాధ తనని నులిమివేస్తూనే ఉంది. తామిద్దరూ చరిత్ర అధ్యాపకులే అయినా, కళింగదేశ చరిత్రను రాయాలనే ఉద్దేశంతో అతను శాసన భాషను ఔపోసన పట్టాడు. అందుకే, తనేశాసనాల్ని పరిష్కరించినా అప్పారావుకి చూపించకుండా ముద్రణ కోసం పరిశోధనా పత్రికలకి పంపేవాడు కాదు! అదీ తమిద్దరి స్నేహం. అలాంటి అప్పారావిప్పుడు లేకపోయినా తను బ్రతికేస్తున్నాడు...! 'పెద్దాయన కళ్ళ వెంట మళ్ళీ జలజలా కన్నీళ్ళు కారసాగాయి. ఎవ్వరూ చూడకుండా సీతాపతి జాగ్రత్తగా ఆ కన్నీళ్ళనీ తుడిచాడు ఆయన ముఖాన్ని తన కండువాతో తుడుస్తున్నట్లుగా.

కళ్ళు మూసుకున్నా ఆ పెద్దాయన మనసు నిండా మిత్రుడు అప్పారావే ఉండడంతో తన చుట్టూ మూగి తనను పొగుడుతున్న వాళ్ళ మాటలతని చెవులకు సోకడం లేదు. ఇప్పుడు అప్పారావు లేడనుకుంటేనే ఆయనకంత బాధ కలిగింది!

బాధని దిగమింగుకుంటూ నెమ్మదిగా కళ్ళు తెరిచారు రామ్మూర్తిగారు. తన చుట్టూ ఎంతోమంది భాషాభిమానులు. వాళ్ళ కళ్ళల్లో ఆనందం! తనపట్ల ఆరాధనా భావం!...

'అయిదు గంటలు ఎంత అద్భుతంగా భాష గురించి మాట్లాడా రండి'.

'మీకు ప్రాచీన సాహిత్యం మీద అంత పట్టుండటం మా అదృష్టం. అందుకే అనర్గళంగా అవసరమైన చోటల్లా గ్రాంథిక ధోరణులను ఎండగట్టారు'. మళ్ళీ ప్రారంభమయ్యాయి చుట్టూ పొగడ్తలు!

'మాట్లాడే భాషకు పట్టం కట్టాలన్న, మీ ఆలోచన సర్వజనామోద మైంది. మీరన్నట్లుగా మాట్లాడే భాషలో గ్రంథరచన రావడం, విద్యాబోధన జరగడం చాలా అవసరం. ఆవిధంగా చాలామందికి గ్రంథాలూ, విద్యా అందుబాటులోకి వస్తాయి.'

అందరూ తలో విధంగా ఆయన్ని పొగుడ్తున్నా, అవేమీ వినిపించు కోని ఆ పెద్దాయన తిరిగి కళ్ళు మూసుకుంటూ "ఈ వేళ మా అప్పారావుంటే – ఎంత ఆనందపడేవాడో!" అన్న మాటలు అందరికీ వినిపించడంతో అందరూ అవాక్కయ్యారు.

అర్థమైపోయింది, అందరికీ! ఆయనకింకా తన మనసులోనే ఉన్న గురజాడ స్ఫూర్తితో భాషోద్యమాన్ని నడిపిస్తున్నారని! అప్పారావు భౌతికంగా తమ మధ్యలేకపోయినా ఆ రామమూర్తిగారి మనసులో శాశ్వత తిష్ఠవేసుకు న్నారని ఆయన స్ఫూర్తితోనే ఆ పెద్దాయనకి అంత ఓపిక, ఏకాగ్రతని! అందుకే అంతవయసులోనూ అలా మాట్లాడగలిగారని! అదే తెలుగు భాషాసాహిత్యాలకు జరుగుతున్న మేలనీ! అందరికీ చెప్పాలనిపించింది సీతాపతికి. కానీ నోరు విప్పలేక అలాగే చూస్తుండిపోయాడు తండ్రి ముఖంలోకి.

అ

వావిలాల సుబ్బారావు
9866402973

తెలుగు లిపి - సంస్కరణ

తెలుగు అక్షరమాల గురించి - దిద్దుబాట్లు

కొంతకాలం చర్చ జరిగి ఆగిపోయిన విషయం మళ్లీ ఆలోచనకు రావటం మంచిదే. తెలుగు కన్నడ భాషలకు ఏకలిపి గురించి అప్పట్లో చాలా చర్చ జరిగింది. అవి టైపు రైటర్ల రోజులు - కమిటీలు వేశారు. పెద్ద పెద్ద పండితులే పాల్గొన్నారు. ఒక కొలిక్కి రాలేదు. ఇప్పుడు మళ్లీ.

రంగనాయకమ్మగారి వ్యాసంలో చివరి పేరా ముచ్చటేసింది. వారి శ్రద్ధ నిస్పృహలో కరిగిపోవటం కనిపించింది. "ఒళ్లు మండించే అక్షరాలు న్నమాట నిజం. ఒంటి ఊహలు సాగని మాట నిజం" - అవును. సంపాదకులు, ప్రస్తావించిన సరళత, సంస్కరణ, కంప్యూటర్లు - ఇవ్వి మార్పులను ప్రభావితం చేసే అంశాలు. వీటితోపాటు భాషలోను, లిపిలోను నిక్షిప్తమయిన మారుమూలలున్నాయి. అవి అందరికి ప్రతిరోజు అవసరం కాకపోయినా, లిపి సమగ్రత కోసం కొంత అవసరం ఉంటుంది - వాటిని పూర్తిగ చేజార్చుకోరాదు.

డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావుగారు వివరంగానే పరిశీలించి వ్రాశారు. ఛందో అవసరం గురించి మలయశ్రీగారు ప్రస్తావించారు. మన ఉచ్చారణ బట్టే గురువులు, లఘువులు. మన ఉచ్చారణే మారు తున్నపుడు వాళ్ళిద్దరు (U,I) సర్దుకుంటారు. థ,ధ ల ఉచ్చారణ గురించి 'అల్లంసెట్టి' గారు ఉదాహరించిన దాన్నిబట్టి కొన్ని ప్రాంతాలలో 'థ'ను స్పష్టంగానే ఉచ్చరిస్తున్నారని అర్థమవుతుంది. ఇట్లా కొన్ని ప్రాంతాలలో కొన్ని ఉచ్చారణలు నిలచి ఉన్నపుడు, ఏదో ఒక ప్రాంతాన్ని ప్రమాణ మంటూ కొన్ని అక్షరాలను తొలగించరాదు. అందరి ఉచ్చారణా రీతులకు అక్షరాలను అలవాటులోనే ఉంచాలి. ఋ, ౠ, ఌ ౡ ల అనవసరత గురించి అందరు ఒకేమాట అంటున్నారు. ఋ మీద ఆధారపడ్డ మాటలు గూడ అతిస్వల్పమే గుణింతంలోనే కలానికి కొంత అడ్డం పడుతున్నది. వాటి ఉచ్చారణ భేదం చెవిమరుగు అయిపోయింది. కనుక దిగులు లేదు.

ఏఏ అక్షర చిహ్నాలను తొలగించాలని ఆలోచించే ముందు సరయిన ఉచ్చారణను ప్రాథమిక విద్యాస్థాయిలో విద్యార్థులకు నేర్పాలి. అందుకు ఉపాధ్యాయ శిక్షణలో తగు శ్రద్ధ పెట్టాలి అన్నది ముఖ్యమయిన విషయం. తెలుగు మన మాతృభాష గదా అని మన ఇష్టం వచ్చినట్లు చిందరవందర చేసే హక్కులేదు. మాట్లాడటం మన యిష్టం. వ్రాయటం మాత్రం 12 కోట్ల తెలుగువారికి సమ్మతం కావాలి. చ, చే; జ జే, శషస, నణ, లళ, ల ఉచ్చారణ భేదాలు మన అలసత్వం వల్ల, అనవసర నాజూకుతనం వల్ల - కలగా పులగం అవుతున్నాయి. ఈ నిర్లక్ష్యం బలపడితే కొన్ని అక్షరాలు నశిస్తాయి. సౌలభ్యం, పేరుతో అక్షరాల సంఖ్య తగ్గించమనే వరకు పోవచ్చు. భారతీయ భాషల అక్షరమాల ధ్వని శాస్త్రబద్ధంగా వర్గీకరించబడింది. వాటి ఉచ్చారణ ఎక్కడ ఎట్లా చేయాలి అన్న - స్థాన, కరణ ప్రయత్నాలను స్పష్టంగా నిర్దేశించారు. ముందుగా ఉచ్చారణలను సరిగా నేర్చిన పిదప అక్షరాలను తొలగించటం ఆలోచించాలి. ఇంగ్లీషు నేర్చేటపుడు - స్పెల్లింగు, ఉచ్చారణ శ్రద్ధగా నేర్చుకొన్నట్లే తెలుగు మాతృభాషే అయినా, నేర్చుకోవాలి.

చాప, చేప, చక్కెర, చెక్కెర, చెంద్రుడు, చంద్రుడు, గజ్జెలు, గజ్జలు మొదలయిన వాటిలో భేదాన్ని తెలియజేయాలి. అచ్చు, హల్లు కానివి గూడ ఉన్నాయి. ఉభయ లక్షణాలున్న ఉభయాక్షరాలు. 'ం' ఒక రాజీ అక్షరం. ఉచ్చారణ విధేయంగా హేతు విధేయంగా వ్రాయాలంటే వర్గ పంచమాక్షరంతోనే వ్రాయాలి. ఈ విషయం గత మాసంలో కొందరు చెప్పారు.

అరసున్న (ఁ) సంగతి. ఇది వాడక పోయినా నేర్చుకొని మన అక్షరాల అమ్ముల పొదిలో ఉంచుకోవాలి. అది లేకపోతే అర్ధభేదాలు వస్తాయి. వాఁడు= అతడు; వాడు = ఉపయోగించు. వీడు= పట్టణము; వీఁడు = ఇతడు - వదలిపెట్టు; ఇట్లే చాలా పదాలు ఉన్నాయి. "ఒకే పదానికి రెండు అర్థాలా' అని ముందు ముందు ఆక్షేపించకుండా నేర్చుకొని ఉండటం మేలు. కొన్ని ప్రాంతాలలో " ఁ" ఉచ్చారణలో గూడ ఉంది. నాగరీకులు దాన్ని పట్టించుకోలేదు. "గేదె" శబ్దం ఉత్తరాంధ్రలో సాధారణం. మిగతా ఆంధ్రలో అరుదు. ఉత్తరాంధ్రలో గూడ పల్లె పాటక వర్గాలలో "గేఁద" అని అనునాశికంగా ఉచ్చరిస్తారు కొందరు. "గేండె" అనటం ఉంది. గేఁదె - గేదె - గా రూపాంతరం చెందింది. శ్రీకాకుళం జిల్లాలో నేను 'గదబ' భాషను సేకరించినపుడు వారిలో ఈ ఉచ్చారణ గమనించాను ('GADAB',The languages & The people) ఈ అనునాశికతలు "ముండా" జాతి భాషలలో అధికం. వాటి సాహచర్య ప్రభావం తెలుగుపై వచ్చింది. అసలు 'గేండె' శబ్దం గూడ వారి నుండి వచ్చినదే. లిపికి గూడ చరిత్ర ఉంది - ఇంకా నిలబడి ఉన్న ఉచ్చారణలూ ఉన్నాయి. వాటిపై మనం కర్ర పెత్తనం చేయటం భావ్యం కాదేమో! ఇబ్బందులున్నమాట నిజమే. అందుకే అప్పకవి ఎపుడో 'అ' 'ఁ' ల పదాలను పట్టిక చేసాడు.

ఏ భాషలోనయినా అవకతవకలుంటాయి. అంతమాత్రాన అది భాషా వ్యాప్తికి అభ్యాసానికి ఆటంకం కాదు. ఎన్ని అసంబద్ధత లున్నా ఇంగ్లీషు విశ్వవ్యాప్తం అవుతున్నది. చాలా తక్కువ లోపాలున్నా తెలుగు, తెలుగువారికే దూరం అవుతున్నది. అత్యంత తర్క సహ వ్యాకరణం ఉన్న సంస్కృతం వ్యవహారదూరమయింది. భాషాపండితులు సమకూర్చిన సరళ భాష "ఎస్పరాంటో" - ప్రజల మధ్యకు రాలేదు. పిల్లలకు నేర్పే పద్ధతిలో సరళత ఉండాలేగాని - వారికి నేర్వరానిది లేదు. తెలుగులో ప్రత్యయ ప్రణాళికలోనూ లోపాలున్నాయి. అయినా అభ్యాసం కావటం లేదా!

గుణింతాల సమస్యలో అచ్చుల విషయం కన్నా సంయుక్తాక్షరాల సమస్య జటిలమయినది. 'అల్లంసెట్టి' వారు సూచించిన హల్లు ప్రక్క హల్లు పద్ధతి సరళ విధానమేగాని ఈ అభ్యాసం కావటమే కష్టం. ఇపుడున్న

పద్ధతిలో సంయుక్తమయిన హల్లులతో సహా ఒకే అక్షరంగ కనిపిస్తాయి. కొత్త పద్ధతిలో ఒకటిగా ఉన్న హల్లులు విడివిడి అయినట్లు కనిపిస్తాయి అలవాటే ముఖ్యం.

అనవసరమయిన, ఉచ్చారణలో తొలగిపోయిన ధ్వని సంకేతాలను తొలగించటంలో అభ్యంతరం లేదు. కాని అన్ని ప్రాంతాలవాటి ఉచ్చారణా భేదాలకు సంకేతాలు ఉండాలి. తొలగించరాదు.

అట్లాగే కొన్ని ఉచ్చారణలు కొత్తగా ప్రవేశిస్తున్నాయి. బ్యాంకు (ae) వంటి అన్యభాషా పదాలకేకాక "తాటాకు" వంటి తెలుగు సంధులతో గూడ కనిపిస్తున్న మరొక అచ్చును గుర్తించాలి. F తెలుగులోని 'ఫ' సమానం కాదు. వేరుగా గుర్తు ఉండాలి (కాఫీ) ఉర్దూ నుండి చేరిన అనేక పదాలకు గూడ ఈ కొత్త అక్షరం అవసరం కుల్ఫీ, ఫర్మానా, ఫరక్ మొదలయినవి. జులుం, రోజ్, ఫీజ్, మొదలయి వాటికి మనం తొలగిద్దామనుకుంటున్న తాలవ్య 'జ' కారం 'జ' ఉపయోగపరచవచ్చు. ఇంగ్లీషులో J Z; V W; CK:, సన్నిహిత ఉచ్చారణ కలవేగాని వేరే చిహ్నాలు న్నాయి. మనం గూడ ఆ సూక్ష్మ భేదాలను పరిగణించాలి – కనుక చ ౙ జ లను తొందరపడి నిరాకరించ తగదు. ఇతర ఉచ్చారణలకు ఉపయోగపడతాయి.

విసర్గ సంగతి. మనకు దుఃఖము ఉన్నది. తప్పదు. అంతఃపురంలో ఉన్నాసరే దుఃఖం ఉంటుంది. తప్పించుకోదలిస్తే దుఖ్ఖము వ్రాయగలరేగాని అంతఃపురంలో తప్పించుకోవటం ఇంకా దుఃఖం. అంతహ్పురము అని వ్రాయాలి. అది ఇంకెంత దుఃఖం! ఉపధ్మానీయం అని ఒకటి ( ) ఉండేది. దాన్ని విసర్గలో అంతర్గతం చేసారు మన కష్టం గుర్తించిన వారు. ఇపుడు విసర్గను విసర్జించ తగదు. ఇది అచ్చా హల్లా అన్న చర్చ కాదు ముఖ్యం.

భారతీయ భాషలన్నింటిలోకి మన తెలుగులోనే అక్షరాలు ఎక్కువ. ఇది గుణమేగాని దోషం కాదు. అనవసరమయినవి ఉండటం దోషమే. అన్ని అవసరాలను తీర్చలేకపోవటం గూడ దోషమే. ఒక అవసరానికి రెండు అక్షరాలుండటమూ దోషమే. (ఇంగ్లీషులో లాగ). ఇ ఙ లు కూడ అవసరమే. ing తో కూడిన ఇంగ్లీషు క్రియలు తెలుగులోకి వచ్చిపడుతున్నాయి. వీటికి 'ఙ్' అవసరం ఉంది. పండితులు మడికట్టుకుంటారుగాని భాషా వ్యవహారం మడికట్టుకోదు. "మోడలిఙ్" అని వ్రాయవచ్చు 'మోడలింగు' అననక్కర లేదు.

క్ష త్ర జ్ఞ లు 56 అక్షరాలలోవి కాదు. ఈ విషయం ముందు స్పందించినవారు వివరించేసారు. మా ప్రాంతంలో లేదు అన్నారు మలయశ్రీగారు – కొంతప్రాంతంలోనే ఎందుకొచ్చింది. తెలుగువారి అక్షరాభ్యాసం "ఓం నమశ్శివాయ'తో ప్రారంభిస్తుంది. "క్ష త్ర జ్ఞ" తో ముగుస్తుంది. ఈ రెండుగూడ వర్ణమాలలోవి కాదు. మత తాత్విక సంప్రదాయంగా ప్రవేశించాయి అనుకుంటాను. శివ పంచాక్షరి సంగతి తెలిసిందే. అట్లాంటిదే 'క్షత్రజ్ఞ' కూడ అనుకుంటున్నాను 'క్షత్ర' అంటే శరీరం అని, బలం, అని అర్థాలు. 'జ్ఞ' తెలిసినవాడు. అంటె జీవుడు, క్షేత్రజ్ఞుడు అన్న అర్థంతో అక్షరాభ్యాసాన్ని ముగించారేమోనని నా ఊహ, ఎవరూ చెప్పింది కాదు. విన్నది కాదు. కావచ్చు కాకపోవచ్చు, హిందీలో గూడ క్ష వేరే అక్షరంగానే ఉంది.

లిపిగాని భాషగాని కొందరు మేధావులు కూర్చొని ఏర్పరచింది కాదు. వాటి నిర్మాణం సమాజ సమిష్టి ఉత్పత్తి, అనేక ప్రభావాల నుండి అవి పుట్టాయి, పెరిగాయి. అందుచేత తర్కరాహిత్యం తప్పక ఉంటుంది. కొన్ని సందర్భాలలో వాటి సొంత తర్కం వాటికి ఉంటుంది. నేనెరిగిన 'గదబ' భాషలో నాలుగు వరకే గణనం ఉంది. ఐదును 'నాలుగుపైన ఒకటి' (4+1) అంటారు. "చేతికి ఐదు వేళ్ళు ఉంటాయి గదా కనీసం ఐదు వరకన్నా లేవేమిటి" అంటే ఏం చెప్పగలం? – హిందీ అక్షరాలలో మనకున్న తర్కం గూడ కనిపించదు. తెలుగు వర్గాక్షరాలు 10 జతలలో కనీసం 6 జతలు హేతుబద్ధంగా ఉన్నాయి. క ఖ, గ ఘ, ట ఠ, త థ – నాలుగు జతలే దారి తప్పాయి. హిందీ అక్షరాల దారికి ఇంకా దూరం కదా! మనం సంతోషిద్దాం. దేశాలకు మనుష్యులకు మాత్రమే కాదు, లిపికి భాషకు గూడ చరిత్ర ఉంటుందని పిల్లలకు బోధిస్తే – తర్క రాహిత్యాన్ని వాళ్లు పట్టించుకోరు.

గమనిక : తెలుగు అక్షరాలు 36 మాత్రమే గనుక తక్కినవి మనకెందుకు అన్నారుట ఎవరో పెద్దవారే! అన్ని అక్షరాలలో ఇపుడే భాషను మాత్రమే మనం వ్యవహరిస్తుంటే ఆ వాదనో అర్థవంతం –లేకుంటే అది పట్టించుకోనక్కరలేని మాటే.

వచ్చే నెల సంచికలో – భాషా శాస్త్రజ్ఞుడు ఆచార్య కస్తూరి విశ్వనాథం (మైసూరు)గారి 'స్పందన' ను చదవండి – సంపాదకుడు

మీరు 'అమ్మనుడి' చందాదారులేనా?

'అమ్మనుడి పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక –

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.

2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవ ప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పరతిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్ / మెయిల్‌గాని పంపించి సహకరించగోరుతున్నాము.

3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు. 5000/-)గాని, 5 సం॥ల చందా (రు. 1000/-లు)గాని, 3 సం॥ల చందా (రు. 700/-లు)గాని పంపి పత్రికను ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥ చందా రు. 240/-లు పంపించి ఏటా పునరుద్ధరించుకోవచ్చు. – ప్రచురణకర్త, అమ్మనుడి.

వాడని భాష వాడిపోతుంది.

గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

తెలుగు లిపి సంస్కరణ - సవరణ -ఆధునీకరణ

తెలుగు లిపి సంస్కరణలో భాగంగా తెలుగు అక్షరమాలని కొంత సంస్కరించుకోవాలని రంగనాయకమ్మగారు సూచించిన కొన్ని మార్పులూ వాటితోపాటు వ్యాసం చివర రాసిన "పత్రికలవారూ, ప్రభుత్వ అకాడెమీలూ, భాషాశాస్త్రజ్ఞులూ, భాషాబోధకులూ రచయితలూ చర్చించి ఒక అంగీకారానికి వచ్చి ప్రయత్నాలు ప్రారంభిస్తే కొన్నాళ్లకు సాధ్యం కావచ్చు." అనే వాక్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇప్పటి నుంచే పని మొదలుపెట్టాలి. దీనికి అందరూ బాధ్యత వహించాలి. ముందుగా చర్చలు కొనసాగాలి.

మాటను రాతగా మలుచుకొనే వీలుకలిగించే సంకేతాల కూర్పే లిపి లేక లేఖన వ్యవస్థ. లిపి సంకేతాలనే అక్షరాలూ లేక వర్ణాలూ అని అంటాం. ఐతే ఈ రెండింటి మధ్య తేడా ఉంది. రాతలో, వర్ణం అనేది కనిష్ట శబ్ద సంకేతం (మాటలో వర్ణానికి మరో నిర్వచనం, పదాల అర్థాలలో మార్పును కలిగించ గలిగిన కనిష్ట శబ్దం). అక్షరం అంటే ఒక అచ్చూ, లేక అచ్చుతో కూడిన హల్లు(ల) శబ్దాల సంకేతం. ఇంగ్లీషు రాయడానికి వాడే రోమన్ లిపిని వర్ణలిపి అంటారు. పాశ్చాత్య లిపులన్నీ ఇలాంటివే. ఇంగ్లీషు వర్ణమాలలోని ప్రతి వర్ణానికీ (మనం అక్షరాలు అనేవి) ఒక పేరుఉంటుంది. అవే మనం ఏ (ఏ, ఆ, ఏ) బీ (బ్) సీ(స్) డీ(డ్), ఈ(ఈ), ఎఫ్(ఫ్), మొదలైనవి (బ్రాకెట్లలో ఉన్నవి వాటి శాబ్దిక విలువలు). ఈ లిపులలో ఒక్కొక్క సంకేతం సందర్భాన్ని బట్టి ఒక్కొక్క శబ్దాన్ని మాత్రమే సూచిస్తుంది (a,b,c,d, ఐతే x మాత్రమే కొన్ని సందర్భాలలో ఒకటి కంటే ఎక్కువ శబ్దాలను సూచించే సంకేతం, ఉదా. fox (ఫాక్స్). ఐతే,తెలుగూ తదితర భారతీయ లిపులూ, కొరేయనూ, జాపనీయ లిపులలో అక్షరాలు ఒకటికంటే ఎక్కువ వర్ణాలను సూచిస్తాయి, (ఉదా. 'క' అనే సంకేతం వర్ణం కాదు. 'క' సంకేతం 'క్' అనే శబ్దాన్నీ + 'అ' అనే శబ్దాన్నీ సూచిస్తుంది. అలాగే, చ (చ్+అ), కి (క్+ఇ), చి (చ్+ఇ), మొదలైనవి. వీటిని అక్షరాలు అంటారు. అంటే తెలుగు అక్షర లిపి. ప్రతి అక్షరానికీ ఒక పేరు ఉంది. అవే, అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, (అ) రు, (అ) రూ, (అ) లు, (అ) లూ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ,లు మొదలైనవి. అలాగే హల్లులలో, క, ఖ, గ, ఘ, ఇంగ్యు(జ), చ, ఛ, జ, ఝ, ఇఞి(ఞ) మొదలైనవి(వీటిలో బ్రాకెట్లలో ఉన్నవి వాటి శాబ్దిక విలువలు, మిగిలిన వాటికి వాటి శాబ్దిక విలువలూ వాటి పేర్లూ ఒకటే). ప్రపంచంలో పలు భాషలకు వేల సంవత్సరాల కిందటే లిపి ఏర్పడింది. వీటిలో తెలుగు ఒకటి. వేల సంవత్సరాల చరిత్రలో భాషలో వచ్చిన మార్పులూ మరికొన్ని చారిత్రక కారణాలవల్ల కొన్ని తెలుగు లిపి సంకేతాలు అనేక మార్పులకు గురైనై. ఈ మార్పులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఇంగ్లీషులో వర్ణాలను ఒకదాని తర్వాత ఒకటి పేర్చుకొంటూ పోవాలి. ఈ పేర్పు అనేది ఉచ్చారణను అనుసరించి కాకుండా చారిత్రక మార్పులకు లోబడి ఒక విశేష ప్రక్రియగా తయారైంది. అంటే వర్ణాలతో పదాలను కూర్చడానికి ప్రత్యేక నేర్పు అవసరం. తెలుగులో ఉచ్చారణను అనుసరించి అక్షరాలను పేర్చితే పదాలు తయారవుతాయి. ఐతే ఈ అక్షరాల కూర్పుకు కొంత నేర్పు అవసరం. ఈ నేర్పులో సంక్లిష్టతను తగ్గించడానికి లిపి సంస్కరణ అవసరం.

అక్షరమాల అనేది మాట్లాడే భాషను రాసే భాషగా మార్చే ఒక సాంకేతిక వ్యవస్థ. అంటే వినబడే మాటలను కనబడే రూపాలుగా మార్చే సదుపాయమే రాత. మాట్లాడే మాటలలో శబ్దాలు ఉంటే రాసే మాటలలో అక్షరాలు ఉంటై. అక్షరమాలలోని అక్షరాలను మాటలలోని శబ్దాల వరుసలో పేర్చగలగాలి. మాటలను రాయాలంటే మాటలలో ఉండే అక్షరాలను గుర్తుబట్టగలగాలి. మనం మాటలను విడిగాగానీ కలిపిగానీ మాట్లాడతాం. మాటలనైతే విడివిడిగా దేనికదే మాటలమధ్య ఊపిరి పీల్చుకొంటూ మాట్లాడవచ్చుగానీ మాటలను విరిచి కింద (1) నుంచి (4) పద్ధతులలో చూపినట్లు అక్షరాలుగా విడగొట్టి మాట్లాడం. ఐతే,'తెలుగు లిపి సంస్కరణ'లోనిఅక్షరాల్ని ఈ కింద చూపినట్లుగానాలుగు విడతలుగా విడగొట్టి రాయవచ్చు. (1)వ పంక్తి లో చూపిన అక్షరాల మధ్య ఖాళీలను తీసివేస్తే సాధారణంగా మనం చూసే రాత పద్ధతి కనిపిస్తుంది.

(1)'తె లు గు లి పి సం స్క ర ణ', (ప్రతి అక్షరానికీ మధ్య ఉన్న విరామాన్ని తొలగిస్తే) 'తెలుగు లిపి సంస్కరణ'తయారవుతుంది.

కానీ రాసేటప్పుడు (1) వ పంక్తిలో బాణం తరువాత చూపినట్లు మాత్రమే రాస్తాం. ఐతే ఈ పంక్తిలో చూపిన అక్షరాలలో రెండు మూడు తప్ప ఏవీ మనం రోజూ చూసే అక్షరమాలలో కనబడవు. అంటే అక్షరమాలలోని అక్షరాలు వచ్చినంత మాత్రాన తెలుగు రాయటం రాదన్న మాట. తెలుగు రాయటం వచ్చినవాళ్ళని 'తెలుగు లిపి సంస్కరణ' లోని పదాలను విరిచి వాటిలోని అక్షరాలను గుర్తించ మంటే ఒకదాని తర్వాత ఒకటి(2) వ పంక్తిలో చూపినట్లుగావరుసగా పలుకుతారు.

(2) 'త ఎ ల ఉ గ ఉ ల ఇ ప ఇ స ం స ్ క ర ణ'.

ఇవన్నీ అక్షరమాలలో ఉంటాయి. కానీ ఆట్లాకాకుండా(1) వ పంక్తిలో కనపడే అక్షరాలను విడదీసిరాస్తే (3) వ పంక్తిలో ఉన్నట్లుగా అక్షరాల వరుస ఉంటుంది.

(3) 'త ె ల ు గ ు ల ి ప ి స ం స ్ క ర ణ'.

ఇవి (1) వ పంక్తిలోని అక్షరాలు గుణింతాలను విరగదీసి రాసినట్టు ఉంటుంది. ఉదా. త'కు ఎత్వంఇస్తే తె, ల'కు కొమ్ము ఇస్తే లు, గ'కు కొమ్ము ఇస్తే గు కలిసి తెలుగు అవుతుంది. తర్వాత ల'కు గుడి ఇస్తే లి, ప'కు గుడి ఇస్తే పి, కలిసి లిపి అవుతుంది. ఇక, స'కు సున్నా పెడితే సం, స'కు పొల్లుమీద క రాస్తే స్క, తరువాత ర, ణ, తో కలిపిసంస్కరణ అవుతుంది. ఇట్లా మొత్తం 'తె లు గు లి పి సం స్క ర ణ' తయారవుతుంది. అంటే (2) వ పంక్తి లో చూపిన అక్షరాలను ఒక పద్ధతి ప్రకారం కూర్చితే (3) వ పంక్తిలోని అక్షరాలు తయారవుతాయి. వీటిని ఒక నియమం ద్వారా పేర్చితే (1) వ పంక్తిలో ఉన్న అక్షరాలు కళ్లముందు

నిలుస్తాయి. ఈ కూర్చి పేర్చే పద్ధతిలో కొన్ని సూత్రాలు ఇమిడివున్నాయి. (1) వ పంక్తిలో ఉన్న అక్షరాలుగా కూర్చడానికి ప్రతి అక్షరానికీ ఒక పర్యాయ రూపం ఉంటుందని తెలియాలి. అంటే అక్షరమాలలో ఉన్న మౌలిక అక్షరాలకు పర్యాయరూపాలు ఉంటాయని తెలియాలి. సందర్భాన్ని బట్టీ ఈ పర్యాయరూపాలతో అక్షరాలను కూర్చాలి.

అంటే మనం తెలుగులో రాయడాన్ని నేర్చుకోవడంలో మూడు సూత్రాలను ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా నేర్చుకుంటామన్నమాట. 1. వ సూత్రం: హల్లుల తర్వాత వచ్చే అచ్చులకు గుణింత రూపాలు వేరుగా ఉంటాయి. ఉదా. క+ఇ ⇨ క + ి; అలాగే, 2.వ సూత్రం: గుణింతాలు చేరే ముందు హల్లులలో 'అ' కారం (చాలా హల్లులకు ఉన్న తలకట్టు దీనికి సమానం) పోయి హలంతాలవుతాయి, ఉదా. క+ి ⇨ క్ + ి 3. వ సూత్రం: గుణింతం గుర్తుల ముందుపొల్లులు లోపిస్తాయి. క్ + ి ⇨ కి, అంటే (2) వ పంక్తిలో ఉన్న అక్షరాలు (3) వ పంక్తిలో లాగా, (4)వ పంక్తిలో లాగా చివరకు (1) వ పంక్తిలో లాగా వరుసగా కూర్చి రాయా లన్నమాట. పరోక్షంగా అనువర్తిస్తున్న సూత్రాలూ ప్రత్యక్షంగా కనబడు తున్న కొన్ని అక్షరాలూ అక్షరమాలలో కనబడవు. అంటే అక్షరమాలలో అక్షరాల మౌలిక రూపాలు మాత్రమే ఉంటాయి.

తెలుగు లిపి - ఆధునీకరణ - సంస్కరణ:

తెలుగు లిపి ఆధునీకరణ కోసం సంస్కరణ అవసరమే. అన్ని లిపులలోనూ ఉన్నట్లే కొన్ని చారిత్రక కారణాలవలన మన భాషలో (మాటలో) లేని కొన్ని వర్ణాలకు అక్షరాలు ఉండడమూ ఉన్న వర్ణాలకు అక్షరాలు లేకపోవడమూ జరిగింది. అట్లాగే కొన్ని తుల్య వర్ణాలకు రూప సామ్యం లేకపోవడం (ఉదా. (ఇ:ఈ), (క:ఖ), (గ:ఘ), (జ:ఝ), (ట:ఠ), (త:థ) మొదలైనవి), భిన్న పరిమాణాలలో ఉన్న హల్లులూ (ఉదా. 'క,చ,ట,త,ప,గ,జ,డ,ద,బ'లుమొదలైనవాటి కంటే'ఘ,ఝ,మ,య' లు రెండింతలు పెద్దవిగా ఉండటం, వీటిలో ఉన్న కొమ్ము, ఉత్వం చేరిన హల్లుగా పొరబడే అవకాశం కలిగిస్తోంది), వివిధ హల్లుల మీద వచ్చే గుణింతం గుర్తులలో తేడా (ఉదా.పరిమాణంలో చిన్న హల్లులైన క, చ ట, త, ప, గ,జ,డ,ద,బ, ఖ, ఛ, ఠ, థ, ఫ, ధ, ధ, భ, న, ణ, ర, ల, వ, శ, ష, స లకు ఒ, ఓల గుణింతాలుగా ొ, ో లూ, పరిమాణంలో పెద్దవైన ఘ, ఝ, మ, య ల కు ొ +ు, ో+ూ లు రావటం). ఇలాంటి చిన్నా పెద్దా తేడాలు అన్ని లిపులలో ఉండేవే. కాకపోతే ఆధునిక అవసరాలకోసం కొంత మార్పు అవసరం అనిపిస్తోంది. ఇక, కంప్యూటరు రాకతో లిపి సంస్కరణ భావనకే అర్థం మారింది. భాషకు సంబంధించి సాంకేతిక విప్లవం వచ్చినప్పుడల్లా లిపిలో చిన్న చిన్న మార్పులు రావడం సహజమే. అంటే ఈ మార్పులూ చేర్పులూ గుర్తించనంత చిన్నవైనప్పుడు అవి ప్రజాదరణ తప్పక పొందుతాయి. ఇలాంటి అవసరమైన మార్పులు చేసేముందు తెలుగు లిపి గురించి కొంత చర్చ అవసరం.

తెలుగు లిపి మిగతా భారతీయ భాషల (బ్రాహ్మీ లిపినుండి పుట్టిన మరికొన్ని ఆసియా భాషల) లిపులకు వలెనే అక్షర లిపి (వర్ణాలను అక్షరాలుగా పేర్చి పదాలు కడతారు). వర్ణ లిపులులలో అక్షరాలుగా కూర్చకుండానే వర్ణాలను ఒకదానిపక్కన ఒకటి కూర్చుతూ పదాలను రాస్తారు. ఐతే తెలుగూ తదితర లిపులలో వర్ణాలను (వర్ణమాలలోని వర్ణాలైన అచ్చులూ, హల్లులూ అన్నీ అక్షరాలే అంటే అవన్నీ అచ్చుతో కూడిన వర్ణాలే.) అక్షర రూపాలుగా పేర్చి వాటిని కూర్చి పదాలను రాస్తారు. ఉదాహరణకు /స్త్రీ/ అనే పదంలో /స్+త్+ర్+ఈ/ అనే నాలుగు వర్ణాలనూ ఒకటిగా కూర్చి /స్త్రీ/ గా రాస్తే ఒక పదం తయారవుతుంది.

తెలుగు వర్ణమాలలోని వర్ణాల సంఖ్యా వాటి వరుస (క్రమం) ఒకే విధంగా లేదు. కొన్ని కొన్ని అవసరాలకు కొంత మంది కొన్ని చాలు అన్నారు మరికొందరు ఇంకా కావాలి అన్నారు. కొందరు అచ్చులను అన్నిటినీ తొలగించి 'అ' కి గుణింతాలను చేర్చి వాడుకోవచ్చని సలహా ఇచ్చారు. అట్లాగే రూపసామ్యం లేని వర్గాక్షరాలను కూడా తొలగించి వత్తులద్వారాకొత్తవాటినిచేర్చుకోవచ్చన్నారు. తెలుగూ కన్నడ లిపులలో సంయుక్తాక్షరాలు ఒకదానికింద ఒకటి పేర్చి రాయడం ఆనవాయితీ. అదే దేవనాగరి లాంటి లిపులలో అక్షరాలను నిలువుగా చీల్చి అర్ధాక్షరాలను వరుసలో పేర్చడం సాంప్రదాయం. ఈ రెండిటిమధ్యన ఒరియా, బెంగాలీ, శ్రీలంక లిపులలో రెండు రకాలకు చెందిన కూర్పు చూడవచ్చు. అంటే బ్రాహ్మీ లిపిలోనే ఈ రెండు రకాల కూర్పులకూ ఆనవాళ్లు ఉన్నాయన్న మాట. ఉదా. తె. స్త్రీ హిం ஸ்ரீ; తమిళంలో మాత్రం 11వ శతాబ్దం నుండి సంయుక్తాక్షరాల కూర్పులో అక్షర రూపాంతరాలను వాడకుండా పొల్లుతో అక్షరాలలోని సహజసిద్ధ 'అ' ను తొలగించి అక్షర కూర్పు జరుగుతుంది. ఉదా ஸ்த்ரீ | స్రీ (స్ త్ రీ) పొల్లు చేర్చి హల్లులను హలం తాలుగా మార్చే ప్రక్రియ అన్ని బ్రాహ్మీ లిపులలో ఉన్నా దాన్ని సంపూర్ణంగా వినియోగించుకున్నది తమిళం మాత్రమే. తెలుగూ కన్నడాలలో గుణింతం గుర్తులను హల్లులకు తగిలించి రాసినా హల్లుల ఒత్తులను మాత్రం హల్లులకు తగిలించకుండా పక్కనే పేర్చడం ఆనవాయితీ. ఐతే ఉత్తరాది లిపులలో మాత్రం అన్నిటినీ కలిపి రాయడం ఆనవాయితీ. తెలుగూ కన్నడాలలో అక్షరాల నిలువు పేర్పుపంక్తులమధ్య ఎడం అనిర్దిష్టం కావడం ఒక లోపం. ఆధునిక ప్రపంచంలో పంక్తులమధ్య ఎడం పెరిగితే ఖర్చు ఎక్కువవుతుందితుంది. దీనితోబుల్లితెరలపై(పామ్ టాపులు, సెల్ఫోనుల తెరలు) పాఠం కనబడే చోటు విస్తృతి తగ్గడం ఒక లోపమే. వీటికి సవరణలు రావాలి. తెలుగు లిపిలో కొన్నిమౌలిక మార్పులూ అవసరమే. కొన్ని చిన్న మార్పులు లిపి విధి విధానాలకు లోబడి రూపొందించడం అవసరం. తెలుగు లిపిలో మౌలిక మార్పులు అంటే, తెలుగు అక్షరాల కూర్పు విధివిధానాన్నే మార్చాలి. ఎందుకంటే ఉదా. /స్త్రీ/ అనే పదంలో పదానికి చివరిగా పలికే అచ్చు (ఈ) మొదటి హల్లు (స) మీద రాయడం ఒక చారిత్రక పొరబాటు. ఇప్పుడు దానిని తిరగదోడడంవల్లకాని పని. రంగనాయకమ్మ గారూ, ఇతరులూ ఇప్పటికే సూచించిన మార్పులతో పాటు మరో మార్పు ఒకటి అవసరం. అది అక్షరాలను ఒకదానికింద ఒకటి పేర్చ కుండా ఒకదానిపక్కన ఒకటి పేర్చాలి (కే.ఎస్.బి.వి.కే. శివరావు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ ముద్రణా శాలలో ఇట్లాంటి ఆలోచనతో ఓ ఖతిని లైనోటైపుకి1975లో రూపొందించారు ఐతే అది కొన్ని లోపాలవలన ప్రాచుర్యంతోకి రాలేదు.). అక్షరం కింద రాసే అక్షర రూపాలను మార్చాలి. దీనితో తెలుగుకు రేఖీయ సౌలభ్యం అలవడుతుంది. అచ్చులో కాగితం ఆదా అవుతుంది. ఖర్చు తగ్గుతుంది. బుల్లితెరలపై ఎక్కువ పాఠం కనబడు తుంది. దీనికోసం తెలుగు లిపిలో కొన్ని ఒత్తులలో ఉన్న ఒక వరవడినే అన్ని ఒత్తులకూ ఆపాదించడం. ఇదిగాక ఐత్వంలో వచ్చే వ్యవహిత (విడిగా ఉన్న) రూపాన్ని (ఐ గుణింతం గుర్తు ై)

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

మార్చుకోవాలి. ఐత్వం గుర్తు ప్రాచీన కాలంలో పైన ఎత్వం గుర్తుతో కలిసి ఉండేది. ఐతే అది కాలక్రమేణా కిందికి దిగింది. తిరిగి దాన్ని పైకి లేపాలి. ఇంతే దీనితో తెలుగు లిపిలో ఆధునిక అవసరాలకు అడ్డుపడే రెండు లోపాలను పరిహరించినట్లే. ఈ పద్ధతిలో ఓ కొత్త ఖతికివాస్తుచిత్రణ తయారుకావాలి. సంగణీకృత తెలుగు వర్ణమాలలో ఏ వర్ణాలనూ తగ్గించవలసిన అవసరమూ లేదు. పైపెచ్చు ఇంకా నేడు వాడకపోయినా ఇంతకుముందు వాడిన వర్ణాలను కూడా సమగ్రత కోసం విశ్వసంకేతమాలికలోభాగం చేయవచ్చు. ఇట్లాంటి తెలుగు వర్ణమాలను పరివర్ధితవర్ణమాల అందాం. దీనితో ఇప్పటి వరకూ తెలుగులో రాళ్లపైనా, రాగిరేకులపైనా తాళపత్రాలపైనా వచ్చిన ప్రతి రాతప్రతికీ తెలుగులో వాడిన అక్షరాలు అన్నీ ఉంటాయి. అయితే పిల్లలు నేర్చుకోడానికీ మామూలు అవసరాల కోసం పరివర్ధిత అక్షర మాలలో (బ్రాకెట్లలోఇచ్చినవాటిన మినహాయించి సామాన్యఅక్షరమాలను వాడుకోవచ్చు.

పరివర్ధిత తెలుగు వర్ణమాల:

తెలుగు వర్ణమాలలోని లేఖన చిహ్నాల సమగ్ర జాబితా :

1. అచ్చుల మౌలిక రూపాలు : = 16 . వీటిలో 13 మాత్రమే సాధారణ వాడుకలో ఉన్నవి.

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ (ౠ) (ఌ ౡ) ఎ ఏ ఐ
ఒ ఓ ఔ

2. అచ్చుల గుణింతం గుర్తులు+పొల్లు = 16. వీటిలో 13 మాత్రమే సాధారణ వాడుకలో ఉన్నవి.

ా ి ీ ు ూ ృ (ౄ) (ౢ ౣ) ె ే ై ొ ో ౌ ్

3. ఉభయాక్షరాలు: వ 3. వీటిలో 2 మాత్రమే సాధారణ వాడుకలో ఉన్నవి.

(ఁ) ం ః

4. హల్లుల మౌలిక రూపాలు వ38. వీటిలో 34 మాత్రమే సాధారణ వాడుకలో ఉన్నవి.

క ఖ గ ఘ ఙ
చ ఛ జ ఝ ఞ
ట ఠ డ ఢ ణ
త థ ద ధ న
ప ఫ బ భ మ
యే ర (ఱ) ల ళ (ఴ) వ శ ష స హ
(ౘ) (ౙ)

5. హల్లుల వత్తులు: = 36. వీటిలో 34 మాత్రమే సాధారణ వాడుకలో ్క ్ఖ ్గ ్ఘ ్ఙ
్చ ్ఛ ్జ ్ఝ ్ఞ
్ట ్ఠ ్డ ్ఢ ్ణ
్త ్థ ్ద ్ధ ్న
్ప ్ఫ ్బ ్భ ్మ
్య ్ర ్ఱ ్ల ్ళ ్వ ్శ ్ష ్స ్హ

6. ప్రత్యేక చిహ్నాలు: =5

సకారపు పొల్లు	[illegible]	= 1
వలపలి గిలక	[illegible]	= 1
క్షావత్తు	[illegible]	= 1
క్రావడి	[illegible]	= 1
ప్లుతం	[illegible]	= 1

మొత్తం లేఖన చిహ్నాలు: 111. ఐతే వీటిలో 96 మాత్రమే సాధారణ వాడుకలో ఉన్నవి.

ఐతే ఈ నూటపదకొండు లేఖన చిహ్నాలలోని 96అక్షరాలు వివిధ రకాలుగా కలిసి (అక్షరాలగుణింతాలూ ఒత్తుల కలయికతో) పదహారువందలకు పైబడి సంక్లిష్ట అక్షరాలు ఏర్పడతాయి. వీటిని రాసే పద్ధతిని సులభతరం చేయటానికి ఒత్తు హల్లులను ఒకదానికింద ఒకటి గాక ఒకదాని పక్కన ఒకటి ఇచ్చే పద్ధతిని పాటించాలి.

(15 వ పుటతరువాయి)

ఏమీ పనికిరాదు. పనికివస్తుందని ఎవరైనా అంటే నేను లక్షరూపాయలు ఎదురిచ్చి సవాలునెదుర్కొంటాను. ప్రాధికార సంస్థే కావాలి. అది సాధిస్తే ప్రపంచ మహాసభలు చాలా సక్సెస్‌ఫుల్‌గా జరిగినట్లే. ఎట్లాగూ ఒకటి నుంచి పన్నెండు దాకా తెలుగు సబ్జెక్టు చేర్చారు. అట్లే ఒకటి నుంచి ఐదు దాకా మాతృభాషలో బోధనకు ఏర్పాటు చేసి...ఎలాగైతే సారా మానండి అనీ గుట్కాలు మానండి అనీ ప్రభుత్వం ప్రచారం చేస్తోందో అదే విధంగా 'తెలుగు మాధ్యమంలో చేర్చండి' అని ప్రచారం చేయాలి. ఇది చేస్తూ ఇరవై శాతం ప్రభుత్వ ఉద్యోగాలను తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి ఇవ్వాలి. ఎవరివ్వాలి...ప్రభుత్వం ఇవ్వాలి. ఎక్కడైనా ఇచ్చారా? అంటే తమిళనాడులో ఇచ్చారు...ఇది చేస్తే కోర్టుకు వెళతారని, కొట్టేస్తారని దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారు. ఏం కొట్టేయరు. పనికిమాలిన కాగితాలు పెడితే కొట్టేస్తారు. తమిళనాడులో కూడా ఎవరో కోర్టుకు వెళ్ళారు. హైకోర్టు ఆ దావాను అడ్డంగా కొట్టేసింది. ఇరవై శాతం రిజర్వేషన్ కరక్టే అని జడ్జిమెంట్ ఇచ్చింది. అందువల్ల ఈ విషయాలను పెద్దలు, అధికారులు ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లండి...

ఒకప్పుడు సురవరం ప్రతాపరెడ్డిగారి జన్మదినోత్సవాన్ని తెలుగు వారసత్వ దినోత్సవంగా సమాఖ్య ప్రకటించింది. సురవరం ప్రతాపరెడ్డిగారు సాంఘిక చరిత్రను వ్రాశారు. తెలుగుజాతికి స్ఫూర్తి ప్రదాత ఆయన. అలాగే కాళోజీ. కాళోజీని చిన్న విషయంగా చూస్తున్నారు కాని, మేమంతా గిడుగు, శ్రీపాద స్థాయిలో అనుకుంటాం. ఎందుకంటే, ఆధిపత్య భావజాలాన్ని ధిక్కరించినవారు కాళోజీ. భాషగురించి పట్టించుకుని ఆ రంగంలో ఆధిపత్య భావజాలాన్ని ధిక్కరించినవాడు కాళోజీ. అందరూ కాళోజీలైతే తప్ప ఈ రెండు రాష్ట్రాల్లో తెలుగు బాగుపడదని, ఇతర రాష్ట్రాల్లో కూడా తెలుగువారు బాగుండాలంటే మనం అంతా సమైక్యంగా పనిచేయాలి... అని కోరుతున్నాను.

నమస్కారం.

సన్నిధానం నరసింహశర్మ
9292055531

ఆరుద్ర వాత్సల్య ముద్రలు



మా రాజమండ్రిలో ఓ సాంప్రదాయిక పండితుడు నలుగురిలో నా గురించి మాట్లాడుతూ 'సన్నిధానం శర్మగారిని కొంత ఆరుద్రగారు పాడు చేశారు. ఇప్పుడు జయధీర్ తిరుమలరావుగారు పాడు చేస్తున్నారు' అన్నారు. ఈ వ్యాఖ్యానం నన్ను బాధపెట్టలేదు సరికదా, అందుకు పొంగి పోయాను. ఆ పండితుడి దృష్టిలోని పాడు చేస్తున్నారు అనే దానికి నా దృష్టిలో బాగు చేస్తున్నారనేదే అర్థం. ఇందులో ఒకరు గురువు; మరొకరు ప్రాణహితులు, సర్వకాల శ్రేయోభిలాషులు.

'మార్క్సిజం చదవండి. అన్నీ అర్థం అవుతాయి' అని నాకు ఆరుద్ర లేఖల్లో రాసేవారు, కలసినపుడు చెప్పేవారు.

ఆరుద్ర కవిత్వ, సాహిత్య సేవలు నేను ఎవరికీ చెప్పనవసరం లేదు. అవి తెలుగు జగద్విదితాలే. పొత్తపు గుడుల్లో గ్రాంధిక భాషలో రాసిన సాహిత్య చరిత్రలు అట్టలు వూడకుండా, కాగితాలు చిరగకుండా భద్రంగా ఉండడం గమనించాను. అవే గ్రంథాలయాల్లో ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం మొదట వేసిన సంపుటాలు అట్టలూడి పోయో, కాగితాలు చిరిగిపోయో ఉండడం గమనించాను. సామాన్య పాఠకుల్లోకి చొచ్చుకు పోయేలా చక్కని వాడుక భాషలో ఆరుద్ర రాయడమే ప్రధాన కారణం.

సమగ్రాంధ్ర సాహిత్యం సంపుటాలు అచ్చేసి ఎమెస్కో ఎం.ఎన్. రావు సాహిత్య సేవలో పాలు పంచుకున్నారు. ఆరుద్ర లోటు పాట్లను ఎత్తి చూపగల ఆనాటి మహనీయుల పీఠికలతో ఆయన తన సంపుటాలను వెలువరించడం ఆషామాషీ అంశం కాదు.

నాకు సి.పి.బ్రౌను పిచ్చిని కలగజేసింది బంగోరేగారయితే ఆ పిచ్చి ముదరడానికి కారకులు ఆరుద్రగారే.

మద్రాసులో సి.పి.బ్రౌను వసంతోత్సవాలు జరిగాయి. ఆరుద్ర పిలవగా నేను ఆ సభలకు హాజరయ్యాను. డా॥ మంగమ్మ వంటి మౌలిక పరిశోధకులు పరిశోధనా ప్రసంగాలు చేశారు. ఆ సభలో ఆరుద్ర ఓ విషయం చెప్పారు, అధ్యక్షులుగా "నేను ప్రత్యేకించి ఏమీ మాట్లాడను కానీ వక్తలు మాట్లాడని అంశాల మీదే మాట్లాడతానని చెప్పి అలాగే క్రొత్త పరిశోధనాంశాలు నాటబలికి అచ్చెరువు కూర్చారు. అత్యంత సూక్ష్మాంశాలను గుర్తించి విశ్లేషించడం ఆరుద్రకే చెల్లింది.

నూరేండ్ల తెలుగు వ్యాసంపై ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఒక పుస్తకాన్ని ప్రకటించింది. ఆ వ్యాసంలో మా గురువుగారు మధునా పంతులవారు ఒక వ్యాసం రాశారు. ఆ వ్యాసం దిగువన 'నా వెంబడిని సహకరించిన చిరంజీవి సన్నిధానము నరసింహం శర్మకు నా ఆశీస్సులు'. అని రాశారు. ఆరుద్రగారు 'శర్మగారూ శాస్త్రిగారు 'వెంబడిని సహకరించిన' అని భలే రాశారన్నారు. సహకరించడానికి వెంబడిని సహకరించడానికి గల తేడా పాదాల్ని ఆయన గ్రహించారు.

గురజాడ సాహిత్య పరిశోధకులు, ఆంధ్రోపన్యాసకులు వీరేశలింగ స్వీయ చరిత్రను ఇటీవల పునర్ముద్రించి పుణ్యం కట్టుకున్న శ్రీ అరిపిరాల నారాయణరావు నరసాపురం 'తెలుగు వెలుగు' పేరిట సాహిత్య సభలు వైభవోపేతంగా చేశారు. తెలుగు సాహిత్య రంగంలో జీవించి వున్న హేమా హేమీల కూడిక అపూర్వ సంఘటన. ఆ సభలకు ఆరుద్రగారు, ఆయన గురువు రోణంకి అప్పలస్వామి వంటి ఎందరో వచ్చారు.

ఆరుద్రకు వూరికి కొంచెంపాటి దూరంలో వసతి ఇచ్చారు. ప్రొద్దుటి చల్లనివేళ. ఆయనకు వేడి నీళ్లు కావాలి, లేవు. ఆయన ఇబ్బంది వ్యక్తం చేశారు. ఒక అయిదు నిముషాల్లో వస్తానండి అని బయటకు వచ్చాను. అల్లంత సమీప దూరంలో ఓ ఇల్లు. వారింటికి వెళ్ళాను. అదృష్టం కొద్దీ ఆ కుటుంబంలోని భార్యాభర్త ఎదురుగా ట్రాన్సిస్టరు పెట్టుకుని పాట వింటూ హాయిగా కాఫీ తాగుతున్నారు. ట్రాన్సిస్టరు నుండి 'రాయినైనా కాక పోతిని రామపాదము తాకగా' అనే పాట – ఆరుద్రది వస్తోంది. నేను లోపలికి వెళ్ళి ఏమండీ మీరు వింటున్న పాట ఎవరు రాశారో తెలుసునా అన్నాను. తెలియకపోడమేమిటి? ఆరుద్రగారు రాశారు అన్నారు రకీమని. 'అదిగో ఆ ఇంట్లో ఆరుద్ర బస చేశారు. ఆయన్ని చూడాలనుకుంటున్నారా? అన్నాను. అంత మహాకవిని చూడ్డం అంటే ఇష్టమే అన్నారు.

అయితే ఓ బకెట్టు వేడినీళ్ళ లంచం ఇవ్వగలరా? చూద్దురుగాని అన్నాను. వారికి అర్థం అయింది. ఆనందంగా భార్యాభర్తలు బకెట్ వేడి నీళ్ళతో వచ్చారు. ఆయన ఆనందించారు. వారితో కొంతసేపు ముచ్చటించారు. తర్వాత లంచం విషయం ఆరుద్రతో చెప్పగా భలే చేశారండీ అని నవ్వుకున్నారు.

తాపీ ధర్మారావు కాగడా పత్రికలో ఎప్పుడో ఆరుద్ర కవిత వేసి ఈ కుర్రాడు వృద్ధిలోకి వస్తాడన్నట్టు దాని క్రింద రాశారు. దాని జెరాక్సు

ఆరుద్రకు పంపగా నా దగ్గర లేని నా కవితను నాకు పంపినందుకు కృతజ్ఞతలు అని రాశారు.

ఆరుద్ర షష్టిపూర్తికి నేను, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ రాజమండ్రి నుండి వెళ్లాం. ఉదయాన్నే ఆయన ఇంటికి వెళ్ళి ఫలపుష్పాలిచ్చుకున్నాం. నమస్కరించుకున్నాం. సినీ నటులు, గాయకులు, దర్శకులు, నిర్మాతలు అలా అలా వస్తుండడం చూసి నేను, శ్రీమన్నారాయణ లేవబోయాం. ఆరుద్ర మాతో నెమ్మదిగా వస్తుంటారు, వెడుతూంటారు. మీరిద్దరూ వెళ్లకండి వుండండి అన్నారు ప్రత్యేక ప్రేమతో.

సమగ్రాంధ్ర సాహిత్యంలో కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణగారి కవితను ఆరుద్ర పేర్కొన్నారు. కవిత్వంలో, పరిశోధనలు ఆరుద్ర సీరియస్ తత్త్వాన్ని కొత్తపల్లి ఎప్పుడూ మెచ్చుకునేవారు.

మద్రాసులో పొట్టి శ్రీరాములు గ్రంథాలయంలో నా సి.పి.బ్రౌను ఉదాహరణ కావ్యాన్ని ఆరుద్రకు అంకితమిచ్చాను. భమిడిపాటి రాధాకృష్ణ మొదలైనవారు విచ్చేశారు. ఆ సభలో బ్రౌను పై ఆరుద్ర విశేష ప్రసంగం చేశారు. ఆ సభలోనే ఆరుద్ర సాహిత్యంపై నేను ప్రసంగం చేశారు. ఆ సభలోనే ఆరుద్ర సాహిత్యంపై నేను ప్రసంగించాను. ఆ సభకు రాజమండ్రి నుండి వై.యస్.ఎన్, కొత్తపల్లి, నా శ్రీమతి శతకీర్తి, నా సోదరుడు శాస్త్రి, మరికొంతమంది స్నేహితులు బృందంగా వెళ్ళాం. ఆరుద్రగారింట్లో మేమందరం ఉండగా సందర్భవశాత్తు ఉదాహరణ కవితా ప్రక్రియ తెలుగువాళ్ల సొంతం అంటూ మాట్లాడుతూ శర్మగారూ 'సార్వవిభక్తికం' ఉదాహరణలో చాలా మంది రాశారని నన్ను చూసి అన్నారు. అది అందరికీ అర్థం కాలేదు. నేను సార్వ విభక్తికం రాయలేదనేది నాకు ఆ విధంగా సున్నితంగా తెలిపారు.

అరుణోదయం అనే పేరుతో ఆయన ఓ గ్రంథాన్ని రాజమండ్రి కేంద్రంగా రాద్దామనుకున్నారు. కుదరలేదు. ఆరుద్రకు సప్తతి ప్రారంభంలో ఆరుద్ర సాహిత్య పక్షోత్సవాలు ఉభయ గోదావరి జిల్లాలో ఆయన పుస్తకాలపై సమీక్షలు గోష్ఠులు ఏర్పాటు చేయించాం. ఎవరికీ జరగని అపూర్వ ఉత్సవాలు. శ్రీ జై.యాతగిరి, శ్రీ తుమ్మిడి, శ్రీ ఎస్.ఆర్. పృధ్వి నేతృత్వంలో జరిగిన ఆ సభలకు కొత్తపల్లి, నేను ఉపాధ్యక్షులుగా ఉండడం అలావుంచి గుణాత్మకంగా సాహిత్య ప్రయోజనకారిగా ఉండేటట్లు చేయడానికి ప్రయత్నించాం.

ఆంధ్రకేసరి సినిమాలో ఆరుద్ర 'వేదంలా ఘోషించే గోదావరి, అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి' పాట చరిత్రాత్మక హేతుబద్ధమైనపాట.

ఆ పాటలో నన్నయ్యను ఆరుద్ర 'ఆదికవి' అనలేదు. 'ఆదికవిత' నన్నయ్య రాసెనిచ్చట' అనడంలో ఆయన వాదం చెప్పుకున్నట్లయ్యింది.

కొట్టుకొని పోయె కొన్ని కోటి లింగాలు / వీరేశలింగమొకడు / మిగిలెను చాలు / అనడంలోనూ ఆయన సాంఘిక దృష్టి విప్పారి కనిపిస్తుంది.

"మీ వంటివారు నా వెనక వుంటే ఎన్ని పరిశోధనలైనా చేసుకోగలను. అని ఆరుద్ర ఓ లేఖలో రాశారు. ఇది బయటకు చెప్పుకుంటే ఆనందంగానూ, ఆలోచిస్తే భయంగానూ వుంటుంది. మా తమ్ముడి వివాహ సందర్భంగా జరిగిన విందుకు ఆరుద్ర వచ్చారు. దంపతుల్ని దీవించారు.

ఆరుద్ర, కొత్తపల్లి ఇలా మేమందరం ఉమ్మడి భోజనాలు చేశాం. మధునాపంతులవారు, మల్లంపల్లి శరభయ్యగారు వేరే మడి భోజనాలు చేశారు.

భోజనాలయ్యాక మధ్య ఓ హాలులో మధునాపంతులవారు, శరభయ్యగారు, ఆరుద్రగారు ఎన్నో లోతైన సాహిత్యాంశాలు మాట్లాడుకున్నారు. మేమంతా చుట్టూ కూర్చొని సుమారు రెండున్నర గంటల సేపు అసలైన సాహిత్యపు విందులో పాల్గొన్నాం.

మధునాపంతులవారు ఆరుద్రపై షష్టిపూర్తికి ఆంధ్రజ్యోతిలో

"మద్రపురివాసి మన ఆ
రుద్రకు భాషాదురంధరునకు నవవచో
భద్రునకు సినీగేయ స
ముద్రునకీ కంద పద్యమున్ జదివింతున్" అనే పద్యం

రాశారు. అవును ఆరుద్ర భాషాదురంధరుడే. అందువల్లే ఆయన కవిత్వం, వ్యాస పీఠ వ్యాసాలూ మిగిలినవీ ప్రజకు అందాయంటే ప్రజాభాషా దురంధరుడవడం వల్లే మరి.

సామినేని ముద్దు నరసింహనాయని హితసూచనికి ఆరుద్ర పీఠిక అదనపు ప్రయోజనాన్ని చేకూర్చింది. హితసూచనిని మళ్ళీ అచ్చేసినందుకు దేశం మీకు ఋణపడుతుంది అని నాకు ఓ లేఖలో రాశారు. ఆ ఋణపడడం బహు వచనానికే కాని ఏక వచనానికి కాదు. అ

కవిత

సృష్టిలో తీయని బంధం అమ్మ,

అంగడిలో దొరకనిది అమ్మ,
అంతులేని ప్రేమను కురిపించేది అమ్మ.
సభ్యత, సంప్రదాయాలను ఉగ్గుపాలతో
రంగరించి మహోన్నతమైన వ్యక్తిగా
నిను తీర్చిదిద్ది ఆదర్శవంతమైన
నడతను నేర్పించేది అమ్మ,
నిత్యసత్యం అమ్మ,
అమృత వర్షిణి అమ్మ,
త్యాగమయి, ప్రాణదాత అమ్మ,
నిను లాలించి, బుజ్జగించి, ఊరడించి
తొలి అడుగు వేయించేది అమ్మ,
తొలి మాటను పలికించేది అమ్మ,
అభిమానానికి మారుపేరు అమ్మ,
ఆత్మీయతకు మరో పేరు అమ్మ,
అమ్మ హృదయం మమతల కోవెల,
అమ్మకు అమ్మే నిర్వచనం.

రాయవరపు సరస్వతి
7989665525

తెన్నాటి తెలుగుపాటలు - 3

సామల మురళి
9486135396

తమిళ నుడి, నానుడి సాగుబడి ఎంతో ఎంతో గొప్పవని, అంత గొప్పతనం తెలుగుజాతిలో లేదని తెలంగాణ ఆంధ్రలలోని కొందరు తెలివిపరుల అనిపింపు. అందుకోసం వాళ్లు ఎన్నో మచ్చులను ఎత్తి చూపుతుంటారు. నిక్కానికి తమిళ ఆటలుగా పాటలుగా పేరుకెక్కిన ఎన్నో కళలూ కళాచారాలు, తమిళులవి కావు. అవి తెలుగువాళ్ల నుండి వాళ్లు తీసుకొన్నవి. తెన్నాడు (ఇప్పటి తమిళనాడు) లో మనకు కనిపిస్తున్న మొత్తం 110 పల్లెకళల్లో, 105 తెలుగువాళ్లవి. ఈ మచ్చు చాలదా, ఇది తమిళనాడు కాదు అని చెప్పడానికి.

'తమిళంలో ఒప్పారి పాటలు అని ఉంటాయి. ఇంట్లో మనిషి చనిపోయినప్పుడు పీనుగ దగ్గర పాడే పాటలివి. ఇవి ఇంకే నుడిలోనూ ఉండవు. తమిళులకే తనికమైన కళ ఇది' అని తమిళ, తెలుగు తెలివిపరులు పనికట్టుకొని చెపుతుంటారు. అది తప్పుడు చెప్పిక అని ఎత్తి చూపించేవే ఈకింది పాటలు. కేరళ ఎల్లకు అద్దరిన ఉండే ఉడుమలపేట తావులో ఇప్పటికీ పాడుకొంటున్న **తిరుమంతరాల పాటలు** ఇవి. తమిళంలో ఒప్పారి పాటలు అంటే తెలుగులో తిరుమంతరాల పాటలు అంటారు.



పాడింది:సప్పా పొన్నమ్మ (90 ఏండ్లు)
ఊరు:రాగలబావి క్రిష్ణాపురం
కులం:మాదిగవారు

పాట 1 :

పత్తి పువ్వుల పందిలివేసి పల్లెరు పువ్వుల సింగారించి
సింగారించిన జవులిలోన చిన్నబిడ్డ...లేదే నోటిమాట... సో...

జిల్లిడి పువ్వుల పందిలివేసి జాజి పువ్వుల సింగారించి
సింగారించిన జవులిలోన చిన్నబిడ్డ...లేదే నోటిమాట... సో...

గన్నెరు పువ్వుల పందిలివేసి కనకంబరాల సింగారించి
సింగారించిన జవులిలోన చిన్నబిడ్డ...లేదే నోటిమాట... సో...

గుమ్మిడి పువ్వుల పందిలివేసి తుమ్మిపువ్వుల సింగారించి
సింగారించిన జవులిలోన చిన్నబిడ్డ...లేదే నోటిమాట... సో...

తంగెడు పువ్వుల పందిలివేసి తుమ్మి పువ్వుల సింగారించి
సింగారించిన జవులిలోన చిన్నబిడ్డ...లేదే నోటిమాట... సో...

పాట 2 :

కాకర పువ్వున కన్న తల్లంటె నానాన నానాన నానా నానాన
గుమ్మిడి పువ్వున గుంపు పెద్దలంటె. నానాన నానాన నానా నానాన
సిక్కుడు పువ్వున సిన్నవారంటె నానాన నానాన నానా నానాన
మల్లియ పువ్వున మామగారంటె నానాన నానాన నానా నానాన
తలపాలు తలపాలు తల్లి తలపాలు నానాన నానాన నానా నానాన
సిందకుండంటండ సిన్ని తలపాలు నానాన నానాన నానా నానాన
సిందితే నవ్వుతురు సిన్ని తలపాలు నానాన నానాన నానా నానాన
కంబమా కంబమా కొడుకా కంబమా నానాన నానాన నానా నానాన
మన్నుగరుసుకాడ కొడుకా కంబమా నానాన నానాన నానా నానాన
తలపాలు తలపాలు తల్లి తలపాలు నానాన నానాన నానా నానాన

మన్నుగరుసు = పూడ్చిపెట్టిన చోటు

పాట 3

నాన నానా నానా నానా నానా నానా నానా నానా
నాన నానా నానా నానాన నా నానా నానా

ఆడి అమాసనాడు దాయాదుల పూజనేడు
సోది సోమారంనాడయ్యా మా సాములాలా
సొక్కనాదం పొయ్యేనిప్పుడు ॥నాన॥

మన్ను రూపు చేసిన వారికి **మండన** రాత రాసినవారికి
ఏడుపు ఏల లేదయ్యా మా సాములాలా
ఎళువు రాగము నేడు సిక్కేనా ॥నాన॥

కుండమింద కుండపెట్టి పాలకుండ పైన పెట్టి
పాడెమింద పోయేవాడా మా సాములాలా
ఈ పాటలెల్ల నీ మింద పోయేనా ॥నాన॥

సీరకాలే సీరంచులు కాలే సిన్నిదామర సొంపుకాలే
ఆకులు తిన్న పల్లు కాలేనా మాయమ్మా నేడు
ఎండముల్లుకు మొగము కాలేనా ॥నాన॥

మండన = తలబుర్ర
ఎళువు = చావు

జిల్లాస్థాయి వరకు కోర్టుల్లో తీర్పులు తెలుగులో తేవాలి (జి.ఒ.నెం. 485/29.3 1974)

కీ. శే. ఇస్మాయిల్

నాయుడుగారి కాలేజి

ఉపాధ్యాయత్వానికి మారుపేరుగా మేధావులకు, సంస్కర్తలకే ఆదర్శంగా జీవితాన్ని గడిపిన కారుణ్య మూర్తి కీ.శే. రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు. తెలుగువారి చరిత్రలో ఎన్నటికీ మరువదగని మహా వ్యక్తులను తన శిష్యుల నుంచి తీర్చిదిద్దిన నిజమైన 'గురువు' ఆ మహానుభావుడి గురించి కవి – కీ.శే. ఇస్మాయిల్ ('చెట్టు' ఇస్మాయిల్‌గా ప్రఖ్యాతి గాంచిన కవి) వ్రాసిన ఈ వ్యాసాన్ని అందరూ చదివి భద్రపరచుకో తగినదిగా భావించి, ఈ సంచికలో ప్రచురిస్తున్నాము. ఈ వ్యాసాన్ని 'అమ్మనుడి' లో ప్రచురించమని సూచిస్తూ, ఈ వ్యాసాన్ని ఎంపిక చేసి పంపించిన మిత్రుడు టి. రవిచంద్ (బాపట్ల)గారికి మప్పిదాలు (కృతజ్ఞతలు) – సంపాదకుడు.

◇ ◇ ◇

1904 లో కాకినాడ పి.ఆర్. కాలేజి ప్రిన్సిపల్ ఉద్యోగం ఖాళీ ఐతే, దానికి ఇద్దరు ఉద్దండులు దరఖాస్తు చేశారు. పి.శ్రీనివాస శాస్త్రి, రఘుపతి వెంకటరత్నం నాయుడూ. శ్రీనివాసశాస్త్రి తరఫున న్యాపతి సుబ్బారావు పంతులుగారు గట్టి ప్రయత్నం చేస్తున్నారని విని, వీరేశలింగం పంతులుగారు పనికట్టుకుని కాకినాడ వచ్చి, నాయుడుగారికే ప్రిన్సిపల్ పదవి ఇవ్వాలని పట్టుపట్టారు. ఈ విధంగా బ్రహ్మర్షి వేంకటరత్నం నాయుడుగారికి కర్మక్షేత్రమయే అదృష్టం కాకినాడకు పట్టింది.

నాయుడుగారి రాకతో కాకినాడలో ఒక గొప్ప వెలుగు ప్రవేశించింది. అక్కడితో ఆగక అది దేశం నలుమూలలా ప్రసరించింది. నాయు దుగారు తనతో ఒక చైతన్య గంగని కొని తెచ్చారు. అది మూడు మానవతా స్రవంతుల త్రివేణి సంగమం. భక్తీ, కరుణా,



జిజ్ఞాసల కలయిక. ఇది బ్రాహ్మ సమాజ దీక్షగానూ, సంఘ సంస్కరణ కార్యకలాపంగానూ, విద్యాప్రసరణ చేసే ఆచార్యత్వం గానూ ముప్పేటలుగా ప్రవ హించి దేశాన్ని సుక్షేత్రం చేసింది.

వేలెత్తి చూపించడానికి వీల్లేని నిష్కళంకమైన జీవితాన్ని ఏకేశ్వరోపాసనలో అసిధారా వ్రతంగా గడిపిన బ్రాహ్మ తపస్వి ఆయన. 'బ్రహ్మర్షి' అనే బిరుదు ఆయనకెంతో తగింది. నాయుడుగారు దేశానికి బహిర్వివేకం (external conscience) వంటివారని ఆయన శిష్యులు ముట్నూరి కృష్ణారావుగారన్నారు.

అనాథల కోసం, పతితుల కోసం పరితపించి నాయుడుగారి హృదయం కరుణా వాహినిగా పారిందనిపిస్తుంది. ఈయన ప్రోత్సాహం తోనే పిఠాపురం రాజావారు కాకినాడలో అనాథ శరణాలయయం కట్టించారు. అపారమైన కరుణాంతరంగమే ఈయన్ని సంఘ సంస్కరణోద్యమంలోకి దింపింది. ఈయన తలపెట్టిన కార్యక్రమాల్లో ముఖ్యమైనవి కళావంతుల సముద్ధరణా, అనాథ శరణాలయమూ.

ఐతే, నాయుడుగారిని ఆంధ్రుల హృదయపీఠంపై స్థిరంగా ప్రతిష్ఠించింది ఆయన ఆచార్యత్వమే. ఆంధ్రుల సాంస్కృతిక పునరుజ్జీవ నానికి ఈ శతాబ్దారంభంలో వైతాళిక గీతం పాడిన ముగ్గురు నలుగురిలో ఆయనొకడు. ఉజ్వలమై తన ప్రతిభా జ్యోతితో తెలుగునాట ఎన్ని వెలుగుదివ్వెలు వెలిగించాడో. ఆయన విద్యార్థుల్లో అంతమంది ప్రతిభావంతులు మొలకెత్తారంటే, ఆయన ప్రభావమే కారణం. ఆయన శిష్యులు కృష్ణశాస్త్రి గారంటారు : "నాయుడుగారు నవ్యాంధ్ర నిర్మాతలలో ప్రముఖులు. దాదాపు యాభై సంవత్సరాలు ఆంధ్ర యువ మనస్సులకు ఆశయ పక్షాలు తొడిగిన గురుదేవులు ఆయన. ఆంధ్ర యువకులను ఇట్టే నాలుగు సోపానాల నెక్కించి సత్యసాన్నిధ్యమున నిలబెట్టిన సోక్రటిసు ఆయన. తర్వాత మన తెలుగునాట అనేక కార్యరంగాలలో నాయకులై నడిచి, దేశాభ్యున్నతికి కారకులైన ప్రముఖులెందరో వారి శిష్యులో, వారి ప్రభావంలో పద్దవారో!"

ఆ మాటకొస్తే, నాయుడుగారు కాకినాడకు రాకపూర్వమే, బందరు నోబెల్ కాలేజిలో పనిచేస్తున్నప్పుడే శేముషీ దురంధరులైన శిష్యగణాన్ని మలిచారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావుగార్లు నాయుడుగారికి ప్రియతములైన అంతేవాసులు. వీరి వ్యక్తిత్వాలని నాయుడుగారే తీర్చి నిర్మించారు.

ఇక కాకినాడలో చెప్పఖర్లేదు. నాయుడుగారి శిష్యులమని గర్వంగా చెప్పుకునే వాళ్లు ఎన్ని వేలమందో! వీళ్లలో ఎంతంతేసివాళ్ళు! తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.

నాయుడుగారి అధ్యాపక ప్రతిభతో ముగ్ధులైన కృష్ణశాస్త్రిగారంటారు: 'అభ్యాసకుడైన నాయుడుగారికి కొన్ని గొప్పశక్తులుండేవి. కవికిలాగే అధ్యాపకునికీ అవి అవసరం.

ఒకటి : ఆయన హృదయం ప్రతి వాయు నిహతికీ కంపించిపోయే శతతంత్రి మహా తివంటిది. ప్రతి శిష్యునితోడి అనుభవాలే కాదు, లోకంలోని ప్రతి వస్తువుమాత్రమే కాదు, ప్రతి కావ్యంలోని అనుభవాలు కూడా ఆయన మనస్సును కదిపివేసేవి...రెండవది : వారి భావనాశక్తికి అవధి అంటూ లేదు, వారి భావన ఇట్టే పక్షాలను పరచుకునేది. ఇట్టే వైదిక యోగులనాటి భాగీరధీ తీరానికో, బదరికాశ్రమానికో ప్రయాణమయ్యేది. అంతలో హఫీజు, సాదీవంటి పారశీకభక్తుల మధువనాలలో వాలి కాలూనేది. అప్పుడే షేక్స్పియర్, వర్డ్స్వర్త్, గెటి, కార్లైల్ వంటి పాశ్చాత్య ప్రవక్తల విజ్ఞాన గగన వీధులలో విహరించేది...వీటికి తోడు వీరికి అసాధారణ మైన వాక్ ప్రతిభ వుండేది. ఈ దివ్యశక్తులతో నాయుడుగారు తన శిష్యుల్ని ముగ్ధుల్ని చేసి లోబరచుకునేవారు".

తన విద్యార్థుల్లో కృష్ణశాస్త్రి వంటి కవినీ, చలం వంటి కథకుణ్ణీ రగలించినవి ఈ శక్తులే అనుకుంటాను. ప్రతి గాలితెరకీ కంపించే సుకుమార చేతనా (సెన్సిబిలిటీ), పారశీక మధువనాల్లో, స్కాట్ హైలాండ్స్‌లో సమంగా రెక్కలు విప్పి తేలిపోయే భావనా (ఇమాజినేషన్) ఎంతో మంది శిష్యుల్ని inspire చేసి కవిత్వోద్దీపకాలయాయి.

శాస్త్రిగారు ఇంకా ఇలా అంటారు. "నాయుడుగారు నాటి ఆంధ్ర యువకులకు ప్రసాదించిన వరాలు రెండనుకుంటాను. అవి ఉదారాశయ శీలమూ (ఐడియలిజమ్), తత్త్వ దృష్టినీ, జీవితాన్ని ధ్రువ మండలానికి తగిలించి యాత్ర సాగించడమూ, ప్రత్యణువునందున్న అనంతత్వాన్ని ప్రత్యనుభూతిలో పరమార్థాన్నీ పరిశీలింప యత్నిం చడమున్నూ".

నిజంగా ఎప్పటికీ ఆరిపోనివి, కలకాలం యువతని జీవన ప్రభాతంకేసి నడిపించేవి ఈ రెండు వరాలే. వీటిని దేశం ఏనాడు విస్మరిస్తుందో, ఆనాటి నుంచీ దానికి తిరోగమనమే. 'సత్యాన్వేషణ' అనే చరమ విలువకి ఈ రెండూ అభివ్యక్తులు, నాయుడుగారు ప్రసా దించిన ఈ వరమే ఇప్పటికి జీవించి ఉంది. ఆయన సంఘ సంస్కరణ ప్రణాళికలు ఎప్పుడో మాసిపోయాయి. ఆయన స్థాపించిన అనాథ శరణాలయాన్ని మెడికల్ కాలేజీవారు ఆక్రమించుకుని, అనాథుల్ని దూరంగా చిన్న షెడ్డులోకి గెంటేశారు. దేశం నిండా ఇంకా అనాథలకి కొదవలేదు. అప్పటి కళావంతులనేకులం వారు పెళ్ళిళ్లు చేసుకున్నారు కాని, కొత్త తరహా కళావంతులు కుప్పలు తిప్పలుగా పుట్టుకొచ్చారు. పైపైన తుడిచినంత మాత్రాన సమసిపోయే సమస్యలు కావివి. వీటి వేళ్లు చాలా లోతుగా ఉన్నాయి.

కాని, నాయుడుగారినించి సంక్రమించిన సత్యాన్వేషణ అనే విలువ ఆయన శిష్యుల్ని, ప్రశిష్యుల్ని కొత్త వెలుగులకి కొత్త లోకాలకి నడిపించింది. ఆయన విద్యార్థి చలంగారినే తీసుకోండి. ప్రపంచాన్ని ప్రశ్నించటం ఈయన నాయుడుగారి దగ్గిరే నేర్చుకున్నాడు. మొదట హిందూమతాన్నీ, దాని మూఢాచారాల్నీ, అంధ విశ్వాసాల్నీ ప్రశ్నించి, తిరగబడి, బ్రాహ్మ సమాజంలో చేరాడు. చివరికి ఆయన నిశితమైన అన్వేషణకి బ్రాహ్మ మతం కూడా తట్టుకోలేకపోయింది. పాపమంటే ఏమిటీ? మనకు ఇంత ఆనందమిచ్చే పనులు కూడా పాపమం టున్నారే. నిజంగా పాపమైతే వీటిలో ఇంత ఆనందమెందుకు నిక్షిప్తం చేస్తాడు దేవుడు? అసలు దేవుడెవరు? ఉన్నాడా? అని ఇలా ప్రశ్నిం చుకుంటూ, సత్యాన్వేషణ మార్గంలో పడిపోయాడు చలంగారు. ఇవేవీ నాయుడు గారి ఆమోదం పొంది వుండకపోవచ్చు. కాని, దారి ఆయన చూపిందే. నాయుడుగారు వెలిగించిన జ్ఞానజ్యోతి ఇంకా తెలుగునాట వెలుగుతోనే వుంది, బ్రాహ్మ సమాజమూ, సంఘ సంస్కరణలూ సమసి పోతే పోయాయిగాని, ఈ సత్యాసక్తి, అన్వేషణా మానవజాతికి ప్రాణం. ఇది మనకు నాయుడుగారి వరమే.

ఇంతకీ నే చెప్పొచ్చేదేమిటంటే, ఈ శతాబ్దం మొదటి మూడు దశాబ్దాల్లో కాకినాడ పి.ఆర్.కాలేజి సత్యం, కరుణా, సౌందర్యం వంటి మానవతా విలువలకి ధర్మక్షేత్రంగా ఉండేదని, నేను కాలేజీలో విద్యార్థిగా ప్రవేశించేటప్పటికి (1942) నే పైన పేర్కొన్న మహాను భావులు ఈ పట్టణాన్నీ, ప్రపంచాన్నీ విడిచిపెట్టేశారు. అప్పటికే మాకు వాళ్ళ జ్ఞాపకాలూ, ప్రభావాలూ మిగిలాయి.

అప్పటి మా కాకినాడ కుర్రవాళ్ళని పి.ఆర్. కాలేజి తన అంద మైన ఉద్యాన వనంతో తల్లిలా సాకింది. పిల్లలు బడి ఎగ్గొట్టటానికీ, ఆడుకోటానికీ, తరువాత చదువు నేర్చుకోటానికీ తల్లి ఒడి ఎలా పనికొస్తుందో ఆ విధంగా కాలేజి మాకు ఉపయోగించింది. బాగా చిన్నప్పుడు మెక్లారిన్ హైస్కూల్‌లో చదువుకునే రోజుల్లో, లెక్కల చిక్కులు మా బుర్రల్ని తికమక పెడితే, క్లాసెగ్గొట్టి పి.ఆర్. కాలేజి తోటలో మామిడి కొమ్మెక్కి కూచునేవాళ్లం. ఆకుల సందుల్లోంచి సూర్యకిరణాల గేలం వూగుతుంటే, మా కళ్ళు చేప పిల్లల్లా గుండ్రంగా ఈది నిద్ర మత్తుకు జోగేవి. క్లాసు బెల్లు టంగున మోగగానే చెట్లు దిగి వచ్చే వాళ్లం. ఇంకాస్త ఎదిగాక కాలేజి మామిడి తోటలో సాయంత్రాలు ఫుట్‌బాల్ ఆడేవాళ్లం. ఆ రోజుల్లో చాలా దట్టంగా ఉండేవి చెట్లు. మునిమాపు చీకట్లలో చెట్లు, ఆకాశమూ, బంతీ ఏకమైపోయేవి. వెతికి వెతికి చెట్ల నించీ, ఆకాశాన్నించీ బంతిని విడదీసి చీకట్లో ఇళ్ళకి మళ్లేవాళ్లం. తర్వాత ఎన్నాళ్ళో ఎదురు చూసిన శుభసమయం, కాలేజీ ప్రవేశం. పొన్నుస్వామయ్యరు మాకు ప్రిన్సిపాలు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ, అనర్గళంగా ఉపన్యసించేవాడు, కాని 'రెండు' అనే తెలుగుమాట పలకలేక పోయేవాడు. పాపం 'రొండు' అనేవాడు. అ సమయం కోసం పొంచి ఉండే వాళ్ళు కుర్రాళ్ళు. పోనీ 'రెండు' అనే పదం ఉపయోగించకుండా ఉపన్యాసమివ్వవచ్చుగా. ఊహు. బిలియర్డ్స్ బంతి వెళ్ళి పాకెట్‌లో పడ్డట్టు ఎక్కడో ఓ చోట 'రొండు' అని తీరేవాడు. హాలు ఎక్స్‌ప్లోడ్ అయేది. సభ ముగిసేది.

మాకు నిడదవోలు వెంకటరావుగారూ, అత్తిలి సూర్యనారాయణ గారూ తెలుగు చెప్పేవారు. పాల్‌గారు, పాలగుమ్మి పద్మరాజుగారు కెమిస్ట్రీ, వి.సూర్యప్రకాశంగారు ఫిజిక్సు, దీక్షిత్, సచ్చిదానందం పిళ్లై, కృష్ణారావు, నేమాని వెంకటరావుగార్లు ఇంగ్లీషు చెప్పేవారు. కోపెల్ల

శివకామేశ్వరరావుగారు, చెళ్లపిళ్ల సీతారామమూర్తిగారూ అప్పుడప్పుడు వస్తుండేవాళ్ళు. అప్పుడు చెట్లు ఇంకా గుబురుగా ఉండేవి. చెట్ల క్రింద సిమెంటు అరుగులు కట్టించారు. కొన్ని క్లాసులు చెట్ల కిందే జరిగేవి. ఋష్యాశ్రమంలా ఉండేది ఆ రోజుల్లో కాలేజి. కాలేజి తోటల అందానికి చాలా వరకు టి.యు., చాకోగారు కారణం. కాలేజి బొటానికల్ గార్డెన్ దేశమంతా పేరుమోగింది. ఇప్పుడు చెట్లు చాలా వరకు కూలిపోయి, మొక్కలెండిపోయి యెడారి రూపు దాలుస్తోంది కాలేజి. దీని గురించి శ్రద్ధ తీసుకుంటే బాగుణ్ణు.

పి.ఆర్.కాలేజి నా బాల్యంతో ఎంత పెనవేసుకుపోయిందంటే, ఆ కాలేజిలో అధ్యాపక వృత్తి చేయటం నా జీవిత పరమార్థంగా భావించేవాణ్ణి. చివరికదీ సాధించాను. కాని పూర్తి సంతృప్తి లభించ లేదు. ఇప్పటి పరిస్థితుల్ని గమనిస్తే, అప్పటి గురుశిష్య సంబంధం గురించి కృష్ణశాస్త్రిగారన్న మాటలు గుర్తుకు రాక మానవు. “గురు శిష్యులలో ఏకాత్మతను చిందించే సఖ్యం ఉండాలి. ఒక్కొక్కప్పుడు వారు తండ్రీ కొడుకునూ, ఒక్కొక్కప్పుడు స్నేహితులన్నూ, అంత మహోపాధ్యాయుడైన నాయుడుగారు మాతోగూడా చదువుతూ వ్రాస్తూ నడుస్తున్నట్లుండే వారు. మిమ్మల్ని తమ హృదయ మందిరంలోనికి పిలిచి మంతనాలాడుతున్నట్లుండేవారు. వారు చదువు చెప్పడం కూడా క్లాసు రూములో ఆగిపోయేదికాదు. ఇంట్లో, వీధిలో, విహార భూమిలో, ఉపాసనా మందిరంలో, సభాస్థలిలో, ప్రత్యేక కూటాలలో, ఎల్లవేళలా అన్నిచోట్ల మాకు పాఠశాలలే. వారున్న తావు గురుకులం”.

అప్పటికీ, ఇప్పటికీ ప్రపంచం చాలా మారింది. అన్ని రంగా ల్లోనూ ప్రమాణాలు తగ్గటమే కాదు. వ్యాపారదృష్టి, స్వార్థమూ, భౌతిక మైన సుఖాభిలాషా ప్రవేశించాయి. ఐతే, ఇటువంటి అవాంఛనీయ వైఖరుల్ని విద్యారంగంలోకి అడుగెట్టనివ్వటం మంచిదా? అని దీనికి సంబంధించిన వాళ్లందరూ వేసుకోవలసిన ప్రశ్న. కాలేజిలో చదువు కన్నా బైట ట్యూషన్లకే ఎక్కువ కాలం, శ్రమా శ్రద్ధా వినియోగించే వాళ్ళూ, కాలేజి వేళలో కూడా సొంత వ్యాపారాలు నడిపే వాళ్ళూ, షేక్స్‌పియర్ కన్నా పియర్‌లెస్ ఏజన్సీ ముఖ్యమని భావించే వాళ్ళూ ఇవాళ అధ్యాపక వృత్తిలోకి అడుగెడుతున్నారంటే, మన దేశం ముందుకు వెడుతోందా, వెనక్కా?

నాకు ప్రియతమమైన కాలేజి శతజయంతి జరుపుకుంటుం దంటే ఎంతో ఆనందంగా వుంది. దీనికోసం ఇద్దరు పిఠాపురం రాజుల విగ్రహాలు బోలెడు డబ్బు ఖర్చు పెట్టి తయారు చేయించి నట్టున్నారు. బాగుంది. ఐతే ఈ సందడిలో నాయుడుగారి సంగతి మరచిపోయినట్టున్నారు. పి.ఆర్.కాలేజిని ఒక గొప్ప సంస్కృతీ తీర్థంగా సృష్టించినా వారెవ్వరు? పిఠాపురం రాజులా? లేదా, ‘తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు?, అని ఒక కవి అన్నట్లు రాళ్లెత్తిన కూలీలా? వీళ్లిద్దరూ కాదు. తాజ్ మహల్ నిజమైన నిర్మాత దాన్ని ఊహించిన శిల్పి. అలాగే, పి.ఆర్.కాలేజి నిజమైన నిర్మాత బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు. అందుకే, ‘నాయుడుగారి కాలేజి’ అన్నాను. (25-2-1984).

కవిత

అక్షరానిదే అంతిమ విజయం

సముద్రంలో సూర్యుడు తలదాచుకొన్నాడు
భానోదయం లేక మంచుతెరలో మనుష్యులు
అలలు వెలుగు తుంపులను మోసుకొస్తున్నాయి
ఇసుక తిన్నెలు తడారలేదు
అన్నీ అడుగులను ముద్రించుకొంటున్నాయి
అడుగులు మానసిక ఉద్రేకాలను
ఇసుకపొరల్లో దాచుకుంటున్నాయి కదా!
అవును! నిన్నటి మాటలన్నీ
ఈ రోజు ఊద్చేస్తున్నారెందుకు?
ఆ మాటల్లో పస లేదా!
అవి అసత్యాలా!
అవును! కొండ చరియల్లో
దాగున్న మాట కోసం
పరిశోధకులు వెతుకుతూనే ఉన్నారు
వారు వేమనా, కబీరా కాదు
మాటల్లో జీవం వుండాలి
ఆ బీట్ సాంగ్ మాటను చంపేస్తుంది
ప్రతిపాట అ వచ్చినట్టే వచ్చిపోతుంది
అందులో అక్షరాలు ఏమీలేవు
ధ్వని నుండి అక్షరం ఏర్పడింది
అక్షరం మళ్ళీ ధ్వనిగా మారుతోంది
అందుకే, మనుషులు
మాట్లాడుకోవడం మానేశారు
దృశ్యమే వారికిపుడు ప్రేరణ
ఎడగారు పిల్లలకు అంకెలూ రావడం లేదు
అంకెలు రాని పిల్లల్ని అక్షరాలు రాని పిల్లల్ని
తయారు చేసుకొంటున్నారు
మీ అబ్బాయిల్లా - పుట్టేటప్పటికి
ధన కనక వస్తు వాహనాలు వారికి లేవు
వారికి చదువే ఆధారం
నాగులేరు, గుళ్ళకమ్మను కూడా కల్మషం చేశారు
అవును! మనిషి బండబారాక చలనమేముంది
లోయల్లో చూడగలగడమే దీర్ఘ దృష్టి
ఎడారుల్లో మొక్కల్ని చిగురింప చేయాలి
ఎడారిలో వెన్నెల దృశ్యాలు
కనువిందు చేస్తున్నాయి
మనల్ని మనం నిర్మించుకోవడం ఈనాటి ధర్మం
దృశ్యాలన్నీ మటుమాయం అవుతున్నాయి
అక్షరానిదే అంతిమ విజయం

డా॥కత్తి పద్మారావు
9849741695

- గజానన్ తామన్
9440211285

నిగమశర్మకు అక్క వ్రాసిన లేఖావళి-3

ప్రియమైన తమ్ముడు నిగమశర్మకు... దీవెనలు -

నీవు నా జాబుకోసం వేయి కన్నులతో వేచియుంటావని తెలుసు. పనులన్నింటిని పక్కనబెట్టి, సుదీర్ఘమైన మరో లేఖను నీకు వ్రాస్తున్నాను. నీ చదువు సంధ్యలు చక్కగా సాగిపోతున్నవనే నా నమ్మకం. ఆరోగ్యం విషయంలోనూ తగు నియమాలు పాటిస్తున్నావనే తలుస్తాను. నీ యోగ క్షేమాల గురించి మీ బావగారు తరచూ ఫోను చేస్తూనే వుంటారు. నీవు ఆయనకి ఆరవ ప్రాణం కదా!

ఇక ముఖ్య విషయాలకు వద్దాము. నీవు సైన్స్ మాథ్స్‌లకు సంబంధించిన పాఠ్యపుస్తకాలే కాదు; తెలుగు సాహిత్యాధ్యయనం ఎప్పటివలె కొనసాగిస్తున్నావు కదూ!

నేను బి.ఎ.చదివే రోజుల్లో, నాకు సర్ రిచర్డ్ లివింగ్‌స్టన్ అనే విద్యావేత్త వ్రాసిన పుస్తకం'some task for education' ఉప వాచకంగా ఉండేది. ఈనాటికీ దానిని దాచి పెట్టుకొన్నాను. ఆ పుస్తకం ద్వారా ఆయన చెప్పదలచేదేమిటంటే - 'విజ్ఞానం అధ్యయన క్షేత్రంగా ఎంచుకొన్న విద్యార్థులు కేవలం దానికే పరిమితం కారాదు. మానవ శాస్త్ర (Humanities) పరిజ్ఞానంతో ముఖ్యంగా సాహిత్యంతో పర్యాప్త పరిచయం కలిగిన వారై ఉండాలి. వ్యక్తి వికాసానికి ఆ పరిచయం ఎంతో దోహదపడుతుంది. ఇది విస్మృతమైన పక్షంలో, మానవులు యంత్ర మానవులుగా అంటే రోబోట్స్ (robots) గా పరిణమిస్తారే తప్ప మానవతావాద లేక జీవనవాద దృక్పథం కలవారుగా ఎదుగరు. ఏండ్లలో ఎదుగుదలతో పాటు విలువల్లో ఎదుగుదల విద్యార్థులు సాధించే దిశలో మన విద్యా విధానం ఉండాలని మరీమరీ ప్రతిపాదిస్తారు. 'మానవులమైన మనం పక్షిలా నింగిలో ఎగుర నేర్చాము; చేపలా నీలి జలాల్లో ఈత చేర్చాము; ఈ మన నేలపై మనుష్యులుగా మనుగడ సాగించడం నేర్వలేదు'. ఇది సర్వేపల్లివారి ఉద్ధరణగా ఎక్కడో చదివినట్లు గుర్తు.

సర్ రిచర్డ్‌గాక మరో మహనీయుణ్ణి ఈవేళ స్మరించు కొందాము. ఆయన పదహారు అణాల ఆంధ్రులు - మనం గర్వించ దగ్గ గొప్ప విజ్ఞాన వేత్త - ఎల్లాప్రగడ సుబ్బారావుగారు (1895 - 1948). ఎవరూ సాహసించని రోజుల్లో అమెరికాలో అడుగెట్టి, వివిధ విజ్ఞాన శాలలలో ఎనలేని విజయాల్ని సాధించారు. న్యూటన్‌కు సాటిరాగల ఆయనకు నోబెల్ బహుమతి దక్కలేదు.

వేద ఋషుల సూక్తుల్ని తలపించే ఓ సూక్తి ఆయన సమాధిపై చెక్కి యుండి మనకు దర్శనమిస్తుంది.

'Science prolongs life; religion deepens it.' - దీనినే తెలుగులో చెప్పాలంటే: 'విజ్ఞానం జీవనానికి దీర్ఘత్వాన్ని ప్రసాదించేది అయితే ధర్మం గహనత్వాన్ని అనుగ్రహిస్తుంది'. ఎల్లాప్రగడవారు చెప్పింది 'ధర్మానికి గల ప్రయోజనాన్ని - సాహిత్యానికి గల సంబంధాన్ని గురించి కాదు గదా!' ఇలా నిత్యశంకితులు ప్రశ్నించే ఆస్కారం లేకపోలేదు. అయితే వారి శంకను పటాపంచలు చేస్తూ ధార్మిక సంక్షోభ గ్రస్త విక్టోరియా మహారాణి యుగానికి చెందిన మాథ్యు ఆర్నల్డ్‌ని ఉత్తర పక్షిగా చూపవచ్చు. 'సమీప భవిష్యత్తులో సాహిత్యమే ధర్మానికి పర్యాయమౌతుందని' ఆయన గారు ఉద్ఘోషించారు.

సాహిత్యం మాట ఎత్తగానే, ఉన్నపళంగా ఉలికిపడి, ఏ యుగానికి చెందిన సాహిత్యమని నిలదీసే సర్వజ్ఞులు ఈనాడు తెలుగు నాట లెక్కకు మించి యున్నారు. గతంలోని సాహిత్యం ప్రతీపవాద సాహిత్యమనో, మనువాద సాహిత్యమనో గుక్కతిప్పకుండా సుదీర్ఘోప న్యాసాలు ఇస్తారు - లేదా ఆ సాహిత్యం ప్రభువుల మానసాలను రంజింప జేసి మడి మాన్యాలు రాబట్టే కోవకు చెందినదని నిర్ధారిస్తారు. అకించనులను ఉపేక్షించి, అగ్రవర్ణీయ నాయకా కేంద్రితమని సన్నాయి నొక్కులు నొక్కుతారు. వారొసగే దాఖలాలు ఏమిటంటే మను చరిత్ర కావ్యనాయకుడు భూసుర కులోద్భవుడైన ప్రవరాఖ్యుడు. వసుచరిత్ర కావ్య నాయకుడు క్షాత్రకులావతంసుడు. - వారు చూపే దృష్టాంతాలు ఇంతటితో ముగియవు.

ఈ తీరున సిద్ధాంతీకరించే బుద్ధిజీవులు ఓ క్షణం పాటు అంతర్ముఖులై నా ఈ విన్నపానికి చెవి యొగ్గవలె.

'ఏ దేశ సాహిత్యమైనా ఒక అవిచ్ఛిన్న క్రమం 'An unbroken continuum'. క్రాంత దర్శులైన అంటే ముందు చూపు గల వ్యక్తుల వల్ల అది నిర్మితమవుతుంది. అవి ప్రతిపాదించే జీవన మూల్యాలు త్రికాలాబాధితాలు. మరో విషయమేమిటంటే శాస్త్రానికి విభిన్నమైన జ్ఞాపమిక మాధ్యమం కలది. శాస్త్రంవలె ఏ విషయమైనను ఇదమిత్థమని ప్రతిపాదించదు. మానవ జీవనానుభూతులను ఉపమానాదులు లేక ప్రతిమల ద్వారా పఠితకు చేరవేస్తుంది. సాహిత్యంలో సాక్షాత్కరించే వ్యక్తులు కేవలం పాత్రలే! మనుష్యులు కారు.

సాహిత్యం ఏ కాలానికి చెందినదైనా కాలబాహ్యమైనది కాదు. డా॥సి.నారాయణరెడ్డి గారు నుడివినట్టు 'కవిత్వము భానుని వలె ఎంత సనాతనమో, అంత నూతనము'. వర్తమాన సాహిత్యం ప్రాచీన సాహిత్యాన్ని తెరమరుగు కావింపదు. అలాగే ఈనాటి వచన కవిత ఛందోబద్ధమైన కవితను మటుమాయం చేయదు. - పద్యకవిత పండిత వర్గ పరిమితమని, వచన కవిత ప్రజాస్వామ్య యుగావిర్భావ మని చేసే సూత్రీకరణ ఏ పరీక్షకు నిలువదు. తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగంలోని పద్యాలు రాయలసీమలోని పసుల కాపర్లు పాడుకున్న రోజులు ఎప్పటివో కావు!

'నా ఈ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో పద్యాల నడుము విరుగదంతాను' ఇది 'ఫిడేల్ రాగాల డజన్ కవి పఠాభి' ప్రగల్భోక్తి. నేను ఆశువుగా చెప్పదలచే కందానికి చివరి పాదం ఇలా ఉంటుంది. 'పద్యాలెటువిరిగె తిక్క! బడితయ విరిగెన్' పద్య రచన నాటి నుండి నేటి దాకా హుందాగా

వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది. వాడని భాష వాడిపోతుంది

నడక సాగిస్తున్నది. అటు ఆంధ్రలో తుమ్మపూడి కోటేశ్వరరావు, కట్టా నర్సింహులు, వైద్యం వేంకటేశ్వరరావు గారలు, ఇటు తెలంగాణలో లక్ష్మణ మూర్తి, సంపత్కుమార, సుప్రసన్న మరియు అనుమాండ్ల భూమయ్యగారలు పద్య కవులుగా ప్రథిత యశస్కులు.

చిన్నయసూరి వ్యాకరణాన్ని పఠాభి సూచన మేరకు దండించే బదులు సరళీకరించి శాస్త్ర విజ్ఞాన భాషగా చేసియుంటే ఈనాటి రెండు తెలుగు రాష్ట్రాలు భాషా పరంగా నైనా ఐక్యంగా ఉండగలిగేవి. రెండున్నర జిల్లాల వ్యావహారికాన్ని తెలంగాణపై రుద్ద వలదని నాడు జువ్వాడి గౌతమరావుగారు ఒనరించిన విన్నపం అరణ్యరోదనమైనది.

'కొత్తపాతల మేలు కలయికే' సంప్రదాయం. దానికి తిలోద కాలనొసంగే జాతి భవితను కోల్పోతుంది. తెలుగు వారికి గర్వకారణ మైన ఆ సంప్రదాయం నేడు కులం పేర, మతం పేర తునాతునకల యింది. కావ్య శ్రేష్టత్వాన్ని నిర్ధారించే నేటి నికషోపలం కులం! వైదిక సాహిత్యంలోని ప్రతిమలను అభివ్యక్తి మాధ్యమంగా తీసికొన్న శ్రీశ్రీ నేటి కుహనా మేధావుల దృష్టిలో ప్రతీపవాది. యావత్ సాహితీ క్షేత్రాన్ని 'నానీ' కవులు వ్యాపించి 'సునామీ'లు సృష్టిస్తున్న ఈ అసుర సంధ్యా సమయాన శ్రీశ్రీగేయం మౌనగీతమై జాలిగా వినిపిస్తున్నది.

'ఏవితల్లీ ఏవితల్లీ?

నిరుడు కురిసిన హిమ సమూహములు?'

ఇంటి పనులూ, పిల్లల ఆలనాపాలన నుండి వీలు చిక్కినప్పు డల్లా సొంత గ్రంథాలయం నుండి 'మహాప్రస్థానం' ను ఎంచుకొని, కొన్ని కవితల్ని ఒకటి తరువాత ఒకటి చదువుతాను. ఆయన, విశ్వనాథ మన తెలుగుజాతికి చెందిన మహాకవులు. శ్రీశ్రీ తెలుగు కవితకు కొత్త మలుపును, తెలుగు కవులకు కొత్త చూపును ఒసంగిన చిరకాల స్మరణీయులు. కాల బాహ్యమైన అన్యాయ రాజకీయ వ్యవస్థను కూకటివేళ్ళతో పెరికివైచి సరికొత్త సమ, సమాజ వ్యవస్థా నిర్మితికై కదలి రండని ఆహ్వానం పలికిన మహనీయుడు. ఆయన స్వప్నించిన మరో ప్రపంచం మన ముందు నేడు ఉందా? రష్యన్ విప్లవం విఫలమవడం నా దృష్టిలో ఒక శోకాంతిక. అయినా 'మరోమారు' అనక తప్పదు.

భావ కవిత్వాన్ని తరువాతి అభ్యుదయ విప్లవ కవులు ఆత్మాశ్రయ కవిత్వమని, ఊహా ప్రేయసి చుట్టు పల్లటీలు కొట్టిందని, నిర్హేతుకంగా బావురుమన్నదని ముద్రవేసి మళ్ళీమళ్ళీ ఈసడించినా, ఆడిపోసుకొన్నా అట్టి చరిత్రను విస్మరించి ఈ వేళ నేను త్రిసంధ్యలు ఆరాధించే భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఊర్వశి, కృష్ణపక్షం ఆయన కావ్యాలు. 'పల్లకీ!' అనే ఆయన తేటగీతి ఏనాటికీ మరుపురానిది. శైలీ సౌకుమార్యం, ప్రసాదమాధుర్యం ఆయన రచనల్లో అంతటా పరచుకొని చదవటానికి పఠితను వివశుణ్ణి చేస్తుంది. "నేను భావకవిని గాను; అహంభావ కవిని" అని నిష్ఠురోక్తులాడిన పఠాభికి భావ కవిత్వానికి గల తాత్త్విక భూమిక అంతుపట్టనిదయ్యింది.

'జగమునిండా స్వేచ్ఛాగాన ఝురులనించు' భావకవికి స్వేచ్ఛా గానమే ప్రాణము. స్వేచ్ఛ అనేక త్యాగాల ఫలితం; దేవతల ఉపాయనం కాదు. త్యాగాల బాట విజయమైనది కారాదు. మళ్ళీమళ్ళీ ఆ బాట గుండానే అమర వీరుల 'కాఫిలా' సాగిపోవాలి' అన్నాడు ఉర్దూకవి కైఫీ ఆజ్మీ. జగత్కారకుడైన ఈశ్వరుడే పరాధీనుడు. సృష్ట్యాదినుండి సైతానుపై ఆయన చేస్తున్న పోరాటం ముగియలేదు. స్వేచ్ఛ లేని నాడు మానవ జాతికి ప్రగతిపథాలు మూసుకొని పోతాయి.

పురుష స్వామిత్వ సంస్కృతిలో స్త్రీ 'చరణదాసి'. అట్టి స్త్రీని ఆరాధ్య కావించింది భావ కవిత్వం, – ఋగ్వేదంలోని అంభృణిని చేసింది.

తెలుగు తల్లిని కర్పూరనిభకీర్తి విభూషితను చేసిన తెలంగాణ కవిత్రయం దాశరథి కృష్ణమాచార్య, కాళోజీ మరియు డా॥సి.నారాయణ రెడ్డిగారలు. వీరి తర్వాత పేర్కొనదగిన వారు వానమామలై వరదా చార్యులు. అభినవ పోతన బిరుదాంకితులు. ఆంగ్లంలో జూన్ మాసి ఫీల్డ్‌లా తెలంగాణ గ్రామీణ సౌందర్యాన్ని శబ్ద చిత్రాలుగా మలచిన దిట్ట.

గదిలోని ఓ మూల కూర్చొని దాశరథి దేశభక్తి గీతాలను ఆలపించలేదు. హైదరాబాద్ సంస్థాన విమోచనకై ప్రాణాన్ని పణంగా పెట్టిన యోధ. నిజామాబాద్ జైలు గోడలపై ఆయన బొగ్గుతో రాసిన తేటగీతి చిరస్థాయిగా నిలిచిపోయింది.

"తీగెలను త్రెంపి అగ్నిలో దింపినావు

నా తెలంగాణ కోటి రత్నాల వీణ".

ఉర్దూకవుల సాహిత్యం వలె, దాశరథి సాహిత్యం అంగార శృంగారాల హృదయంగమ సంగమం. నాకు శృంగారం అంతగా నచ్చక పోయినా, అందులోని అంగారానికి ఆకర్షితనయ్యాను.

'గపానిటవులన్ పడగొట్టి మంచి మాగాణములను సృజించిన తెలంగాణము రైతుదే'

ఈయన 'రుద్రవీణ',–'అగ్ని ధారలు' చదువాల్సిన కావ్యాలు. గాలిబ్ గీతాలతో తెలుగు సాహిత్యంలోకి 'గజల్' అనే ప్రక్రియను ప్రవేశపెట్టాడు.

ఇక ద్వితీయుడు అద్వితీయునిగా చెప్పుకోదగిన 'నా గొడవ' కవి కాళోజీ. పేరును బట్టి ఆత్మాశ్రయ కావ్యమనిపించినా సమస్త మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన కావ్య వస్తువు 'నీ పేర టోపీలు పెట్టామని' 'గాంధీజీ' కవితలో అన్ని సైజుల నాయకులకు చురక లంటించాడు.

విశ్వనాథ తరువాత జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి.నారాయణ రెడ్డి. 'కర్పూర వసంతరాయల' కవిగా తెలుగు సాహితీ జగత్తుకు సుపరి చితులు. నలునికి 'అక్షహృదయం' వలె నారాయణరెడ్డికి మాత్రా ఛందస్సు హృదయం సంపూర్ణంగా అవగతం. ఈయన గేయం 'ఈ నల్లని రాలలో' లోయేట్స్ కవిత 'సేలింగ్ టు బై జాంటియమ్' ఛాయలు న్నాయి. ఈయన సిద్ధాంత గ్రంథం తెలుగు ఆధునిక సాహిత్యానికి ప్రవేశ ద్వారం.

ఈ కవిత్రయం తరువాత పేర్కొనదగిన కవి 'అభినవ పోతన' బిరుదాంకితులు వానమామలై వరదాచార్య. ఖండ కావ్య యుగంలో మహాకావ్యాన్ని అందించిన ఘనులు. దీనికి ముందు తెలుగు భారతిని ఆయన కైసేసిన కావ్యం 'మణిమాల'. ఆంగ్లకవి వర్డ్స్‌వర్త్‌లా. సామా న్యులను, సామాన్య వస్తువులను అసామాన్యం చేశారు. కాడికి కచ్చరానికి కట్టిన ఎద్దులను బరువులాగలేని సమయంలో రక్తం కారేలా తెగ

పాఠశాల విద్యలో ప్రథమ భాషే ఇంటర్మీడియట్‌లోనూ కొనసాగాలి

పొడిచే రైతు 'ముల్లుకర్ర' కు కన్నులు లేవని వాపోయారు. భవభూతిలా కావ్యాన్ని కరుణరసప్లావితం చేశారు. అర్థాలంకారమైన 'ఉత్ప్రేక్ష', శబ్దాలంకారమైన 'యమకం' ఈయన కృతులకు ప్రాణాధారం. పెద్దనలా గండపెండియరం కాలికి తొడిగించుకున్న కవిశ్రేష్ఠులు.

ఇంటింట గ్రంథాలయం మాటేమోగాని మా మటుకు మా ఇంట వేయి పుస్తకాల చిన్న గ్రంథాలయం ఉంది. అవివాహితగా ఉన్న రోజుల్లో ఖరీదైన చీరలు ఒల్లని నాకు నాన్న ఉపాయనంగా ఇచ్చినవి కొన్ని. నా అభిరుచి మేరకు శ్రీవారు ఇచ్చినవి మరికొన్ని. బలీయమైన కాంక్షవల్ల నేను కొన్నవి మిగతావి. 'తులసి కోట'కు చోటు కల్పించే తెలుగు ఆడపడుచులు పుస్తకాలకు తమ ఇంట చోటు కల్పిస్తారని నా ఆకాంక్ష.

తమ్ముడూ! నీవు ఛాత్రుడవు. నేను గేహినిని. క్షణభంగురమైన జీవితంలో యావత్ సాహిత్యాన్ని ఔపోసన పట్టడం ఏరికేని అసాధ్యం! ఈ విషయంలో లార్డ్ బేకన్ చెప్పినట్లు నడుచుకోవాలి. 'Arts longa; Vita brevis' ఇది లాటిన్‌లోని ఉక్తి, కళ దీర్ఘమైనదైతే మానవ జీవనం క్షణభంగురమనట్టిది.

ఆంగ్లమాధ్యమం ధృతరాష్ట్రుని బిగి కౌగిలి. ఈ అంధునికి జనకత్వం వహించింది కార్పొరేటు విద్యారంగం. ఇందులో చిక్కుకొని మన తెలుగునకు గల గొప్ప సాహిత్యాన్ని 'ఈనగాచి నక్కల పాలు' చేయటమా! వీరి విద్యాసంస్థల్లో చదివేవారు ఒత్తిడిని తట్టుకొని కుబేరులుగా ఎదిగి సర్వం ధారపోసిన తలిదండ్రులను వృద్ధాశ్రమాలకు చేర్చే సుపుత్రులౌతారు. తట్టుకొననివారు అపార్ట్‌మెంటు గవాక్షాల నుండి కిందకిదూకి అసువులను గాలిలో విలీనం చేస్తారు. ఇందుకు భిన్నంగా, గురుకులాల్లో చదువుకొనే పేదపిల్లలు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహిస్తారు!

ఎల్లాప్రెగడవంటి మేధావులు తెలుగు నేలల్లో జన్మించాలంటే మాతృభాషనే బోధనా మాధ్యమం అన్ని స్తరాల్లో చేయాలి. సాహిత్యాన్ని అభ్యసించేలా పరిస్థితులు కల్పించాలి.

సాహిత్యం వినా భాష జీవించలేదు.


"ఊరక వైభవ మూడిపడునొక్కో
మహేశ్వరినట్లు మాతృభా
షారమణినిన్ భజించుటకు సంబరమందని
చచ్చు జాతికిన్"

భౌగోళికంగా రెండుగా చీలినా ఈనాడు వెలుగు కల జాతియే తెలుగుజాతి.

మరో జాబులో మన బాతాఖానీ.

ఇట్లు

నీ అక్క, నిర్మల



ప్రజల భాషలో పరిపాలించలేని ప్రభుత్వాలు మనకు సిగ్గుచేటు

దాహార్తి

సింహ ప్రసాద్
9849061668

'ఇక్కడ తెలుగు పద్యాలు ఉచితంగా నేర్పబడును' అని రాసివున్న చిన్న పలకను మా గృహ సముదాయపు గేటుకి తగిలించాను.

ప్రతి ఆదివారం, పాఠశాల సెలవు దినాల్లోనూ ఆ పలకను వేలాడదీస్తుంటాను. తరచూగాకపోయినా, అప్పుడప్పుడూ కొందరు పిల్లలు, పెద్దవారు వస్తుంటారు. వారివారి భాషాజ్ఞానాన్నిబట్టి వేమన, సుమతీ శతకాలనుంచో, పోతన, కరుణశ్రీలవో పద్యాలు నేర్పుతాను. కేవలం కంఠస్తం చేయించడం కాదు, అర్థతాత్పర్యాలూ వివరిస్తాను.

ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసి ఆరేళ్ళయ్యింది. అదిగో అప్పట్నుంచీ ఈ మహా నగరపు కీకారణ్యంలో స్థిరపడిపోయాను.

'హాయిగా పల్లెపట్టున పైరగాలి పీలుస్తూ ప్రకృతి ఒడిలో సేదదీరతాంరా' – అంటే మా అబ్బాయి ఒప్పుకోలేదు. అక్కడ వైద్య సౌకర్యం ఉండదన్చెప్పి ఇక్కడ మా కోసం అపార్టుమెంటు కొన్నాడు. అది కూడా నేల అంతస్తులోది.

ఎంచేతంటే మా ఆవిడ మోకాళ్ళ నొప్పులతో బాధపడుతోంది. మెట్లెక్కలేదు, దిగలేదు, నడవలేదు. అమెరికాలో ఉంటున్న మా అబ్బాయి ఇంకో ఆరు నెలల్లో వస్తాడు. అప్పుడు తల్లికి శస్త్రచికిత్స చేయిస్తానన్నాడు.

మా ఇంటావిడ పరిస్థితిలానే ఉంది తెలుగు భాష పరిస్థితీనూ. నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్నట్టు అయిపోతోంది. తెలుగు మాట్లాడేవాళ్ళు తగ్గిపోతున్నారు. తెలుగులో చదివే వారిని కాగడా పట్టుకుని వెదకాల్సొస్తోంది. అందుకనే ఉడతాభక్తిగా తెలుగు పద్యాలు నేర్పే కార్యక్రమం పెట్టుకున్నాను.

అవడానికి మాది జనసమ్మర్థం అధికంగా ఉండే ప్రాంతమే అయినా మాటామంతీ చెప్పుకోడానికి మనుషులే దొరకరు. అందరివీ ఉరుకులూ పరుగులే. అందరి కాళ్ళకూ చక్రాలే!

ఎవరైనా ఆసక్తితో వస్తే, తెలుగును

సానుభూతిగా చూశాను. వీడు రంగు రంగుల మాయలో పడి కొట్టుకుపోతున్నాడు. ఆ మాయ పొరల్ని చీల్చి పారెయ్యాల్సిన ప్రభుత్వాలు ఆ పని చేయవు. ఎంతసేపూ కార్పొరేట్ విద్యకి వంత పాడుతూ, వారికి ఇబ్బడి ముబ్బడిగా లాభాలు ఆర్జించి పెడుతూ తరిస్తాయి. భాష ఏమైపోతుందో, రేపటి తరం ఏమవుతుందోనన్న భయం వారికి లేదు! మూఢజనం ఎన్నడు కళ్ళు తెరుస్తారో!



ఇష్టంగా మరింత ఇష్టం కలిగేలా బోధిస్తాను. సాయంత్రంవేళ గుడికెళ్ళి కూర్చుని నాబోటి వయోవృద్ధులతో కాలక్షేపం చేస్తుంటాను.

నేను పది మాటలు మాట్లాడితే అందులో ఎనిమిది తెలుగు గురించే ఉంటాయి. బంధుమిత్రుల ఇళ్ళకి వెళ్తే పిల్లల్ని తెలుగు పాటలూ పద్యాలూ పాడమంటూ ప్రోత్సహిస్తాను. అంచేత నన్నంతా తెలుగు పండితుడిగానే భావిస్తారు. మరెవరూ తెలుగు కోసం తాపత్రయ

పడరని వారి భావమేమో తెలీదు.

ఇంట్లోకెళ్ళి అలా వాలు కుర్చీలో నడుం వాల్చానో లేదో ఒకావిడ ఒక చిన్న కుర్రాడితో వచ్చింది.

"ఇక్కడెవరో మాస్టారు ఉన్నారట..."

"నేనే. రండి...కూర్చోండి..."

నా వంక ఎగాదిగా చూసి లోపలికొచ్చి కూర్చుంది. ఆమెకి ముప్పై ఏళ్ళు ఉంటాయి. బాగా చదువుకున్నదానిలానే ఉంది. ఆడంబ రంగా ఉంది.

కుర్రాడికి మూడేళ్ళుంటాయేమో. బొద్దుగా ముచ్చటగా ఉన్నాడు. లేచి వెళ్ళి డబ్బా లోంచి నాలుగు బిస్కత్తులు తీసుకొచ్చాను. "రారా...తిను...నీ పేరేంటి?"

"చకిత్" సిగ్గుపడుతూ చెప్పాడు. అదేం పేరో మరి!

వాడు బిస్కత్తుల కోసం రాబోతోంటే, "నో. బ్యాడ్ మ్యానర్స్" అంది. ఆగిపోయాడు. కాని ఆశగా చూస్తున్నాడు. దగ్గరికెళ్ళి అందిచ్చాను. గబుక్కున తీసుకుని నోట్లో కుక్కుకున్నాడు.

వాడి వంక కోపంగా చూసి, నా వంక ముఖం చిట్లించి చూసింది.

"ఇలాంటివి ఎంకరేజ్ చెయ్యకూడదు. బై ద వే...వీడు మా సన్. టూ ఇయర్స్ సెవెన్ మంత్స్ ఓల్డ్. ఇంటర్నేషనల్ స్కూల్లో అడ్మిట్ చేద్దామని ఎంక్వైర్ చేశాం అంకుల్. నేమ్, పేరెంట్స్ నేమ్స్, కొన్ని రైమ్సూ వస్తేగాని అడ్మిషన్ ఇవ్వరట. మీరు టూ ఆర్ త్రీ రైమ్స్ నేర్పాలి..."

"క్షమించాలి. నేను ఆంగ్లం బోధించను"

"ఏం? మీకు రాదా?" ఆమె మాటల్లో కించిత్తు వ్యంగ్యం చోటు చేసుకుంది.

చిన్నగా నవ్వాను. "డబుల్ ఎమ్మే. హైస్కూల్ రిటైర్డ్ హెడ్మాస్టర్ని..."

ఆమె ముఖం కొంచెంగా ఎర్రబడింది. "మీ ఫీజు ఎంతైనా ఫరవాలేదు, పే చేస్తాను. మా వారు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!"

"అది గ్రహించాను, కాని అక్షరాన్ని అమ్ముకునేవాణ్ణి కాదు. చిట్టీ చిలకమ్మా, చందమామ రావె – లాంటి చక్కని పిల్లల పాటలెన్నో ఉన్నాయి. తేలికగా అర్థం చేసుకుంటారు. సునాయాసంగా నేర్చుకుంటారు. అవి నేర్పమంటే నేర్పుతాను..."

ఆమె అందమైన ముఖం కాస్తా వికృతంగా మారిపోయింది.

"తెలుగెవడిక్కావాలీ! మీకు తెలీదేమో. ఎల్కేజీ నుంచి పీజీ దాకా ప్రతి క్లాసూ ఇంగ్లీషు మీడియంలో చదవకపోతే ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో ఎల్కేజీ క్లాసు కూడా చెప్పనివ్వరు! అదీ వాళ్ళ స్టాండర్డు! దాన్ని అందుకోవాలంటే ఎంత ఇంగ్లీషు రావాలీ!"

మా ఇంటి హాలు గోడకు తెలుగు వర్ణమాల, బొమ్మ పదాల పట్టిక, వివిధ కాయగూరల, పండ్ల, జంతువుల, ఆటల, వృత్తుల చార్టులు వరుసగా వేలాడదీసి ఉన్నాయి. వాటి వంక ఎంతో కుతూహలంగా చూస్తున్నాడు కుర్రాడు.

అమాంతం వాడి రెక్క పట్టుకుని ఈడ్చుకుపోయిందామె.

'ఏవిటో ఈ ఆంగ్ల మోజు!' నిట్టూర్చాను.

రాగి జావ తెచ్చిచ్చింది ఇల్లాలు నాంచారి.

మా సంభాషణ విన్నట్టుంది. "మీ పిచ్చిగానీ, ఈ రోజుల్లో మీ తెలుగూ మీ పద్యాలూ ఎవరిక్కావాలండీ!"

"అమ్మనీ అమ్మ భాషనీ తీసిపారేస్తే, మనిషికీ జాతికీ పుట్టగతులుండవే పిచ్చిదానా. బిడ్డనోట పలికే మొదటిమాట అమ్మ. నీకు తెలీదూ!"

"తెలుగు ఉద్ధరించాలని కంకణం కట్టుకున్న వారి భార్యని, నాకు తెలీకపోవడం ఏవిటీ!" ముసిముసిగా నవ్వి ఏదో అనబోయింది గాని ఈ లోగా సెల్ మోగింది.

అవతలి ప్రక్క మా అబ్బాయి.

"నాన్నగారూ, మీ మనవడికి గాయత్రీ మంత్రం వచ్చేసింది..." సంబరంగా చెప్పాడు సూర్యం.

"ఏవిటీ, మూడేళ్ళ బుడతడికి..."

"మీరే వినండి..."

'తినగ తినగ వేము, ఉప్పు కప్పురంబు, బలవంతమైన సర్పము...శుక్లాంబరధరం...ఓం భూర్భువస్వః...గణగణా చెప్పేశాడు. వాడిని ఒకటి చెప్పమంటే చాలు వాడికొచ్చినవన్నీ వరుసగా చెప్పిగాని ఆగడు.

"ఓరి ఓరి. ఎంత చక్కగా చెప్పేవురా విశ్వక్. నాకు చాలా చాలా ఆనందంగా ఉంది రా. నీకు మా శుభాకాంక్షలూ ఆశీస్సులూనూ... విన్నావుటే. నా మనవడిలో ప్రవహిస్తున్నది ఎవరి రక్తం అనుకున్నావ్? నాదేనే!" నాంచారి వంక గర్వంగా చూసి కళ్ళెగరేశాను.

మూతి తిప్పి గలగలా నవ్వేసింది.

"నాకు చాలా సంతోషంగా ఉందిరా సూర్యం. దేశంకాని దేశంలో ఉంటున్నా, మన భాషనీ మన సంస్కృతినీ చక్కగా నూరి పోస్తున్నారు..."

"ఇక్కడి గెట్ టుగెదర్లలో బర్త్‌డే పార్టీల్లో పిల్లలు తెలుగు పాటలు పాడతారు. సంస్కృత శ్లోకాలు తప్పుల్లేకుండా వల్లెవేస్తారు. కూచిపూడి డ్యాన్సూ చేస్తారు. వాటిని నేర్పేవాళ్ళు ప్రతీ కమ్యూనిటీలోనూ ఉంటున్నారు నాన్నగారూ"

"గుండెలు పట్టనంత ఆనందంగా ఉందిరా. ఇక్కడి వాళ్ళేమో ఆంగ్లమే కల్పతెరువూ కామధేనువూ అని పరుగు పెడుతున్నారు. అమెరికాలో నివసిస్తున్న మీరు మన భాషా సంస్కృతుల విలువ, ఆవశ్యకత గుర్తించి గౌరవిస్తున్నారు. పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదన్నట్టు కొందరికి దగ్గరున్న వాటి విలువ తెలీదురా. ఏమైతేనేం, ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడుదాం మా తల్లిభాషని – అంటున్న మీ అందరికీ శిరస్సు వంచి అభివందనాలు తెలియజేస్తున్నాన్రా"

"అయ్యో, అవేం మాటలండీ. వాడు మీ కొడుకు" లబలబలాడింది.

"వాడే కాదు, వాడిలాంటి వాళ్ళంతా శిరోధార్యులే. ఎంత శ్రద్ధా భక్తుల్తో తెలుగు నేర్పుతున్నాడో చూడు"

"అదేమీ మీ గొప్ప కాదు. వాడు నా కడుపున పుట్టాడండీ. చందమామ రావే – అని పాడుతూ గోరుముద్దలు తినిపించింది నేను. జో అచ్యుతానంద జోజో ముకుందా అని జోల పాడింది నేను!" గర్వంగా చెప్పింది నాంచారి.

"అవునవును. ఉగ్గుతోబాటే, ఉంగా ఉంగాతోబాటే తెలుగు తేనెనీ రుచి చూపించావు. అమ్మవంటే నువ్వేనే నాంచారీ. ఇందాక వచ్చి నావిడ ఏమందో విన్నావుగా. పరాయిభాషే కావాలంట. రేపు ఆ పిల్లలు పరాయి అయిపోతే, కన్నవాళ్ళని నిర్లక్ష్యం చేశాడని గుండెలు బాదుకునేది ఇలాంటి వాళ్ళే! అ అంటే అనురాగం

భాష నశిస్తే జాతి నశిస్తుంది.

అని నేర్పకపోతే మనిషి డబ్బు మనిషి అవుతాడు!"

"బాగా చెప్పేరు. అన్నట్టు ఇందాక వాచ్ మ్యాన్ వీరయ్య మీ గురించడిగాడు. కన్పించాడా? వాడి కొడుకుని బడిలో వేస్తాట్ట. మీరు రోజూ పోరుతున్నారని కూడా చెప్పేడు..."

"సంతోషం..." మాటల్లోనే వచ్చాడు వీరయ్య.

"మా పిల్లగాణ్ణి బడిలో ఏత్తానండి. తవఁరోపాలి రావాలి..." చేతులు కట్టుకుని వినయంగా అన్నాడు.

"నిరభ్యంతరంగా వస్తానుగానీ, మీవాడికింకా అక్షరాభ్యాసం చేయించలేదు కదా? సాయంత్రం సరస్వతీ ఆలయ పూజారిని కనుక్కుని, మంచిరోజు చెబుతాను. అది చేయించాక బడిలో వేద్దాం..."

"అది ఇంగ్లీషులో సెయ్యరంట కదండి. అలాంటివి అక్కర్లేదంట. ఆరే సెప్పేరు. ఇది చాలా పెద్ద బడి లెండి" చేతులు చాపి మరీ చూపించాడు.

మొండిగా మాట్లాడుతున్న వాడివంక చిత్రంగా చూశాను.

"సరస్వతీదేవి విద్యకి అధిదేవత. ఆవిడ కరుణా కటాక్షం లేకపోతే ఏ విద్యా అబ్బదు. రాణించదు" కొంచెం కటువుగానే అన్నాను.

"అయన్నీ మాకేం తెలుత్తాయండి!... తవరోపాలి వచ్చి పున్నెం కట్టుకోండి. మా బుడ్డోడు గొప్పోడవ్వాలి!" వీరయ్య కళ్ళు తళుక్కున మెరిశాయి.

వాడి ధోరణి అర్థమైంది. వినేలా లేదు. తను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళనే రకం!

"సరే పద..." ఉత్తరీయం భుజాన వేసుకుని వాడి వెంట నడుస్తూ, "ఇవాళ ఆదివారం కదా. బడి ఉండదేమో?" అన్నాను.

"ఉందండి. పిల్లల్ని సేర్చుకుంటున్నారు"

వాడు ఎడమవైపుకి తిరిగాడు. "అటు కాదు ఇటు. సరస్వతీ విద్యామందిరం కుడి పక్కన ఉందిరా. ఇలారా..."

"అబ్బే అదొద్దండి. అక్కడ తెలుగులో సెబుతారు..."

'నీకూ ఆంగ్ల జబ్బు చేసిందన్నమాట' అనుకుంటూ వాడి వంకోసారి చూసి, అయిష్టంగానే అటు తిరిగాను.

"మీకో శుభవార్త. మీరటు వెళ్ళగానే అమ్మాయి ఫోన్ చేసింది. వచ్చేవారం శాన్విని తీసుకునొస్తుందిట. పూణెలో తెలుగు మీడియం స్కూళ్ళు లేవుట. అందుకని శాన్విని మన దగ్గరే వదలి వెళ్తుందిట. మనమిక్కడ తెలుగులో చదివించాలట...!"

ఆక్స్‌ఫర్డ్ స్కూల్లోకి దారితీస్తోంటే అన్నాడు "తెలుసున్నోళ్ళు లేపోతే సేర్చుకోవన్నారు. తవఁరి గురించి సెప్పా. తీసుకురమ్మన్నారండి..."

పాఠశాల వారి అభిప్రాయం లీలగా బోధపడింది.

తిన్నగా వెళ్ళి ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడి, బయటికి వచ్చాను.

"సేర్చుకుంటానన్నారాండీ" కళ్ళనిండా ఆశ పేర్చుకుని అడిగాడు.

"నీకూ నీ భార్యకీ ఆంగ్లభాష రాదని చేర్చుకోమంటున్నారు"

"సదూకునేది బుడ్డోడు కదండీ!"

"నిజమే. కాని ఇంట్లో మీరు చదివించలేరు, రాయించలేరు కదా, అందుకని చేర్చుకోరట. తల్లిదండ్రులిద్దరికీ ఆంగ్లం క్షుణ్ణంగా వస్తేనే చేర్చుకుంటామని కరాఖండీగా చెబుతున్నారు మరి..."

బుర్ర గోక్కున్నాడు వీరయ్య. "ఎల్కేజీకే ఇంత గొడవొచ్చి పడిందా దేవుడా!" అని గొణుక్కుని అన్నాడు. "ఇంజినీరో డాక్టరో అవ్వాలంటే ఇంతప్పట్నుంచే ఇంగ్లీసు సదవాల్లెండి. అరు సెప్పిందీ కరట్టే"

"వీళ్ళు అయిదో తరగతి వరకూ ఇంగ్లీషు, హిందీ భాషలే నేర్పుతారట. తెలుగు నేర్పరట. ఇదేం లాభంలేదు గాని సరస్వతీ విద్యామందిరంలో చేరుద్దాం. పాఠశాల రుసుముకీ పుస్తకాలకీ డబ్బు నేనిస్తాలే. పద..."

"అక్కడొద్దండి..."

కంగు తిన్నాను. ఒక్కడుగు వేసిన వాణ్ణే ఆగి ప్రశ్నార్థకంగా చూశాను. "ఇక్కడి రుసుం ఎంతో తెలుసా? నల్లభై వేలు. ఆపైన పుస్తకాలకీ దుస్తులకీ అయిదారు వేలు అవుతాయిట. నువ్వు తూగ్గలవా?"

"పిల్లడి బాగుకోసం ఏవో తిప్పలు పడతావండి. నైట్ వాచ్‌మేన్‌ని మాన్పించి, వాడికిచ్చే దానిలో కొంత తగ్గించి అయినా నాకిత్తే ఆ డ్యూటీ కూడా నేనే సేత్తానని సెక్రటరీగార్నడి గానండి. సూద్దాం అన్నారు. మా ఇంటిది రెండు గాక మూడిళ్ళలో పనిసేత్తాదండి. ఓ సెయ్యి ఎయ్యడానికి మీరూ మీరూ ఉన్నారు కదండి. ఎట్టాగైనా ఇక్కడే సేరుత్తానండి..."

పిచ్చిగా చూశాను. "మాతృభాష గొప్పతనం నీకు తెలీదు వీరయ్యా. మన ఊహ తెలిసినప్పట్నుంచీ విన్న భాష, తెలిసిన భాష, మాట్లాడిన భాష ఉంది చూశావూ అదే మాతృభాష. ఆ భాషలోనే మనం ఆలోచిస్తాం. అందులో మాట్లాడినట్టు, భావ వ్యక్తీకరణ చేసినట్టు పరభాషలో చేయలేం. మాతృభాషలోనే సృజనాత్మకంగా ఆలోచించగుగుతాం. మాతృభాష మీద పట్టు ఉన్నవారు ఏ భాష అయినా, ఎన్ని భాషలైనా అవలీలగా నేర్చుకోగలరు. మన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుగారికి ఏడెనిమిది భాషలు వచ్చు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో గ్రంథాలు రాశారు తెలుసా?"

"ఆ గొడవంతా నాకెందుకులెండిగాని, మావోడూ నాలాగే సాకిరీ సెయ్యకూడదండి. మీ వోళ్ళే కాదు మా బుడ్డోడూ ఇంజినీరవ్వాల. అమెరికా చెక్కెయ్యాల. మీరే గాని మేం పైకి రావొద్దాండీ?"

దెబ్బతిన్నట్టు చూశాను. "నీ బుర్రనెవరో కలుషితం చేశారు వీరయ్యా. నీకో నిజం చెప్పనా? మా అబ్బాయి. పదవ తరగతి వరకూ తెలుగు మాధ్యమంలోనే చదివాడు. తెలుగులోనే ప్రవేశపరీక్ష రాసి చుక్కా రామయ్య శిష్యుడయ్యాడు. ఇంటర్మీడియట్‌లో ఆంగ్ల మాధ్యమానికి మారాడు. మొదట్లో కొంచెం ఇబ్బంది పడ్డా, తర్వాత తేలికగానే దారిలో పడిపోయాడు. ముంబై ఐఐటిలో చదివి ఇప్పుడు అమెరికాలో గొప్ప హోదాలో పనిచేస్తున్నాడు. అయినా వాడి కొడుక్కి తెలుగు పద్యాలు నేర్పుతున్నాడు. అంతే కాదు, మా అమ్మాయి కూడా పది దాకా తెలుగులోనే చదివింది. డాక్టరయ్యింది. అల్లుడికి పూణెలో ఉద్యోగం గనుక అక్కడ క్లినిక్ తెరిచింది. నేనెందుకింతగా చెబుతున్నానో విను..."

"ఏరు దాటినోరు ఎన్ని కబుర్లైనా సెబుతారు. మమ్మల్నిలా నడవనీండి. తవఁరు ఊళ్ళోవాళ్ళకి పజ్యాలూ పాటలూ సెబుతారుగా. రోజుకో అరగంట మా బుడ్డోడికి ఇంగ్లీసు సెబు

తానని ఆరితో సెప్పండి, సేర్చేసుకుంటారు”

“నేను ఆంగ్లం చెప్పను”

“సెప్పేవారిని సూసుకుంటాన్లెండి. కదుపుకి సగం తిని అయినా, ప్రయివేటు సెప్పిస్తానండి. ఏదో సెప్పి ఈ స్కూల్లో సేర్చేయండి...” ప్రాధేయపడ్డాడు.

సానుభూతిగా చూశాను. వీడు రంగు రంగుల మాయలో పడి కొట్టుకుపోతున్నాడు. ఆ మాయ పొరల్ని చీల్చి పారెయ్యాల్సిన ప్రభుత్వాలు ఆ పని చేయవు. ఎంతసేపూ కార్పొరేట్ విద్యకి వంత పాడుతూ, వారికి ఇబ్బడి ముబ్బడిగా లాభాలు ఆర్జించి పెడుతూ తరిస్తాయి. భాష ఏమైపోతుందో, రేపటితరం ఏమవుతుందోనన్న భయం వారికి లేదు! మూఢజనం ఎన్నడు కళ్ళు తెరుస్తారో!

“ఇంకొకర్ని చూసుకో” విసవిసా వచ్చేశాను. ఒళ్ళంతా సీసా పెంకులతో గీరినట్టుగా ఉంది.

ధుమధుమలాడుతూ తిరిగొచ్చిన నన్ను చూసి ఏదో జరిగిందని గ్రహించింది, మౌనంగా మజ్జిగ ఇచ్చింది. తాగి చల్లబడ్డాక అంది నాంచారి...

“మీకో శుభవార్త. మీరటు వెళ్ళగానే అమ్మాయి ఫోన్ చేసింది. వచ్చేవారం శాన్విని తీసుకునొస్తుందిట. పూణెలో తెలుగు మీడియం స్కూళ్ళు లేవుట. అందుకని శాన్విని మన దగ్గరే వదలి వెళ్తుందిట. మనమిక్కడ తెలుగులో చదివించాలట...!”

రోహిణీ కార్తె ఎండకి ఎండిన భూమి గుండెల మీద తొలకరి జల్లు కురిసింది. దాహార్తి తీరుతోంటే భూమి పులకించి మోరలెత్తింది.

గుండెలు ఉప్పొంగిపోతోంటే నేను భవిష్యత్తులోకి ఆశావహంగా చూశాను! అ

కవిత

తోటలోకి అడుగెయ్యాలి

ఎలుగుబంటి మీద
ఎగిరి దుంకిన
గాయాలైతే ఐనైగని
దాన్ని పడుకోబెట్టిన
పెద్దపులితో
కుస్తీబట్టిన
ప్రాణం పోయివచ్చిందిగని
పులి సలాంగొట్టింది
పిట్టల్తో పెద్దరికాన్ని
మరిచిపోయిందీ నిజమే
కాటేసే పాముల నడుమ
పాషాణంలా నిలబడ్డా
గేలిచేసే కోతి మూకల మధ్య
చేతుల్ని జెండాల్ని చేసి
కలెబడ్డా
మలుపు మలుపు దగ్గర
గాయపడ్డా
మజిలీకి మజిలీకి
కవిత్వమై రాయబడ్డా
లోకం ఏ పనిని
ఎలా కొలత తీస్తుందో
ఎంత మోతకు
ఎన్ని యూనిట్లంటారో
పెద్దాఫీసుల
ఇనుప చట్రాలేసుకొని
మకాం పెట్టలేదు
అంతా పునాదుల్లో
రాళ్ళు పేర్చాను
సామాన్యులకు
పూలు పంచాను
కుదుమిస్తే
పండుగ చేసాను
నన్ను నచ్చని
మాన్యులుండవచ్చు
మెచ్చని
సామాన్యులైతే ఉండరు
మీదేసుకోవడమేగాని
తోసెయ్యడం ఎరగనోన్ని
భుజాలకత్తుకోవడమే
గుర్తుంది కాని
కాదెత్తేసే తత్వం లేదు
ఏది అంటానో
అదే చేస్తానని
కొందరికి కంటగింపు
ఏ సెక్టులో కలవనని
ఏ గుంపులో కూడనని
పరిహాసమో
గౌరవమో
ప్రకటిస్తుంటారు
ఇకనైనా
కంచెకు ఇవతల కాలు పడాలె
బెర్రకు ఇటువైపు దుంకెయ్యాలె
కోట నుండి కాస్త
తోటలోకి
అడుగెయ్యాలె

ఏనుగు నరసింహారెడ్డి
8978869183

పెండ్లిపిలుపులు, శుభాకాంక్షలు (గ్రీటింగ్ కార్డులు), గుర్తింపు చీట్లు (విజిటింగ్ కార్డులు), తెలుగులో వేద్దాం. అక్కర ఉంటే ఇంగ్లీషులో కూడా వేద్దాం.

మాటల్ని వాడుతూ ఉంటేనే అలవాటు అవుతాయి. వాడకపోతే మన భాష, మన జాతీ వాడిపోతాయి. ఇది మనకు ఇష్టమవుతుందా?

తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తీసివేస్తే తెలుగు వర్ధిల్లదు

మధురాంతకం నరేంద్ర
98662 43659

మన తెలుగూ - మన తెలుగు ప్రపంచమూ

1975 లో మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు నేను చాలా చిన్నవాణ్ణి. ఆ సభల్ని గుర్తుకు తెచ్చుకున్నప్పుడల్లా గుర్తుకొచ్చే విషయాలు రెండు. విప్లవ రచయితల సంఘం పుట్టడం. రెండవది : 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' పాట రాసిన కవి శంకరంబాడి సుందరాచారికి జరిగిన అమర్యాద. మొదటి దానికి అప్పటి సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక వాతావరణం కారణమైతే రెండవదానికి సుందరాచారిగారి జీవిత విధానం గూడా కారణమయ్యింది.

1981లో, 1990లో మలేసియా, పోర్ట్‌లూయిల్లో జరిగిన రెండవ, మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు గురించి విన్నట్టు కూడా జ్ఞాపకం లేదు. అవి రెండూ విదేశాల్లో జరగడమూ, ఆ సభలకెళ్ళి వచ్చిన వాళ్ళెవరితోనూ నాకు పరిచయం లేక పోవడమూ అందుకు కారణం గావచ్చు. 2012లో జరిగిన సభలకు నేనున్న తిరుపతే వేదికయ్యింది. వూరు వూరంతా తోరణాలూ, ఆహ్వాన సరంభాలూ ముంచెత్తాయి. చివరిదాకా వూరిస్తూ వచ్చిన సభా ప్రాంగణాలు చివరకు మా విశ్వ విద్యాలయానికాచివర్లో వుండే వ్యవసాయ విశ్వవిద్యాలయ భవనాల దగ్గరకు తరలిపోయాయి. మా విశ్వ విద్యాలయంలో మా పని మేము చేసుకుపోతూండగానే అవతల సభలు జరిగాయి. బయటి నుంచీ వచ్చిన సాహితీ మిత్రులు మా యిళ్లల్లోనూ, వాళ్ళ హోటళ్ళలోనూ కలిశారు.

2017 డిసెంబరు నెలలో జరిగిన తెలుగు మహాసభలు అంతకు మునుపు జరిగిన నాలుగు ప్రపంచ తెలుగు సభలకూ భిన్నమైనవి. 2014లో తెలుగు రాష్ట్రం రెండుగా విభజించబడ్డమూ, కొత్తగా యేర్పడిన తెలంగాణా ప్రభుత్వం యీసారి తెలుగు మహాసభల్ని నిర్వహించడమూ అందుకు ముఖ్య కారణం. వొకే భాష వుండే ప్రజలు రెండు రాష్ట్రాల్లో వుండడం తప్పేమీ కాదు. అసలు రాష్ట్ర విభజనకూ, భాషకూ ముడిపెట్టి తప్పు చేసిన తెలుగు వాళ్ళు యిప్పటికి కూడా తమ పొరపాటును గుర్తించలేదు.

దక్షిణాన నాగర్ కొయిలూరు (కన్యాకుమారి శివార్లలో పట్టణం) నుంచీ వుత్తరాన దాదాపుగా నాగ్‌పూరుకు విస్తరించిన తెలుగువారిని వొక పరిమితమైన రాష్ట్ర చట్రంలోకి తీసుకురావడం సాధ్యం కాదు. 1952లో తెలుగువారిదంటూ 'ఆంధ్రప్రదేశ్' అనే రాష్ట్రం యేర్పడినప్పుడు సగం మంది తెలుగు వాళ్ళు రాష్ట్రం బయటే వున్నారని గుర్తించలేక పోయాము. 2014లో రెండు తెలుగు రాష్ట్రాలు యేర్పడినప్పుడు, యీ రెండు రాష్ట్రాలకు బయట సగం మంది (దాదాపు 9 కోట్లమంది) తెలుగు వాళ్ళున్నారనే విషయాన్ని అసలు పట్టించుకోలేకపోయాం. సగం మంది తెలుగు వారు రెండు రాష్ట్రాల వెలుపలే వున్న పరిస్థితుల్లో, కొత్తగా యేర్పడిన తెలంగాణ రాష్ట్రం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలుగా యిటీవలి జరిగిన సభల్ని యిప్పటికైనా తెలుగు వాళ్లందరూ గుర్తించవలసిన సమయం ఇది.

విశాలాంధ్ర రాష్ట్రంలో భాగమై వుండడంతో తమకు సాంఘిక; ఆర్థిక, సాంస్కృతిక అన్యాయాలు జరుగుతున్నాయని దీర్ఘకాల పోరాటం చేసి, చివరకు ప్రత్యేక రాష్ట్రం యేర్పరచుకున్న తెలంగాణా నిర్వహించిన సమావేశాలవి. తెలంగాణా వుద్యమానికి ఆంధ్ర కోస్తా రాయలసీమ, కళింగాంధ్ర ప్రాంతాల నుంచీ చాలా మంది - ముఖ్యంగా రచయితలూ, కవులూ, మిగిలిన సాహిత్యకారులూ - తమ సంఘీభావాన్ని వెలిబుచ్చారు. రెండు రాష్ట్రాలయ్యాక గూడా, యిప్పటికీ, తెలుగువాళ్ళకంతా హైదరాబాదే సాంస్కృతిక రాజధానిగా వుంది. తెలుగు కళాకారులూ, సాహిత్యకారులూ దాదాపుగా సగం మందికి పైనే హైదరాబాదులో స్థిరపడి పోయారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమ హైదరాబాదులో బాగా వేళ్ళూనుకుంది. తెలుగు పత్రికలన్నీ హైదరాబాదునే చేరుకున్నాయి. యీ పరిస్థితి యిలా కొనసాగుతూ వున్నప్పుడే, ప్రపంచ మహాసభల్ని తెలంగాణా నిర్వహించింది.

చాలా రోజుల తర్వాత తమకంటూ వో రాష్ట్రం రావడమూ, తమదైన సాహిత్యాన్నీ, లలితకళల్ని ప్రముఖంగా చూపెట్ట గలిగే అవకాశం రావడమూ - యీ కారణాల వల్ల యీ అయిదవ తెలుగు ప్రపంచ మహాసభల్లో తెలంగాణా సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక వైభవానికే ప్రాముఖ్యత నివ్వడం సహజమే! హైదరాబాదు నగరమంతా ప్రదర్శించిన తోరణాల్లో మిగిలిన ప్రాంతాల స్రష్టలు కొద్దిమందే వుండడం విస్పష్టంగా కనిపించింది. ప్రాంగణాలకూ, తోరణాలకూ పెట్టిన పేర్లు కొన్ని కొత్తగా కనిపించాయి గూడా! అందువల్ల తెలంగాణా గురించి యితర ప్రాంతాలకు తెలిసిన విషయాలు తక్కువేనని గూడ తెలిసొచ్చింది.

యిలా వొక ప్రాంతం వాళ్ళు సభల్ని నిర్వహించినప్పుడు ఆ ప్రాంతాలతో మిగిలిన ప్రాంతాలవాళ్లెలా మమేకమయి వున్నారో స్పష్టంగా యేకరువవుతుంది. ప్రాచీన కాలంలో మొత్తం దక్షిణ భారత దేశమంతా వ్యాపించిన తెలుగు, కన్నడ, తమిళ కవుల ఆవాసాలను ఆయా భాషల రాష్ట్రాల్లో తీసుకు రాలేమని గుర్తించగలిగాము.

తొలి తెలుగు కవి యెవరు? తొలి తెలుగు కథ యేది? - యిటువంటి ప్రశ్నలన్నీ కేవలం విద్వైక (academic) చర్చనీయాంశాలు.

మానవ జీవితంలాగే సాహిత్యం గూడా ప్రవాహం. అదీ యెప్పటికప్పుడు పరిణామాన్ని పొందుతూ వుంటుంది. చాలా కాలపు అభ్యాసాల తర్వాత వో సాహిత్య ప్రక్రియ వో రచనలో పరిపూర్ణంగా వికాసాన్ని పొందుతుంది. అసలు పరిపూర్ణతను కొలిచే సాధనాలుండవు. వొకరి దృష్టిలోని పరిపూర్ణత యింకొకరి దృష్టిలో కాదు. **మౌలిక సాహిత్య సృజన, పరిణామమూ, వికాసమూ అన్నవి రాజకీయ విభజనలకు భిన్నమైనవి. ఈ సత్యాన్ని గుర్తించకుండా జరిగే వివాదాల వల్ల ఫలితం వుండదు. బమ్మెర పోతన మొత్తం తెలుగువారందరి సొత్తు. ఆయన బమ్మెర వారయినా, వొంటిమిట్టవారయినా, ఆయన భాగవతంలోని మాధుర్యం తగ్గదు. ప్రాంతీయాభిమానాలకు భిన్నమైన సాహిత్య చరిత్రను నిర్మించుకోవడంలో దృష్టిని పెట్టడం ముఖ్యం. అయితే యిటువంటి సహనమూ, సంయమనమూ, చాలా కాలపు పోరాటం తర్వాత కొత్త**

రాష్ట్రం వుద్భవించినకొత్తల్లో వుండడం అసాధ్యం. అందువల్ల అయిదవ ప్రపంచ తెలుగు మహాసభల్లో వురకలెత్తిన తెలంగాణా స్వాభిమానాన్ని మిగిలిన ప్రాంతాల వాళ్ళు చూసి ముచ్చట పడడమే చేయవలసిన పని.

1980 ప్రాంతాల్లో తెలంగాణాలో జరిగిన విప్లవ పోరాటాలూ, ముఖ్యంగా నక్జలైటు వుద్యమాలు మొత్తం తెలుగు సాహిత్యాన్నంతా ప్రభావితం చేశాయి. తొలినాటి నుంచీ సామ్యవాదపు, వామపక్ష భావజాలపు స్ఫూర్తితో మానవీయంగా సాగిన ఆధునిక తెలుగు సాహిత్యానికి తెలంగాణా విప్లవోద్యమాలు యిచ్చిన వూపూ, వేగం అనితర సాధ్యమైనవి. అందువల్లే ఆధునిక తెలుగు సాహిత్యం ప్రపంచీకరణ ప్రభావాన్ని చాలా ముందుగా పసిగట్టగలిగింది. శ్రామికుల పక్షాన పోరాటం చేసింది. **రైతునూ, వ్యవసాయాన్నీ తెలుగు సాహిత్యమంత దీక్షగా, సమగ్రంగా, బలంగా మరే ఇతర భాషా సాహిత్యమూ పట్టించుకోక పోవడానికి గూడ ఆనాటి విప్లవోద్యమ ప్రభావాలే కారణం.**

భిన్న భాషా ప్రభావాల వల్ల తెలుగు భాష యెప్పుడూ సంపన్నమవుతూనే వుంది. తమిళ - తెలుగుల సంపర్కంలో కర్ణాటక సంగీతం వికసించినట్టుగా, తెలుగు - మరాఠీ భాషల సాన్నిహిత్యంలో హిందూస్థానీ సంగీతం పాదుకొంది. ఆదిలాబాదు వాస్తవ్యులైన సామల సదాశివగారు వుర్దూ సాహిత్యాన్నీ, హిందూస్థానీ సంగీత రీతుల్నీ తెలుగువాళ్ళకు పరిచయం చేశారు. గొప్ప రచన అయినా, గొప్ప గాయనమైనా గుండెను తాకి, కళ్లలోంచి పారవశ్యపు కన్నీటిని రప్పించగలిగేదేనన్న అచ్చమైన భారతీయ విమర్శనా లక్షణాన్ని సదాశివగారు ప్రతిపాదించే దాకా మనం గుర్తించలేదు. జీవితపు సార్థకత, సంపన్నత లలితకళల సాన్నిధ్యంలోనే వుంటుందనీ, రస జీవితం కంటే గొప్పది మరేదీ వుండదనీ ఆయన జీవించి చూపెట్టారు.

ప్రపంచ మహాసభల్ని నిర్వహించడమన్నది ఆషామాషీ గాదు. అదొక పెద్ద యజ్ఞంలాంటిది. అటువంటి సభలకు అందర్నీ ఆహ్వానించడం సాధ్యంగాదు. సహజంగానే ఆహ్వానితులు పొగడ్డమూ, ఆహ్వానించబడని వాళ్లు తెగడ్డమూ జరుగుతూనే వుంటుంది. తమ రాష్ట్రంలో జరుగుతున్న సభలకు తమనే ఆహ్వానించలేదని తెలంగాణాలో కూడా కొంతమంది నిరసనను ప్రకటించారు. యిటువంటివెప్పుడూ జరుగుతూనే వుంటాయి. వీటన్నింటికీ మించిన కార్యక్రమ నిర్వహణనే అందరూ గమనించాలి.

సభలు జరిగిన అయిదు రోజుల పాటూ అన్ని సభా ప్రాంగణాలూ జనంతో నిండిపోయాయి. సాహిత్య సభలకంతమంది ప్రేక్షకులుండడం యెప్పుడూ జరగని పని. అయిదు రోజుల పాటూ మధ్యాహ్నాల్లో అందరికీ విందు భోజనాలు ఏర్పాటయ్యాయి. ప్రతి సభకూ వొక ప్రముఖుడైన మంత్రి రావడమూ, అతను చివరి వరకూ శ్రద్ధగా కూర్చుని వుపన్యాసాలు వినడమూ, ఆ మంత్రి సభాధ్యక్షుడైన కవిగ, రచయితల కనుసన్నలల మెలగడమూ - యిది సాధారణంగా జరగని దృశ్యం. యెన్నికల తర్వాత మానవస్థాయిని దాటి దైవత్వాన్ని ఆపాదించుకునే రాజకీయ నాయకులూ, జరుగుతున్న అభివృద్ధినంతా తామూ, తమ ప్రభుత్వం అనిగాకుండా అంతా తానొక్కడే చేస్తున్న కృషిగా నమ్ముతున్న అగ్రరాజకీయ నాయకులూ వున్న యీనాటి కాలంలో రాజకీయ నాయకులంటే సాదాసీదాగా వ్యవహరించడం వూహించలేము. తెలంగాణా రాజకీయ నాయకులను అభినందించి తీరాలి.

యిటువంటి ప్రపంచ మహాసభలు కేవలం వేడుకలు మాత్రమే. కొత్త స్ఫూర్తినీ, సరికొత్త వైభవాన్ని చాటుకోడం మాత్రమే జరుగుతుంది. సాధికారమైన, సమగ్రమైన చర్చలకది వేదిక గాదు. యీ అలజడీ, హడావుడి తగ్గిన తరువాత, ప్రపంచ మహాసభలు ఎక్కడ జరిగినా,అందరూ, మొత్తం తెలుగుజాతి కంతా ముఖ్యమైన అంశాల గురించి ఆలోచిస్తారనీ, చర్చిస్తారనీ ఆశించడమొక్కటే యిప్పుడు మనం చేయగలిగిన పని.

యిటీవల హోసూరు రచయితల సంఘం ప్రచురించిన తొండనాడు కథలు, మొరసునాడు కథలు, భాషలకతీతమైన భౌగోళిక యేకత్వాన్ని నిరూపించాయి. అలాగే 'మదరాసు బదుకులు', 'అమెరికా తెలుగు కథలు' 'బొంబాయి కథలు' మొదలైనవి ప్రపంచమంతా వ్యాపించివుండే తెలుగువాళ్ళను పరిచయం చేశాయి. మాతృభాషలో వ్యక్తీకరించుకునే హక్కు ప్రతి మనిషికీ వుండాలి. తల్లిభాషలో వుండే నైపుణ్యం, ప్రావీణ్యత పరాయి భాషలో వుండదు. కేవలం భాష బోధనతో యిది నెరవేరదు. ప్రపంచంలో వచ్చే విజ్ఞానమంతా యెప్పటికప్పుడు తెలుగు భాషలోకి చేరాలి. అన్ని శాస్త్రాలూ, పరిశోధనలూ తెలుగులో జరగాలి. ఆ దిశగా తెలుగువాళ్ళంతా పురోగమించేందుకు యిటువంటి ప్రపంచ మహాసభలు వూనుకోవాలి.

పాఠకులు తగ్గిపోవడం, సాహిత్య పత్రిక లేకపోవడం యిప్పటి తెలుగుకున్న ప్రధాన సమస్య. తమిళ, కన్నడ, మలయాళ ప్రభుత్వాలు ఆయాభాషల్లో ప్రచురించబడే ప్రతి పుస్తకాన్నీ వందల ప్రతులుకొని గ్రంథాలయాలకు పంపుతున్నాయి. యిప్పుడు మన రెండు తెలుగు రాష్ట్రాల్లోని గ్రంథాలయాలు దయనీయమైన స్థితిలో వున్నాయి. వొకప్పుడు ఆంధ్రపత్రిక, భారతి వంటి గొప్ప సాహిత్య పత్రికలున్న తెలుగులో యిప్పుడు మంచి సాహిత్యానికి ఆలంబనగా వుండే పత్రికలే లేవు. కనీసం మన పొరుగు భాషలైన తమిళ, కన్నడ, మలయాళ భాషలనుగానీ, ఆయా ప్రభుత్వాల నుంచీ మంచి విషయాల్ని నేర్చుకోకపోతే యిటువంటి మహాసభలు కేవలం ఆర్భాటాలుగానే మిగిలిపోతాయి. హైదరాబాదులో జరిగిన అయిదవ తెలుగు ప్రపంచ మహాసభల్లోని మంచిని మాత్రమే గ్రహించి, యింకా యిటువంటి మాతృభాషా వుద్యమాల్ని పరిపుష్టం చేయగలిగే విధానాలకోసం అన్వేషణ కొనసాగించాలి. అ

తెలుగులో పరిపాలించనప్పుడు మనవి తెలుగు రాష్ట్రాలెలా అవుతాయి?

తెలుగులో పేరు పలక (బోర్డు) లేని అంగళ్లలో కొనుగోళ్లు చెయ్యవద్దు

పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం - రెండూ తప్పే


మౌనంలోని మాటలు

4

సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ

తెలుగు అనువాదం :
రంగనాథ రామచంద్రరావు

కన్నడ మూలం:
డా. ఆర్. వి. బి. కుమార్



మౌనంలోని మాటలు - 4

బంధుత్వాలు వెదుకుతూ :

నా తండ్రికి తోడబుట్టినవాడు అంటే నాకొక పెదనాన్న ఉన్నాడట. అతనికి ఇద్దరు ఆడపిల్లలట. వాళ్ళు నాకు వరుసకు అక్కలు అవుతారు. నేను పుట్టటానికి మునుపే వాళ్ళు మా గుంపును వదిలి దేశాంతరం పోయారట. వారికి సంబంధించిన ఏ గుర్తులు మా దగ్గర లేవు. మా తల్లితండ్రుల దగ్గర వాళ్ళ గురించి ఉన్న జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి.

నాన్నకు చాలా సంతోషం కలిగినపుడు తన తండ్రి గురించి, తన అన్న సంసారం గురించి మా ముందు చెప్పేవాడు. తన అన్న సంసారం, వాళ్ళు కడుపు తిప్పల కోసం దేశాటనకు వెళ్ళిపోయారని చెప్పేవాడు. వాళ్ళు చెరువుకు అటువైపు (కొప్పళ, రాయచూరు జిల్లా) దేశంలో ఎక్కడో ఉన్నారట. వాళ్ళు ఒక్కసారి కూడా ఇటువైపు రాలేదట.

"మాయన్న చనిపోయిండాడో, బతికివుండాడో, ఆ ద్యావరకే గొత్తు. ఆ యప్పని నేను కంటితో సూస్తానో లేదో" అని అనేవాడు.

ఒకసారి మా పెదనాన్న కూతురు మా నాన్నను వెదుకుంటూ వచ్చింది. ఆమెను చూసి మా నాన్నకు తన అన్నను చూసినంతగా సంతోషం కలిగింది. మాకందరికి ఆమెను చూపించి "ఈయమ్మ మీ అక్క" అని చెప్పాడు. ఆమె ఒక రోజు మాతోపాటు ఉంది, మరుసటి రోజు తన భర్త దగ్గరికి వెళ్ళిపోయింది. ఆమె మా పెద్దనాన్న, పెద్దమ్మ చనిపోయారనీ, ఇప్పుడు తానూ, తన అక్క మరియు తమ తమ సంసారాలు, రాయచూరు, మాన్వి, కారటగి, గంగావతి, కొప్పళ ప్రదేశాలలో తిరుగుతూ అడుక్కుంటామని చెప్పింది.

ఆమె వచ్చిపోయిన తరువాత మాకు పెదనాన్న కుటుంబాన్ని చూడాలనే కోరిక పెరుగుతూ పోయింది. దాంతో ఒక రోజు గంగావతికి పోయాను. గంగావతిలో ప్రతీ ఆదివారం ఒకసారి సంత జరిగేది. సంతకు మా వాళ్ళు ఎవరో ఒకరు తప్పకుండా వస్తారు. వాళ్ళను విచారిస్తే మా వాళ్ళ గురించి ఏదైనా విషయం తెలుస్తుందనే ఆశ నాది.

నేరుగా గంగావతి సంతలోపలికి వెళ్ళి బిచ్చమడగసాగాను. అప్పుడు కనిపించిన మా కులస్థుడొకడిని మా అక్కల గురించి విచారించాను. ఆ వ్యక్తి దాసనాళ బ్రిడ్జి దగ్గర మా వాళ్ళు గుడారాలు వేసుకున్నారని చెప్పాడు. అతని మాటలు వినగానే నాకు సంతోషం కలిగింది. నేను నేరుగా దాసనాళ బ్రిడ్జి వైపు నడుస్తూపోయాను. దాసనాళ బ్రిడ్జి ముందు హిరేబెణకల్లుకు వెళ్ళే దారిలో కొండ పక్కన కొన్ని గుడారాలు కనిపించాయి. వాటిని చూసి నాకు చాలా సంతోషం కలిగింది.

నేను అక్కడికి వెళ్ళగానే పెదనాన్న ఇద్దరు కూతుళ్ళు తమ పిల్లలతో గుడారాల ముందు కూర్చుని వున్నారు. చిన్నక్క నన్ను అంతకు మునుపు చూసింది కదా ! నన్ను చూడగానే 'రా తమ్ముడూ' అని పిలిచి గుడారం ముందు కూర్చోబెట్టుకుంది. అటు తరువాత పెద్దక్కకు నన్ను పరిచయం చేసింది. ఆ రెండు కుటుంబాలతోపాటు మా జాతిజనాలంతా నా చుట్టూ చేరారు. వాళ్ళు నన్ను హోటల్‌కు పిల్చుకునిపోయి వగ్గాణి తినిపించి, చాయ్ తాగించారు, సాయంత్రం అడుక్కుని వచ్చిన పదార్థాలనంతా నాకు పెట్టారు. ఆ రాత్రి వారితో పాటు అక్కడే పడుకుని మరుసటి రోజు కంప్లికి వచ్చేశాను.

ఇదే విధంగా వాళ్ళు గుర్తు వచ్చినప్పుడల్లా వాళ్ళను చూడటానికి వాళ్ళు ఎక్కడున్నారో అక్కడికి వెదుక్కుంటూ వెళ్ళిపోయేవాడిని.

ఇలా నెమ్మదిగా మా మధ్యని సంబంధాలు బలపడుతూపోయాయి.

నాన్న అప్పు తీర్చమనడం :

మా వాళ్ళు ఎప్పుడు గంగావతికి వెళ్ళినా దాసవాళ బ్రిడ్జి పక్కనో, లేదా హిరే బెణకల్ కొండ పక్కనో గుడారం వేసుకునేవాళ్ళు. ఒకసారి అక్కయ్య కుటుంబాన్ని పలకరించడానికి దాసవాళ బ్రిడ్జి దగ్గరికి వెళ్ళాను. అక్కడ అక్కయ్యలను పలకరించి నేనే వాళ్ళకు బిచ్చాటన వల్ల వచ్చిన డబ్బుతో టిఫిన్ చేయించాను. అక్కయ్యవాళ్ళ గుడారం దగ్గరికి మా కులం వ్యక్తి ఒకడు వచ్చాడు. అతనితో నాకు పరిచయం లేదు.

'ఏమ్రా అల్లుడా, నూవు బాగుండావా? మీ అబ్బ ఎట్లుండాడు?" అని అడిగాడు.

"బాగుండాను, మా అబ్బ కూడా బాగుండాడు" అని అన్నాను.

అతను అవీ ఇవీ మాట్లాడుతూ, "మీ అబ్బ నాకు అయిదు గౌర్లు (వందలు)

రూపాయలు యియ్యాల. చానా ఒద్దులయ్యే. ఇప్టకి గూడా యియ్యలేదు" అన్నాడు.

మా నాన్న అడుక్కుని తినేవాడైనా నాకు తెలిసి అతను ఎవరి దగ్గర అప్పు చేసినవాడు కాదు.

నేను ఊరికి వచ్చిన తరువాత నాన్నతో–

"గాలెప్ప అనేటోడు, నువ్వు ఆయప్పకి బాకీ ఉండావన్నాడు" అని అన్నాను.

"ఎవడ్రా? నాను బాకీ తీసుకున్నానని అనింది. ఇంకోబారి కనబడితే సెప్పు. మా అబ్బ బాకీ తీర్చుతాడంట. నువ్వే మా ఊరికి పోయి దుడ్లు తీసుకోవాల్నంట అని సెప్పు. ఎవడెవడో సుళ్లుసుళ్లు చెప్పి మిమ్మల్ని ఏమార్చి దుడ్లు తీసుకునేరు. బద్రం !"

ఈ సంఘటన జరిగిన తరవాత నేను రెండు మూడు సార్లు వాళ్ళ ఊరికి పోయినా అతడు నా కంట పడలేదు.

ఓ సంచారి పెళ్ళి :

నేను ఇదే విధంగా మూడు నెలలకో, ఆరు నెలలకో అక్కలను పలకరించడానికి వెళ్ళేవాడిని.

అలా ఒకసారి వెళ్ళినవాడిని ఒక రాత్రి అక్కడే ఉండిపోయాను.

మరునటి రోజు ఉదయం ఒక అమ్మాయి పెండ్లి నిశ్చయం చేయడానికి రాయచూరు నుంచి మా కులస్థులు వచ్చారు. మా కులంలో తాంబూలాలు ఎత్తుకునే వరకూ కులపెద్దలు ఎవరూ భోజనం చేయడానికి కుదరదు. పిల్లవాడి వైపు వాళ్ళు ఎంత అడిగినా, అమ్మాయిల వైపు వాళ్ళు దేనికీ ఒప్పుకోవటం లేదు. ఏవేవో నెపాలు చెబుతూ తాంబూలం కార్యక్రమాన్ని ఆలస్యం చేస్తున్నారు. ముఖ్యంగా పెండ్లికూతురే కనిపించటం లేదు. వాళ్ళల్లో వాళ్ళే ఏదేదో మాట్లాడుకుంటూ కాలం గడుపుతున్నారు.

ఒక్కరు ఒక్క ముద్ద నోట పెట్టలేదు. ఒక్కరూ బిచ్చానికి పోలేదు. కుర్రవాళ్ళు మాత్రం ఆకలికి ఆగలేక అక్కడక్కడ అడుక్కుని తినివస్తున్నారు.

సాయంకాలమైంది.

చివరికి అమ్మాయి వైపు వాళ్ళు 'ఓలి' తీసుకుని ఆకులు తీసుకోవటానికి అనుమతి ఇచ్చారు. పెళ్ళికొడుకూ వచ్చాడు. ఆకులు ఎత్తటానికి ఒప్పుకున్న క్షణమే ఓలి దబ్బు ఇచ్చి ఆకులు ఎత్తారు. ఇక దాదాపు అమ్మాయి మగడి ఇంటి సొత్తు అయినట్టే. ఆకులు ఎత్తుతుండగా మగపిల్లవాడి వైపు వాళ్ళ అమ్మాయి ఎక్కడుందో చూడండని వెదకడం మొదలుపెట్టారు. అమ్మాయి జాడనే లేదు. ఎవరో ఒకరు అమ్మాయి మేకలను మేపుకుని రావటానికి వెళ్ళిందని చెప్పారు.

చీకటి పడానికి మునుపే మేకలను తోలుకుని పోయిన అమ్మాయి మేకలను తోలుకుంటూ గుడారం వైపు వచ్చింది.

అమ్మాయికి ఎనిమిది తొమ్మిదేళ్ళు ఉండొచ్చు.

అమ్మాయి రాగానే పిల్లను పిల్చుకుని వచ్చారు.

అక్కడ చేరిన వాళ్ళు అమ్మాయి ఒళ్ళు కడిగించి, స్నానం చేయించి పాతచీర కట్టించారు.

వాళ్ళల్లోనే ఒకరు పదిరూపాయలకు ఒక దండలా రెండు దండలు తెచ్చారు.

పిల్లాపిల్లవాడిని పక్కపక్కనే కూర్చోబెట్టి దండలు మార్పించారు.

పెండ్లి జరిగిపోయింది.

పెళ్ళి ముగుస్తుండగా సారాయి ప్యాకెట్లు తెచ్చారు.

అందరికీ రెండు రెండు ప్యాకెట్లు పంచారు.

గుడారం పక్కనే అన్నం, పులుసు వండారు.

అందరూ పీకలదాకా తాగి భోజనం చేశారు.

ఒక గంటలోపల పెండ్లి జరిగిపోయింది.

అలమరుల పెండ్లిండ్లు అంటే ఇలాగే ఉంటాయి చూడండి !

మొదటిసారి పిల్లను నిశ్చయం చేయటం :

నా పెండ్లికి మొదట అమ్మాయిని నిశ్చయం చేసినపుడు నా వయసు 15–16 ఏళ్ళు ఉండొచ్చు. అమ్మాయికి ఏడెనిమిదేళ్ళు ఉండొచ్చు. అమ్మాయి ఇంటివాళ్ళు తెక్కలకోటలో క్యాంపు వేశారు. పిల్లను నేను చూడనేలేదు. నాన్న వెళ్ళి పిల్లకు ఇంత ఓలి ఇస్తానని చెప్పి అమ్మాయిని నిశ్చయం చేసుకుని వచ్చాడు. నా కడుపు నొప్పి తగ్గిన తరువాత ఆ పిల్లనే పెండ్లి చేసుకున్నాను.

ఆ పిల్లను పెండ్లి చేసుకోవటం వెనుక ఒక కథ ఉంది:

ఆ కాలంలో మా ఇంటికి మా కులస్థుల్లో ఎవరూ ఆడపిల్లను ఇవ్వటానికి ముందుకు వచ్చేవారు కాదు. మేము చాలా బీదవాళ్ళం అని మా కులస్థుల నమ్మకం. అందువల్ల ఎవరూ ఆడపిల్లను ఇచ్చేవాళ్ళు కారట. అయితే నా భార్య తాత (అంటే నా భార్య తల్లికి తండ్రి) నాకు తన మనుమరాలిని ఇవ్వటానికి ముందుకు వచ్చాడు. అతడి మాటను అతడి అల్లుడు, కూతురు మన్నించేవాళ్ళు. పిల్లను నాకు ఇవ్వటానికి సంతోషంగా ఒప్పుకున్నారు. నాకు పిల్లను ఇవ్వడం ద్వారా వాళ్ళు తమ మీద ఉన్న నాన్న ఋణాన్ని తీర్చుకున్నారు.

నా భార్య అమ్మమ్మ బళ్ళారిలో గుడారం వేసుకుని ఉంటున్నప్పుడు ఏదో జబ్బుపడి చనిపోయిందట. మా జాతి జనం ఆ కుటుంబాన్ని వెలివేసినట్టున్నారు. ముసలిదాన్ని మట్టి చేయడానికి మా కులస్థుల్లో ఒక్క వ్యక్తి ముందుకు రాలేదట. చివరికి రాజప్పతో కలిసి నాన్న శవాన్ని మట్టి చేశాడట.

శవాన్ని మట్టి చేయడమంటే మా కులం వాళ్ళు శవాన్ని సూర్యుడు ఏ దిక్కులో పుడతాడో ఆ దిక్కులో ముఖం చేసి బోరగిలా పడుకోబెడతారు. పైన మట్టి పోసి కప్పేస్తారు.

ఆ ముసలిదాన్ని పూడ్చడానికి ఎవరూ లేనప్పుడు నాన్ననే శవాన్ని భుజం మీద మోసుకునిపోయి మట్టిచేసి వచ్చాడట !

ఈ సంఘటన ఆ ముసలివాడి మీద తీవ్రమైన ప్రభావం కలిగించింది.

ఆ ఋణం తీర్చుకోవడానికి నాకు మనుమరాలిని ఇచ్చాడు.

నాకు కడుపు నొప్పి తగ్గిన తరువాత అంటే నా పద్దెనిమిదవ ఏట పెండ్లి చేసుకున్నాను.

కడుపు నొప్పికి మందు :

రాత్రిది, పాచింది, పులిసింది తిని పెరిగిన దేహమిది. ఈ శరీరానికి ఒక జ్వరం,



ఒక రోగం వచ్చిన గుర్తులు లేవు. మా ఒంటికి ఆరోగ్యం, అందం దేవుడిచ్చిన వరాలు. ఇలాంటి సమయంలో కోతి వల్ల నాకు కడుపు నొప్పి వచ్చింది. దాంతో కంప్లిలో డాక్టర్ దగ్గర చూపించుకోవడానికి పోయాను.

ఆ డాక్టర్ నాకు అల్సర్ అన్నాడు. బళ్ళారికి వెళ్ళి చూపించుకోమని చెప్పాడు. అక్కడి డాక్టర్ అడ్రసు రాసిచ్చాడు. బళ్ళారిలో దురగమ్మ గుడి దగ్గర ఆ ఆస్పత్రి ఉంది. అక్కడి డాక్టర్ నన్ను పరీక్షించి ఎక్స్‌రే తీయాలి అన్నాడు. ఎండోస్కోపు చేయాలి అన్నాడు. రక్త పరీక్షలు చేయించాలి అన్నాడు. ఇలా అన్ని పరీక్షల లిస్ట్ చెప్పాడు. నా దగ్గర అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? ఏ పరీక్ష చేయించకుండా కంప్లికి తిరిగొచ్చాను. కొన్నాళ్ళు ఇంట్లోనే ఉండి పోయాను. ఇంట్లోనే ఉండి విసుగొచ్చి పశువుల ఆస్పత్రి వైపు వెళ్ళాను.

ఆ రోజు ప్రసాదరెడ్డి ఆస్పత్రిలో ఉన్నారు. "ఏమిటి? బాగున్నావా?" అని అడిగారు.

నేను నన్ను బాధిస్తున్న కడుపు నొప్పి గురించి చెప్పాను. డాక్టర్ దాన్ని అల్సర్ అని చెప్పటం, ఆపరేషన్ చేయించాలని చెప్పటం, ఎక్స్‌రే తీయించాలనటం మొదలైన విషయాలన్నీ చెప్పాను.

ఆయన సోదరుడు జగళూరులో మనుషుల డాక్టర్. ఆయన చేత నాకు ఆపరేషన్ చేయిస్తానని, తన వెంబడి రమ్మన్నారు. నేను సరేనన్నాను. అయితే జగళూరు వెళ్ళడానికి నా దగ్గర డబ్బులు లేవు. అదే విషయం ఆయనతో చెప్పాను.

"సరే, నేను డబ్బిస్తాను, నా వెంట జగళూరుకు రా" అని ఆయన పిలిచారు.

ఆయన వెంట జగళూరు వెళ్ళాను. జగళూరుకు వెళ్ళిన ఒకటి రెండు రోజులు తమ ఇంట్లోనే ఉంచుకున్నారు. రెండు రోజులకు తగినన్ని గోలీలు ఇచ్చారు. రెండు రోజుల తరువాత ప్రసాదరెడ్డిగారు తమ తోటకు పిలుచు కునిపోయారు. తోట ఊరి నుంచి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉంది. అది అడవి ప్రదేశం. ఊరికి రావాలంటే నడుచు కుంటూ రావాల్సిందే.

"ఈ తోటను చూసుకుంటూ ఉండు. మొక్కలకు నీళ్ళు పోస్తూవుండు. ఎవరో ఒకరు రోజూ నీకు భోజనం తెచ్చి ఇస్తారు. ఈ గోలీలు వేసుకుంటూ ఉండు. త్వరలో ఆపరేషన్ చేద్దాం" అని చెప్పి రెండు రకాల గోలీలు ఇచ్చి వెళ్ళిపోయారు.

ఇలా పదిహేను రోజులు గడిచాయి.

మొదట్లో సమయానికి సరిగ్గా భోజనం తెచ్చి ఇచ్చేవాళ్ళు.

రాను రాను సమయం తప్పించి భోజనం తీసుకుని రావటం మొదలుపెట్టారు.

తర్వాత తర్వాత భోజనమే తీసుకుని రావటం మానేశారు.

గోలీలు, మందులు ఇవ్వడమూ మానే శారు.

ఆపరేషన్ మాట ఎత్తితే రేపు చేద్దాం, మర్నాడు చేద్దాం అంటూ దాటవేస్తూ వచ్చారు.

కొన్నాళ్ళ తర్వాత మేము పిండి ఇస్తాం, వంట చేసుకో, కూరగాయలు ఎలాగూ తోటలో ఉన్నాయి కదా అని చెప్పసాగారు.

ఇలా మూడు నాలుగు నెలలు నా చేత పని చేయించుకున్నారు.

చేసిన పనికి కూలీ లేదు.

కడుపు నొప్పికి మందులు లేవు.

కడుపుకు తిండిలేదు.

ఆపరేషనూ చేయించలేదు.

వాళ్ళు అబద్ధాలు చెబుతున్నారని నాకు అర్థమైంది. నేను ఊరికి వెళ్ళొస్తానని అన్నాను. అయితే నేను ఊరికి వెళితే తిరిగి రాననే అనుమానం వాళ్ళది. అందువల్ల ఈరోజు వెళుదువు, రేపు వెళుదువు అంటూ వాయిదాలు వేస్తూ వచ్చారు. అక్కడ నాకు పరిచయమైన గోసంగి కులానికి చెందిన ఒక వ్యక్తి ఉండేవాడు. అతని దగ్గరకి వెళ్ళి నాకు మా తల్లితండ్రులను చూడాలని ఉందని, నేను మా ఊరికి వెళ్ళాలని, డాక్టర్‌గారికి చెప్పమని వేడుకున్నాను. ఆయన జగళూరు డాక్టర్‌కు పరిచయస్థులు. డాక్టర్‌కు చెబుతాను రమ్మని పిల్చుకునిపోయారు. డాక్టర్‌తో 'ఈ కుర్రవాడు తల్లితండ్రులను చూసి రావాలనుకుంటున్నాడు. అతడు ఊరికి పంపండి. సంచారులు అబద్ధాలు చెప్పరు. ఈ కుర్రవాడు నాకు తెలుసు' అని అన్నాడు.

డాక్టర్ నాకు ఏడువందలు ఇచ్చి, "మీ ఊరికి వెళ్ళి తొందరగా వచ్చెయ్. నువ్వు వచ్చిన తరువాత ఆపరేషన్ చేయిస్తాను" అని అన్నాడు.

ఆ వ్యక్తి అబద్ధాలకోరు అని ఈ మూడునాలుగు నెలల్లోనే తెలిసిపోయింది.

ఇక్కడి నుంచి తప్పించుకుంటే చాలని నేను నేరుగా బస్సు ఎక్కి కంప్లి చేరుకున్నాను.

కంప్లికి వచ్చినా నా కడుపు నొప్పి తగ్గలేదు. అదే సమయంలో ఎవరో మోళ కాల్మురు దగ్గర మ్యాసరహట్టిలో ఒక పూజారి ఇలాంటి వాటికి మందులు ఇస్తాడని చెప్పారు. నా దగ్గర డబ్బులు లేవు. అప్పు చేసి మ్యాసర హట్టికి వెళ్ళాను. అక్కడ మారెమ్మ గుడి ఉంది. దాని పూజారి నాటుమందులు ఇచ్చేవాడు. అతను ఒకసారి మందులు ఇవ్వడానికి రెండు వందలు, మూడు వందలు తీసుకునేవాడు. డబ్బులు ఇవ్వకుండా మందులు ఇచ్చేవాడు కాదు. బిచ్చమెత్తో, అప్పు చేసో డబ్బులిచ్చి మందులు తీసుకునేవాడిని. అక్కడే రాగిముద్ద పెట్టించుకుని తినేవాడిని. ఒకటిరెండు రోజులు

ముద్దలు పెట్టిన పూజారి, రాను రాను ముద్ద పెట్టడం మానేశాడు. అయితే అక్కడే గుడి దగ్గర కొబ్బరికాయలు అమ్మే ముసలిది ఉండేది. ఆమె నేను ఉపవాసం ఉండటం చూసి ముద్ద పెట్టేది. వారానికి ఒకసారి మోళకాల్మూరు సంతకు బిచ్చానికి వెళ్ళేవాడిని. అక్కడ కొంచెం పిండి, గింజలు, కూరగాయలు, చిల్లర డబ్బులు దొరి కేవి. దొరికిన కూరగాయలు, పిండి, గింజలు తెచ్చి ముసలిదానికి ఇచ్చేవాడిని. ముసలిది నాకు రాగిముద్ద పెట్టేది.

అదే సమయంలో రోడ్డు పక్కన అటవీశాఖవాళ్ళు వరుసగా మొక్కలు నాటడం మొదలుపెట్టారు. వాటికి కాపలా ఉండమని నన్ను అడిగారు. నెలకు మూడు వందలు ఇస్తా మన్నారు. నేను ఒప్పుకున్నాను. ఆ రోజు నుంచి ఆ పని చేయసాగాను. వారానికి ఒకసారి సంతలో బిచ్చం అడగటం ఎలాగూ ఉండనే ఉంది. నెల తరువాత మొక్కలకు కాపలా కాసి నందుకు మూడువందలు దొరికాయి. అందులో వందపాయలు ముసలిదానికి, మరొక వంద రూపాయలు పూజారికి, మిగిలిన వంద రూపాయలు నా ఖర్చులకు పెట్టుకున్నాను.

పూజారి ఇస్తున్న మందులతో నాకు నయం కాదని అర్థమైంది. మరొకదారి కనిపిం చక ఊరికి తిరిగి వచ్చాను. ఇదంతా జరు గుతున్న సమయంలో మా వాళ్ళు చంద్రకళా టాకీస్ ఎదురుగా ఉన్న బయలు ప్రదేశం వదిలి 'శిబిరదిన్ని' కి వచ్చి గుడారాలు వేసుకున్నారు. శిబిరదిన్ని అన్నది కంప్లి, ముద్దాపుర ఊర్ల మధ్యన ఉన్నది. గతంలో బ్రిటిష్‌వాళ్ళు ఇక్కడ శిబిరాలు వేసుకుని ఉండటం వల్ల ఈ ప్రాంతానికి శిబిరదిన్ని అనే పేరు వచ్చిందట. ఇది గతంలో ఒక పాడుబడిన ఊరట. ఈ స్థలంలో ఆంజనేయస్వామి గుడి, తాయమ్మ గుడులు ఉన్నాయి. బయలు ప్రదేశంలో మా వాళ్ళు గుడారాలు వేసుకున్నారు. అందులో మాదీ ఒక గుడారం !

గుడారంకు వచ్చి చేరుకున్నాను.

ఇక్కడ మాలాంటి ఎంతోమంది బీదాబిక్కి జనం అక్కడ గుడారాలు వేసుకున్నారు.

వాళ్ళు జనానికి నాటు మందులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు.

నా పొట్ట నొప్పి కథ వారికి తెలిసింది.



వాళ్ళు నా కడుపు నొప్పికి మందిస్తా మని చెప్పారు.

దానికోసం అయిదు కేజీల కరివేపాకు తెప్పించారు. దాంతోపాటు రకరకాల మూలి కలు, వేర్లు వేశారు. వాటినన్నిటినీ కలిపి ఉడకించి, రెండులోటాల కషాయాన్ని తయారు చేశారు. దాన్ని మూడు చుక్కలు ఉదయం, మూడు చుక్కలు రాత్రి తాగమని చెప్పారు. ఇలా మూడు రోజులు తాగాను. కడుపు నొప్పి మాయమైంది. ఏ అపరేషన్ అవసరం లేకుండా పోయింది.

పెద్దపెద్ద చదువులు చదివి డాక్టర అనిపించుకున్న జగళూరుకు చెందిన ఆ వ్యక్తి ఒఠ్ఠిమోసగాడని ఆ రోజు నాకు అర్థమైంది.

(తరువాయి వచ్చే సంచికలో...)



మాట్లాడుతున్న సంఘ కార్యదర్శి
శ్రీ అల్లంసెట్టి చంద్రశేఖర రావు

2018 జనవరి 22వ తేదీ సోమవారం గిడుగు రామమూర్తిగారి 78 వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సాయంత్రం 3 గంటలకు సవరభాషా సంఘం "సవర పలుకుల పండుగు" సమావేశం ఏర్పాటు చేసింది.

ముందుగా 100 సంవత్సరాల క్రితం గిడుగు రామమూర్తిగారు చెట్లు తమను నరకవద్దంటూ సవరభాషలో రచించిన పాటను విద్యార్థులు గానం చేశారు. ఈ సమావేశానికి సవరభాషా సంఘం అధ్యక్షులు శ్రీ కణుగుల వెంకటరావు అధ్యక్షత వహించారు.

సంఘ కార్యదర్శి శ్రీ అల్లంసెట్టి చంద్రశేఖరరావు సంఘ కార్యక్రమాల గురించి వివరించారు. సవరభాష ప్రాచీనమైన విశిష్టభాష అనీ, దానిని నిలబెట్టుకోవలసిన అవసరం అందరిపైన వుందనీ, సవరలు తమ భాషలో మాట్లాడుకోడానికి సిగ్గుపడవలసిన అవసరం లేదనీ బోధించారు. పరిస్థితి 20 సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడు కొంత మెరుగ్గావుం దన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సవర భాషా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దానికి కావలసిన విద్యావిషయిక సహాయం అందించ గలనని తెలిపారు.

సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు ఇంగ్లీషు, తెలుగు నేర్చుకోవడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని చెప్పారు. 9వ తరగతి చదువుతున్న సవర కథారచయిత ఆరికి హరీష్ తన ఉపన్యాసంలో మాతృభాషద్వారానే తరతరాల సంస్కృతి నిలబడుతుందనివివరించాడు.

"సవర పలుకుల పండుగు" సంద ర్భంగా సవర కథలు, సవర పాటలు రచించిన విద్యార్థుల స్వీయ రచనా గానం, తరువాత రచయితలకు నగదు రూపంగా బహుమతి ప్రదానం జరిగింది. 10 మంది విద్యార్థులు కథలు రాయగా ఇద్దరు పాటలు రాశారు.

భాషోద్యమ కథానిక

పోట్లూరు సుబ్రహ్మణ్యం
9491128052

ప్రసంగి-అదన ప్రసంగి

అమెరికాలోని కొందరు తెలుగు భాషాభిమానులు, ఆంధ్రరాష్ట్రంలోని ఒకానొక ఫక్తు పల్లెటూరిని ఎన్నుకొన్నారు ఆంధ్రరాష్ట్ర మ్యాపు ప్రక్కన పెట్టుకుని. వాళ్ల ఉద్దేశం వీళ్లు ఆగ్రా మానికి వెళ్లి కల్తీలేని తెలుగు సంభాషణలు, తెలుగుదనం చూడాలనుకున్నారు. విజయవాడ లోని ఒక వ్యక్తికి ఫోను చేసి అక్కడ తామంతా ఒకరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడ ఉండే ఏర్పాట్లు చేయు మన్నారు. అందుకు అయ్యే ఖర్చుకూడా పంపారు. ఆయన ఆ ఊరి సర్పంచిని విజయవాడకు పిలిపించి, కొంత డబ్బిచ్చి, అక్కడ ఏర్పాట్లు చూడమని, కొరవ డబ్బు తరువాత ఇస్తానని చెప్పాడు. అందుకు అతను ఎంతో సంతోషించి వెళ్ళిపోయాడు.

అనుకున్న రోజు రానే వచ్చింది. విజయవాడలో ఫ్లైట్ దిగిన వాళ్లకు అక్కడే హోటళ్లలో దిగారు. వాళ్ల స్నేహితుడు అన్నీ ఏర్పాట్లు చేశానని, ప్రక్కరోజే పల్లెకు వెల్దామని చెప్పాడు. ఆరోజు రానే వచ్చింది. అందరూ కార్లలో సదరు పల్లెటూరుకు వెళ్లారు. ఎండాకాలం సెలవులయినందున స్కూల్లోనే కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అమెరికానుంచి విచ్చేసిన తెల్లపంచె, తెల్లచొక్కా, భుజాన తెల్ల తుండుగుడ్డతో తెలుగు దనం మూర్తీభవించే విధంగా అందరూ కారు దిగారు. ఇందులో ఒకాయన సభాధ్యక్షుడిగా వరుస కుర్చీల్లోని మధ్య కుర్చీలో కూర్చుంటే, అటు ఇద్దరు, ఇటు ఇద్దరు కూర్చున్నారు అదే వస్త్ర ధారణతో. అందరూ అమెరికా నుంచి వచ్చిన వాళ్లే.

అధ్యక్షుని కుర్చీలో కూర్చుని ఉన్న అశోక్ కుమార్. “అయ్యా. మేము అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నా, ఆంగ్లభాష కార్యాలయ పనుల వరకే పరిమితం, లేదా ఆ నగరాల్లో



“నో, ఇదంతా అబద్ధం. తెలుగు ఎక్క డికీ పోలేదు. మనమే ఇంగ్లీష మోజులో పడి, తెలుగును దూరం చేసుకుంటున్నాం. మనం చిన్నప్పుడు రాళ్లతో మామిడి కాయలు కొట్టాం, చింతకాయలు కొట్టాం. పొలంలో మేపుతున్న పశువుల్ని తరిమాం. అలా మన జీవితంలో పెన వేసుకుపోయిన రాయిని, అదన ప్రసంగి. “స్టోన్” అన్నాడు. దీన్ని బట్టే తెలుస్తున్నది “మనం రాతి యుగంలో ఉన్నామని”. మరి ప్రత్యేక ప్రసంగి, శ్రోతలను “డాంకీస్” అన్నాడు. ఎవరు గాడి దలు? వింటున్న ప్రజలుకాదు. స్వచ్ఛమైన తెలుగు మాట్లాడలేని మనం గాడిదలం” అంటూ ఆవేశంగా చెప్పి కూర్చున్నాడు ఆయన.

బ్రతకడానికి మాత్రమే. ఇంట్లో అంతా తెలుగునే మాట్లాడుతాం. తెలుగు ఆచారాలు, తెలుగు కట్టుబాట్లు, పూర్తిగా అమలు పరుస్తాం. అక్కడ దారి లో తెలుగువాడు ఎదురుపడితే, తెలుగే మాట్లాడుతాం. ప్రతి ఆదివారం ఎవరింటి దగ్గర గాని, లేదా ఏ సమావేశ మందిరంలోగాని కలుసుకుంటాం. ఆ సందర్భంలో మేమంతా తెలుగే మాట్లాడు కుంటాం.

ఎక్కడయినా ఆంగ్లపదం దొర్లితే వాళ్లకు తమాషాగా "తెలుగు ద్రోహి, 'తెలుగు హింస', 'తెలుగు పాము', 'తెలుగు పురుగు' అని రకరకాల పేర్లతో ఆ వారమంతా సంబోధిస్తాం. అంతేగాక వదానికింతని అపరాధ రుసుం కూడా వేస్తాం. అలా నిఖార్సయిన తెలుగు మాట్లాడటానికి నానా ప్రయత్నాలు చేస్తున్నాం. మేము ఈ పల్లెకు రావ దానికి కారణం స్వచ్ఛమైన తెలుగు మాట్లాడు తుంటే విందామని వచ్చాం, నేర్చుకుందామని వచ్చాం.

ఇప్పుడు నా కిచ్చిన జాబితా ప్రకారం, ఈ గ్రామంలో తెలుగుకోసం పాటుపడే వాళ్లని, అచ్చమైన తెలుగు మాట్లాడే వాళ్లని, ఒకరొకరుగా పిలుస్తాం. వాళ్లు వచ్చి తమ తీయని తెలుగు పదాలతో తెలుగుభాషా ప్రాముఖ్యతను గురించి మా చెవుల్లో సుగంధం పోస్తారని భావిస్తున్నాం" అంటూ, గ్రామ సర్పంచి ఇచ్చిన జాబితా గల కాగితం తీసాడు.

అంతా తెలుగులోనే వ్రాసి ఉంది. అయినా తెలుగులో వ్రాసిన ఆ ఇంగ్లీషు వదాలకు కాస్తంత బాధపడ్డాడు అమెరికా నుంచి వచ్చిన ఆ కార్యక్రమాధ్యక్షుడు,

అందులో స్పీకర్...

అడిషనల్ స్పీకర్....

గెస్ట్ స్పీకర్....

స్పెషల్ స్పీకర్... అని ఉంది.

అయినా తమాయించుకున్న అధ్యక్షుల వారు నోరు విప్పి, "ఇప్పుడు మొదటగా, ప్రసంగి సుబ్బారావుగారు మాట్లాడుతారు". అన్నాడు.

జనం ఘొల్లున నవ్వారు. స్టేజీ మీదకు వస్తున్న సుబ్బారావు ఆ నవ్వులకు ముఖం చిట్లిం చుకుంటూ "నేను ప్రసంగినా? ఈ అమెరికా వాళ్లకు ఏమీ తెలియదు. ప్రసంగి అంటే మా దృష్టిలో "వాగుడుకాయ" అని అర్థం అను కుంటూ స్టేజీ ఎక్కి, 'మైకిటివ్వ' అంటూ మొర

> "ఏయ్ షటప్ యువర్ మౌతులు. ఏంటి మీరు సెప్పేది. నే నిప్పటి దాకా మాట్లాడింది తెలుక్కాదా. ఆరవమా. రేయ్ ఎక్కువ మాట్లాడబాకండి. నాలుకలు కట్ జేత్తా, రోడ్డుమీద తిరిగే డాంకీ మేలురా మీకంటే. నాయనలారా. నేను సెప్పాల్సింది సెప్పినా. తెలుగును అక్కున జేర్చుకుందా. ఇంటింటా బీరువాలో దాచుకుందా. సరేనా" అంటూ వేదిక దిగాడు.

టుగా అని, అధ్యక్షుడి చేతిలోంచి దాన్ని బలవం తంగా లాక్కున్నాడు.

"ఇంతమంచి స్పీకర్నని పేరున్న నన్ను 'ప్రసంగి' అనడం చాలా అవమానకరంగా ఉంది. తెలుగు భాషాభివృద్ధికి పాటుబడే నంబర్ వన్ మనిషిని నేను. మొన్న విజయవాడ లో జరిగిన మీటింగులో నా స్పీచ్‌కి, హౌప్పవర్ చప్పట్లు ఆగలేదు. వాళ్లు ఎంతగా మైమరచి పోయారంటే 'ఎక్సెలెంట్', 'ఎక్సెలెంట్' అంటూ కేకలు పెట్టారు. కమ్ టుది పాయింట్ నేను తెలుగు భాష కోసం నా ప్రాణమైనా ఇస్తాను. తెలుక్కి జై తెలుగు లాంగ్వేజికి జై, తెలుగు స్కూళ్లకి జై. జైజై తెలుగు. మై డియర్ లవ్లీయెస్ట్ తెలుగు" అంటూ చప్పట్లు, చప్పట్లు అంటూ అరిచాడు గ్రాడ్యుయేట్ అయిన ఆ ఉపన్యాసకుడు.

ఇంతలో ప్రజల్లోంచి ఏదో వచ్చి పడింది. 'స్నేక్. స్నేక్' అంటూ స్టేజీమీద నుంచి క్రిందికి దిగి జనంలోకి వరుగెత్తాడు సుబ్బారావు. చూస్తే స్టేజి మీదకు ఎవరో తుంటరి విసరిన గడ్డితో చేసిన పాము బొమ్మ.

అధ్యక్షుల వారు తల పట్టుకుని, "ఇప్పుడు అదన ప్రసంగి ఆనందరావు తన సందేశ మిస్తాడు" అంటూ కూర్చున్నాడు.

ఆనందరావు సఫారీ డ్రెస్సులో ఉన్నాడు. అడక్కుండానే అధ్యక్షులవారి చేతి లోంచి మైకు విసురుగా లాక్కుని, "నేను అదన ప్రసంగినా. అదన ప్రసంగి అంటే మాట్లాడే దానికంటే ఎక్కువగా ప్రజల్ని విసిగిస్తాననా. శుభ్రంగా అడిషనల్ స్పీకర్ అనొచ్చుగదా. అలాగే వ్రాసి చ్చాము కూడా. ప్రజల్లో నాకెంత షేమ్" అన్నాడు.

తరువాత మాట్లాడుతూ, "నేను తెలుగు లాంగ్వేజ్ అభివృద్ధికి ఎంతగానో పాటు పడ్డాను. ఎలిమెంటరీ స్కూళ్లో క్లాసులు పూర్తిగా తెలుగు లాంగ్వేజ్‌ని ఉంచాలని నిరాహార దీక్ష చేసాను. స్కూలు ఫైనలు వరకు తెలుగు ఒక లాంగ్వేజ్‌గా కంపల్సరీగా ఉండాలని స్ట్రైక్ చేసాను. ఇకపోతే స్కూలు చిల్డ్రెన్‌కి సాయంత్రం పూట ప్రత్యేక తెలుగు క్లాసుల్ని ఏర్పాటు చేసాను. ఫ్రెండ్స్ నాకృషిలో మీకు ఏ లోపమైనా కనబడిందా. అమెరికా నుంచి మన తెలుగు పిల్లలు ఇంత దూరం తెలుగును వెదుక్కుంటూ వచ్చా రంటే, తెలుగుమీద వాళ్లకున్న ఇంట్రెస్టుకు నేను వాళ్లకు థాంక్సు చెబుతున్నాను". ధారాళంగా మాట్లా డుతున్న అతని ఉపన్యాసం మధ్యలో ఆగడానికి కారణం, జనంలోంచి ఎవరో విసిరిన రాయి.

"ఎవరా యూజ్లెస్ ఫెలో, నా మీద స్టోను విసిరింది" అంటూ మండి వడ్డాడు. తరువాత వేదిక దిగాడు.

"ఇప్పుడు ప్రత్యేక ప్రసంగి పరంధా మయ్య తమ అభిప్రాయం తెలియజేస్తారు "అన్నాడు.

'ఐ లవ్ యు డియర్' అన్న నలుపు రంగు అక్షరాలు వ్రాసిన ఎర్ర బనీను వేసుకుని, మోకాలు క్రింద వరకు నిక్కరున్న బెర్ముడా ధరించి, ఆఫ్రికన్ స్టైలు క్రాపుతో ఉన్న పొట్టి వ్యక్తి పరంధామయ్య స్టేజి ఎక్కాడు.

నా కొక ఇంపార్టెన్సు ఇచ్చి, నన్ను స్పెషల్ స్పీకరుగా ఈ 'తెలుగు అభివృద్ధి సభ' కు ఆహ్వా నించినందులకు చాలా సంతోషం. మన తెలుగు ఏమైపోతోంది. ఇండియాలో హిందీ తరువాత, తెలుగు భాష ఎక్కువగా మాట్లాడుతున్నారని కొందరంటే, మరి కొందరు వరల్డ్‌లో మాట్లాడే భారతీయ భాషల్లో తెలుగే ఎక్కువమంది మాట్లాడు తున్నారని సెన్సెస్ తీసారు. తెలుగంటే నాకు ఎక్కువ లవ్. నా బనీను మీదున్న 'ఐ లవ్ యు డియర్' అంటే ఎవరా డియర్ అను కుంటు న్నారు. ఆ నా లవ్లీ డియర్ తెలుగే. ఇలా ఇంటా, బయటా, వంటింలోనూ, వంటి పైనా తెలుగునే పేమిస్తున్నాను. తెలుగునే ఆరాధి స్తున్నాను. నా జీవితమే తెలుగు. నా లైఫే తెలుగు. నా నిద్ర తెలుగు, నా భోజనం తెలుగు, నా నేల తెలుగు. నా నాలుక తెలుగు.

'రేయ్. ఇక చాలుగాని ఆపరా' అని ఎవరో జనంలోంచి అరిచే సరికి పరంధామయ్య వాగ్ధాటికి భంగం కలిగింది. కోపంతో ఊగి

పోయాడు. కళ్ళు ఎర్రబడ్డాయి. "హూ డేర్ మి టు స్టాప్ స్పీచ్" అంటూ అరిచాడు. "ఎవడా మొనగాడు. ఈ స్టేజిమీదనే తేల్చుకుందాం. రెజిలింగుకు నేను సై" అన్నాడు.

అధ్యక్షులవారు బ్రతిమాలిన మీదట చల్లబడి, ఆవేశం అణచుకుని వేదిక దిగి క్రిందికి వెల్లాడు.

"అతిథి ప్రసంగి, అమరనాథయ్య ఇప్పుడు మాట్లాడుతాడు" అన్నారు అధ్యక్షుల వారు.

"అయ్యా. నా పేరు అమరనాథయ్య. అడిషనల్ స్పీకర్‌ని. ఈరోజు తెలుగుకు ఏర్పడిన గ్రహస్తితి చూస్తుంటే నిండా ఏడుపొస్తుందయ్యా. ఇంట్లో వీపింగే, బయటా వీపింగే. ఎవరుకు సెప్పుకొనేది. తెలుగమ్మకు జరిగిన అన్యాయాన్ని. ఆ తెలుగమ్మకు ఈ ప్రెపించకంలో పాతిక కోట్ల మంది బిడ్డలున్నారు. పదమూడు కోట్లమంది జెంట్సు ఉంటే, పన్నెండుకోట్లమంది లేడీసు న్నారు. అయితే ఏం, ఆ తెలుగు మమ్మీని ఇతర బాసల కోరల్లోంచి లాగ్గలుగుతున్నామా, కొన్ని కంట్రీస్‌లో చూడండి, వాళ్లకు వాళ్ల మాతృబాస తప్ప, ఇంగ్లీసు, మరే బాసా రాదయ్యా. మనుమూ ఉండాము దేనికా. ఇంగ్లీసు సదువు కుంటే ఎంప్లాయిమెంటుంటదని సెబుతున్నారబ్బాయ్యా, నువ్వు ఇంగ్లీసే నదూకో నేను కాదన్లా కాని మన మదర్ టంగుందే తెలుగు, దాన్ని వదల బాకండయ్యా. నేను పిలకాయలక్కూడా సెబుతుంటా. ఒరే బ్రిటీషోడు మనమీద ఇంగ్లీషు రుద్ది పోయి మనకు మంచి పనే సేసిండు. వాడి పున్నాన ఊరు వాడా ఇంగ్లీసు ఇత్తనాలు పెపంచ మంతా నల్లిపోయిండు. అది పెరిగి పెద్దదై సెట్లయి పండ్లు కాసి ఇత్తనాలు మొత్తం బూగోళ మంతా నిలబడి పోయింది. ఇప్పుడు ఇత్తనాలను ఏరి పారెయ్యడానికి సాద్దెం కాదు.

పల్లెల్లో ఇంకా కొద్ది కొద్దిగా తెలుగు మిగిలుందంటే కారణం, సొతంత్రం రావడం. నేను తెలుగు బాస కోసం సత్తా. తెలుగు అక్షరాల కోసం ఇంకా బతికే ఉంటా. పెజలారా. రోడ్లో, బస్టాండుల్లో, బస్సుల్లో, రైళ్లలో, రైల్వే స్టేషన్లలో మన తెలుగుకు బాగా పెబ్లిసిటీ ఇద్దాం. తెలుగు మీటింగులు పెడదాం. ఆ మీటింగుల్లో ఒక్క వరదంటే, ఒక్కవరదు కూడా ఇతర బాసలు మాట్లాడొద్దు. తెలుగు మన సంపద. మన గోల్డు నాయనా. దాన్ని మరిసి పోబాకండి. తెలుక్కే నా వోటు'

"ఇంత వయసొచ్చి బుద్ధిలే. ఇదేనా నువ్వు మాట్లాడే తెలుగు" అంటూ ఆడవాళ్ళు అరిచారు.

"ఏయ్ షటప్ యువర్ మౌతులు. ఏంటి మీరు సెప్పేది. నే నిప్పటి దాకా మాట్లాడింది తెలుక్కాదా. ఆరవమా. రేయ్ ఎక్కువ మాట్లాడ బాకండి. నాలుకలు కట్ జేత్తా, రోడ్డుమీద తిరిగే డాంకీస్ మేలురా మీకంటే. నాయనలారా. నేను సెప్పాల్సింది సెప్పినా. తెలుగును అక్కున జేర్చు కుందా. ఇంటింటా బీరువాలో దాచుకుందా. సరేనా" అంటూ వేదిక దిగాడు.

అంతా మాట్లాడిన తరువాత సభాధ్యక్షుల వారు తన ఆవేదనను వెళ్లబోసుకున్నారు.

"మేము అమెరికాలో ఉండి తెలుగు భాషాభివృద్ధికి నానా బాధలు పడుతున్నాం. నాగరికత అంటని మారుమూల గ్రామాల్లో అస లైన స్వచ్ఛమైన తెలుగు ఇంకా బ్రతికే ఉందను కున్నాం. ఇక్కడ మీకు 'తెలుగు మహావీర', "తెలుగు వీర', 'తెలుగువెలుగు', 'తెలుగు తేజం', 'తెలుగు కిశోర లాంటి బిరుదులిచ్చి, ఇంకా గ్రామాభివృద్ధికి పెద్దగా ధన సహాయం కూడా చేయాలనుకున్నాం. కాని ఇక్కడ పరిస్తితి చూసుంటే చాలా ఘోరాతిఘోరంగా ఉంది. మీరు 'తెలుగు హింస' , 'తెలుగు ఖూనీ ' తెలుగు ద్రోహి', 'తెలుగు నీచ' లాంటి బిరుదులకు అర్హులు. గతంలో పల్లెల్లో చద్దన్నంలోకి, పచ్చి మిరపకాయనంచుకొన్నట్లు, వేడి వేడి అన్నం లో ఆవకాయ కలుపుకుని తిన్నట్లు, మీరు ప్రతి తెలుగు వాక్యంలో ఇంగ్లీషు పదం కలపందే మాట్లాడలేకున్నారు.

మాకు విషయం అర్థమయింది. మారు మూల గ్రామాల్లోనే ఇలా ఉంటే, ఇక పట్టణాల్లో చెప్పాల్సిన అవసరమేముంది. అక్కడ ఆంగ్ల పదజాలం విచ్చలవిడిగా ఉంది. కాబట్టి మేమ నుకున్న వ్యవహారం తిరగబడింది. కనుక మేము మీకు ఇవ్వాలనుకున్న ఆర్థిక సహాయాన్ని గ్రామాభివృద్ధికంటే, భాషాభివృద్ధికి ఖర్చు పెట్టాల నుకుంటున్నాము. మేము అమెరికా వెళ్లిన తరువాత ఈ డబ్బుతో ఆంగ్లపదాలు కాని, మరే ఇతర భాషా పదాలు కాని కలపని కొన్ని వేల తెలుగు వాక్యాలను తయారుచేస్తాం. అవి పుస్తక రూపంలో ప్రచురించి గ్రామీణ ప్రజలందరికీ పంచుతాం. అవి చదివి మీరు తెలుగు అభ్యాసం చేయండి" అంటూ ముగించాడు అధ్యక్షుడు.


ఇంతలో అధ్యక్షుని ప్రక్కన కూర్చున్న అమెరికా తెలుగాయన లేచి, "అయ్యా, మేమే మీరు మాట్లాడుతున్నప్పుడు, పాముల్ని విసిరాం, రాళ్లను వేసాం, ఉపన్యాసం మధ్యలో కేకలు వేయించాం. ఎందుకంటే ప్రేమ ఎక్కువయిన ప్పుడు, తనకు అవమాన మయినప్పుడు మనిషి అసలు భాషలో మాట్లాడి, తానెవరో రుజువు చేస్తాడు. కాని మీరు ఆ సందర్భాల్లో కూడా, ఆంగ్లభాషలోనే కోప్పడ్డారు, ఆ భాషలోనే ఆవేశ పడ్డారు. ఆ భాషలోనే అరచారు. గుండెల్ని కమ్ము కుని ఉండాల్సిన మాతృభాష ఏమయింది?

ప్రసంగి ప్లాస్టిక్ పాము పైన పడ్డప్పుడు, 'స్నేక్. స్నేక్' అంటూ అరిచాడే తప్ప, "పాము. పాము" అని అరవలేదు. ఎందుకని? ఇదేనా మీమాతృభాషాభిమానం"

ప్రసంగి ముందుకు వచ్చి "అయ్యా. మా ఊరి వారికి పామంటే అర్థంకాదని, స్నేక్. స్నేక్. అని అరిచాను. అంతేతప్ప, నాకు మాతృ భాషాభిమానం లేకకాదు" అన్నాడు.

"నో, ఇదంతా అబద్ధం. తెలుగు ఎక్క డికీ పోలేదు. మనమే ఇంగ్లీషు మోజులో పడి, తెలుగును దూరం చేసుకుంటున్నాం. మనం చిన్నప్పుడు రాళ్లతో మామిడి కాయలు కొట్టాం, చింతకాయలు కొట్టాం. పొలంలో మేపుతున్న పశువుల్ని తరిమాం. అలా మన జీవితంలో పెన వేసుకుపోయిన రాయిని, అదన ప్రసంగి. "స్టోన్" అన్నాడు. దీన్ని బట్టే తెలుస్తున్నది "మనం రాతి యుగంలో ఉన్నామని". మరి ప్రత్యేక ప్రసంగి, శ్రోతలను "డాంకీస్" అన్నాడు. ఎవరు గాడి దలు? వింటున్న ప్రజలుకాదు. స్వచ్ఛమైన తెలుగు మాట్లాడలేని మనం గాడిదలం" అంటూ ఆవేశంగా చెప్పి కూర్చున్నాడు ఆయన.

"అందుకే మనం తెలుగు ఆటలు ఆడుదాం. తెలుగు భాషను మాట్లాడుకుందాం. తెలుగు పాటలు పాడుకుందాం. మా ఆశయం నెరవేర లేదు. గ్రామాల్లో మూడురోజులు ఉందామనుకున్న మాకు నిరాశే మిగిలింది. అందుకే మేము రేపే తిరిగి వెళ్లి పోతున్నాం. ఈ రెండు రోజులు మామా ఊళ్లలో గడిపి తిరిగి అమెరికా వెళ్లిపోతాం" అన్నాడు అధ్యక్షునికి ఇంకొకవైపు కూర్చున్నాయన.



బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93903 00157

10. జ్ఞాన జీవనది.

మరణం తర్వాత జననం:

మనిషి చనిపోయాక అతని శరీరంలోని మిగిలిన గాలి, నీరు, నేలలాంటి భూతాలన్నీ ఆయా భూతాల్లో లీనమై పోతాయి. శరీరం మార్పు చెందుతుందే కాని, నశించదు. నామ రూపాలు మార్చుకుంటుందే కానీ, రూపుమాసిపోదు. కానీ, మనిషిలోని మూల విజ్ఞానం ఏమవుతుంది? అతను సాధించిన లేదా ఆర్జించిన విజ్ఞానశక్తి లేదా జ్ఞాపకశక్తి ఏమవుతుంది? అంతరించి పోతుందా? అసలు ఏ వస్తువుగాని, ఏ శక్తి గానీ నశించదు. ఈ సృష్టిలో నశించేది ఏదీ లేదు. లేనప్పుడు ఈ జ్ఞాపకశక్తి ఏమవ్వాలి? ఎటు పోవాలి? అది ఏ రూపంలోకి మారాలి?

ఇదీ...మన ముందు ఉండే ప్రశ్న.

ఏదీ నశించదూ, ఏదీ శాశ్వతంగా మారకుండానూ ఉండదూ అనే ఆలోచనే బౌద్ధాల్ని పునర్భవం వైపు నెట్టింది. –

"ప్రతిక్షణం చ నవ లక్షణాని ప్రవర్తంతే...క్షణభంగురశ్చ ప్రతీత్యా సముత్పాదః" – అన్నాడు యోగాచార భూమిలో అసంగుడు.

ప్రతిక్షణం మారుతూ కొత్త లక్షణాలతో ప్రవర్తిల్లేదే ఈ సృష్టి ప్రవాహం. కానీ...

'ఈ ఆలయ విజ్ఞానం మాత్రం మరణించిన మనిషి నుండి మరో మనిషికి బదిలీ అవుతుంది' అని చెప్పారు బౌద్ధులు.

ఎలా అవుతుంది?

దీనికి కొంత సమాచారాన్ని ప్రోది చేశారు. మరణంతో భవచక్రం (పుట్టుక చక్రం) ప్రారంభించారు. జీవి పుట్టుకకు ఇలా ఒక భూమిక తయారు చేశారు.

ఒక స్త్రీ ఉంటుంది. ఒక పురుషుడు ఉంటారు. వారిద్దరూ సంయోగ క్రియలో పాల్గొంటారు. స్త్రీకి అండం విడుదల అవుతుంది. పురుషునికి శుక్రం విడుదల అవుతుంది. ఆ రెండూ గర్భంలో కలుసుకుంటాయి – దీన్నే......ఇలా చెప్పారు...

1 స్త్రీ ఋతుమతి కావాలి (శోణితం అంటే అండం ఉండాలి)

2. పురుషుడు బీజవంతుడై ఉండాలి (శుక్రం ఉండాలి) అన్నాడు అనంగుడు.

3. ఈ శుక్లశోణితాలకు తోడు గంధబ్బం (గంధర్వం) ఉండాలి.

4. యోని, బీజం, కర్మ వీటిల్లో ఏ దోషం లేకుండా ఉండాలి.(అండోత్పత్తి, శుక్రకణాల కౌంట్, సంపర్కం చెందే విధానం, సంపర్క కర్మదినాలు – 'ఈ మూడూ దోష రహితంగా ఉండాలి.)

అలాంటి స్థితిలో కలసిన శుక్ల, అండ కణాలకి తోడుగా ఉండాలన్న 'గంధబ్బ'మే ఆలయ విజ్ఞానం.

ఎక్కడో చనిపోయిన వ్యక్తిలోనించి నశించని 'ఆలయ విజ్ఞానం' ఒక మెరుపు వేగంలో ప్రయాణించి బైటకు వెళ్ళి పోతుంది. ఏదో ఒక గర్భంలో కలుస్తున్న శుక్లశోణితాలకు తోడుగా చేరుతుంది. అది వెళ్ళి చేరగానే ఆ మూడూ – శుక్లం + అండం + గందబ్బం – కలసి పిండంగా రూపొందుతాయి – ఇదీ బౌద్ధులు చెప్పిన మరణ – జనన ప్రక్రియలు.

ఇక్కడ మరణం మూలం. జననం కాదు. మరణం తర్వాత జననం.

మనో ప్రవాహం:

మరణం అంటే..."మనస్సు (ఆలయ విజ్ఞానం) ఒక శరీర ప్రవాహంలో నుండి ఒక మనోప్రవాహంలోకి మారడం" అంటారు బౌద్ధ విజ్ఞానవాదులు.

అంటే క్షణక్షణం మారే శరీరం ఒక ప్రవాహం లాంటిది గదా! ప్రవాహంలోని నీరు ప్రతిక్షణం మారుతూ కదిలిపోతున్నప్పటికీ ఆ ప్రవాహం లేదా నది అలా నిండుగానే ఉంటుంది. ఆ శరీరం కూడా అంతే. క్షణక్షణం మారుతూ ఉన్నా శరీరంగా బ్రతికే ఉంటుంది.– మనో ప్రవాహంలోకి మారుతుంది.

మనో ప్రవాహం(శరీరం నుండి బైటపడ్డ విజ్ఞానం) ఈ అంతరాళంలో ప్రయాణం చేస్తూ ఉంటుంది. ఒక ప్రవాహంలా తిరుగుతూ ఉంటుంది. మనస్సు మనస్సుగానే ఉంటుంది. ఏలాంటి ఇతర శరీరాల, భూతాల సంపర్కంతో ఉండదు. అంటే... విజ్ఞానం (జ్ఞాపకశక్తి) శక్తి రూపంలో ఉండి ప్రవహిస్తూ ఉంటుంది. అది శుక్ర అండ కణాల సంయోగం కోసం అన్వేషిస్తూ ఉంటుంది.

ఇలా ఒక వారం రోజుల వరకూ తనకు తానుగా మనో ప్రవాహంగా ఉంటుంది. ఈ వారం రోజుల్లో ఏక్షణంలోనైనా ఎక్కడో ఒక చోట సంయోగం చెందిన స్త్రీ, పురుష బీజ కణాలతో కలిసిపోతుంది.

ఇలా విజ్ఞానం తనకు తానుగా ఉండే స్థితిని మనోస్థితి, లేదా అంతరాభవం లేదా మనోమయం అంటారు బౌద్ధులు.

ఇక జననం అంటే...

"ఒక మనో ప్రవాహం...శరీర ప్రవాహంలోకి మారడమే జననం. బౌద్ధంలో స్త్రీ పురుష కణాల్ని 'బీజ' కణాలుగా చెప్పరు. మనో విజ్ఞానాన్నే 'బీజం'గా చెప్తారు. అందుకే ఆలయం విజ్ఞానాన్ని 'బీజ విజ్ఞానం' అని అంటారు.

అంటే...

స్త్రీ, పురుష శుక్లశోణిత కణాలకి తోడుగా 'బీజ విజ్ఞానం' వెళ్ళి కలవడమే – జీవ సృష్టికి ఆరంభం. అప్పుడు ఆ కణాలు ఈ గంధబ్బంతో కలసి పిండంగా మార్పుచెంది, శరీర ప్రవాహాన్ని ప్రారంభిస్తాయి. ఆ పిండం పెరిగి పెద్దదై పుట్టి గిట్టే వరకూ ఆ ఆలయ విజ్ఞానం (బీజ విజ్ఞానం) ఆ శరీర ప్రవాహంలోనే ఉంటుంది. ఆ ప్రవాహంలో ఉన్నప్పుడు మరికొంత జ్ఞానాన్ని పొంది, దాన్ని విజ్ఞానంగా మార్చుకొంటుంది. మరింత ప్రజ్ఞావంతం అవుతుంది. అలా ఆ ప్రజ్ఞ ప్రతి క్షణం పెరుగుతూ, మారుతూనే ఉంటుంది.

మనుషుల్లో పెరిగిన వైజ్ఞానిక వికాసం ఇలాగే జరిగింది అనేది బౌద్ధ విజ్ఞాన వాదుల వాదాన్ని బట్టి తెలుస్తుంది.

ఎంతవరకు అంగీకారం:

దీన్ని ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఎంతవరకూ అంగీకరిస్తుంది? అనేది ఇప్పుడున్న ప్రశ్న!

విజ్ఞానం శక్తా? పదార్థమా? అనేది తేల్చాలి. అది శక్తి అయినా, పదార్థం అయినా నశించడానికి వీల్లేదు. ఏదొక రూపంలోకి మారాలి. ఇది అసంబద్ధం కాదు. అశాస్త్రీయం కాదు. ఇప్పటికిప్పుడు అంగీకరించేదీ కాదు...

ఎందుకంటే...

ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో – ఇక్కడ చెప్పిన 'గంధబ్బానికి' చోటులేదు. స్త్రీ పురుష బీజకణాల్లో క్రోమోజోములు (ఎక్స్, వై), దానిలో డిఎన్ఎ. సృష్టి కార్యానికి జీవి జననానికి మూలం. తరతరాల నుండి...వేలు లక్షల సంవత్సరాల నుండి మానవుని విజ్ఞానాన్ని ఈ డిఎన్ఎ పదిల పరస్తూ తీసుకొస్తుంది. భౌతిక పరివర్తనలకీ, వైజ్ఞానిక పరివర్తనలకీ డియన్ఏనే మూలం. బీజం ఇదే. డిఎన్ఎ అంటేనే విజ్ఞాన ప్రవాహం. ఇంకా చెప్పాలంటే జీవప్రవాహం.

పంచభూతాలతో ఏర్పడ్డ శరీరానికీ, మెదడుకీ డిఎన్ఏనే బీజం–

ఇలా...తల్లిదండ్రుల నుండి డిఎన్ఎ ద్వారా జ్ఞానం నూతన జీవికి సంక్రమిస్తుంది. పుట్టాక సమాజం నుండి సంక్రమిస్తుంది. తర్వాత ఆ జీవినుండి సంతానం పొందిన మరో జీవిలోకి ప్రవహిస్తుంది.

ఇదీ ఇప్పటి విషయం.

ఇక్కడ కొద్దిగా చర్చించాలి.

సుందరి– సుబ్బారావు–సురేఖ:

సుందరి, సుబ్బారావు అనేవారు భార్యాభర్తలు. వారికి ఒక అమ్మాయి. పేరు సురేఖ. సుబ్బారావుకీ, సుందరికీ వారివారి తల్లిదండ్రుల నుండి కొంత విజ్ఞానం వారివారి డిఎన్ఎల ద్వారా సంక్రమించింది. వారికీ సంతానం కలిగింది. అంటే వారిద్దరి డిఎన్ఎలు కలసి వారి అమ్మాయి సురేఖగా రూపొందాయి. సురేఖ పుట్టేనాటికి సుందరికి 22, సుబ్బారావుకి 24 ఏళ్లు అనుకుందాం. వీరిద్దరి డిఎన్ఎలలో వారివారి తల్లిదండ్రుల్నుండి వచ్చిన విజ్ఞానంతోపాటు 22 ఏళ్ళలో సుందరి, 24 ఏళ్ళలో సుబ్బారావులు స్వంతంగా సంపాదించుకున్న విజ్ఞానం కూడా ఉంటుంది. అలా సురేఖకి వారసత్వంగా కొంత విజ్ఞానం వచ్చింది.

ఇప్పుడు చూడండి...

సుబ్బారావు తన విజ్ఞానాన్ని తన బిడ్డకి పంచి ఇచ్చినా అతని విజ్ఞానానికి వచ్చిన తరుగుదల ఏమైనా ఉందా? లేదు. ఇంత వరకూ బాగానే ఉంది.

సురేఖ పుట్టాక ఇక సుబ్బారావు ఎలాంటి విజ్ఞానాన్ని సంపాదించుకోలేదా? ఎందుకు సంపాదించుకోడు. ఎన్నేళ్ళు బతికితే అన్నేళ్ళ విజ్ఞానాన్ని సంపాదించుకుంటాడు. ఆ విజ్ఞానాన్ని ఇక సంతాన రూపంలో పంచి ఇవ్వడనుకుందాం. అప్పుడు అతను సంపాదించిన విజ్ఞానం సమాజంలో కొందరికి అందిస్తాడు. అలా ప్రసారం అవుతుంది. నిజమే! బిడ్డలకి డిఎన్ఎ ద్వారా పంచినా, సమాజానికి అనేక క్రియలద్వారా పంచినా అతని విజ్ఞానానికి వచ్చిన నష్టం ఏమీలేదు.

తన 82వ ఏట సుబ్బారావు చనిపోయాడనుకుందాం. అప్పుడు అతనిలోని జ్ఞాపకశక్తి, విజ్ఞానం ఏమవుతుంది? విశ్వంలో చరిస్తో వుందా? చరించి చరించి భౌతిక రూపం తీసుకుంటుందా? ఏ శక్తిలో విలీనం అవుతుంది?

చనిపోయాక శారీరక పదార్థాలు మట్టిలో కలుస్తాయి. లేదా బూడిదగా మారతాయి. అది సరే – మరి విజ్ఞానం ఏమవుతుంది?

ఈ ప్రశ్నే బౌద్ధుల్ని పునర్భవం వైపు నడిపించింది.

నిత్య జీవితంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులు తారసపడతాయి.

అక్షర జ్ఞానం లేని తల్లిదండ్రుల కడుపున మహా పండితుడైన వాడు పుడతాడు. సాధారణ వ్యక్తులకి గొప్పచిత్రకారుడు పుడతాడు. సంగీత జ్ఞానం తెలియనే తెలియని వారి కడుపున మహా సంగీత జ్ఞానులు పుడతారు. – ఇదెలా సాధ్యం? పుట్టుకతోనే ఈ సృజన ఎలా వస్తుంది. ఒక మహోపాధ్యాయుడు బోధించిన పిల్లలంతా ఒకే తీరున జ్ఞానులు కాలేరు. ఒకే తల్లిదండ్రులు ఒకే క్రమశిక్షణతో పెంచిన పిల్లలందరూ ఒకే రీతిగానూ ప్రవర్తించరు. కవల పిల్లలేకాదు, తలలు రెండూ అతుక్కుపుట్టిన పిల్లల్లో సైతం భిన్న మనస్తత్వం ఉంటుంది.

కొందరు పుట్టుకతోనే సౌమ్యులుగా ఉంటారు.కొందరు చెబితే

వింటారు. కొందరు ఎంత చెప్పినా చెవికెక్కించుకోరు. కొందరు వద్దంటే చేస్తారు – ఇలాంటి చర్యలన్నీ పెరిగి పెద్దయ్యాక చేస్తే ఆశ్చర్యం లేదు. మూడేళ్ళలోపు పిల్లల్లోనే ఇలాంటి ప్రవర్తనలు చూస్తాం.

'ఇలాంటి ప్రత్యేకతలకి కుటుంబ, సామాజిక నేపథ్యాలు వుండవు' అని చెప్పడం తప్పే అవుతుంది. కానీ, పుట్టుకతోనే కొన్ని స్వభావాలు ఉంటాయి – స్వభావం పదార్థానికి చెందిందా? మనస్సుకు చెందిందా?

కొందరిలో కనిపించే ఈ ప్రత్యేక నైపుణ్యాలే బౌద్ధుల్ని అలా ఆలోచింపచేశాయా? –

"తెలివి హీనులైన తల్లిదండ్రులకు మహా గణిత విశారదుడు ఎలా పుడతాడు?" అని బౌద్ధులు ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు జవాబుగా వారు 'పునర్భవం' చెప్పారు.

'పునర్భవం' ఒక నమ్మకం కాదు:

పునర్జన్మలా పునర్భవ సిద్ధాంతం నమ్మకం కాదు. ఒక శాస్త్రీయ అంశాన్ని ఆలంబనగా రూపొందించుకున్న విషయమే.

మనం ఒక మాట మాట్లాడతాం. అది ఒక శక్తి. ఆ శక్తి గాలిలో తరంగాలుగా ప్రయాణం చేస్తుంది. శక్తి కాకపోతే తరంగాలు సృష్టించలేదు. తరంగాల్ని కదిలించలేదు. ఆ తరంగాలు కదిలిపోతూ మన చెవిని పడతాయి. మనం వింటాం. ఆ మాటలు ఏ ఒక్కరి కోసమో పలికినా వినేది ఆ ఒక్కడే కాదు. ఆ తరంగాలు ప్రయాణం చేసే దూరం వరకూ వినే అవకాశం ఉంది. మన చెవులు కొంత తీవ్రతగల శబ్దాల్నే గ్రహిస్తాయి కాబట్టి ఆ తరంగాలకి ఆ తీవ్రత ఉన్నంత ఉన్నంత వరకూ మనం వినగలుగుతాం. ఇంకా తేలికపాటి తీవ్రతగల శబ్దాలుగా అవి మారాక అవి మనకు వినిపించక పోయినా ఆ శబ్దాల్ని వినే జీవులు కొన్ని ఉన్నాయి. అవి వింటాయి.

'ఆ ధ్వని' ఏమైపోతుంది! ఆ శక్తి ఏమైపోతుంది?

ఆ ధ్వని పుట్టినప్పుడు రికార్డ్ చేసే మొదటి పరికరం మన మెదడే. ఆ తర్వాత టేప్ రికార్డర్‌లు, గ్రాంఫోన్ రికార్డులు…కంప్యూటర్‌లు ఇలా రకరకాల సాధనాలు వచ్చాయి. వాటిని రికార్డ్ చేసి మరలా మనకు కావలసినప్పుడు వింటున్నాం. (ఇదీ ఒక జ్ఞాపకశక్తే. జ్ఞాపకశక్తి అనేది ఈ విశ్వలక్షణాల్లో ఒకటి. ఈ ప్రధానంగా కార్బన్ మూలకం ఈ జ్ఞాపక శక్తికి కారణం. ఆ తర్వాత సిలికాన్‌కు కూడా ఆ శక్తి ఉంది.) కానీ…ఆ ధ్వని చివరికి ఏమవుతుంది? ఆ ధ్వని శక్తి ఎలా మారిపోతుంది? ఎక్కడ అంతం అవుతుంది?

అంతం మాత్రం కాదు. ఎందుకంటే శక్తి నశించదు. ఏదో ఒక రూపంలో వ్యక్తం కావాలి.

త్వరలో అలాంటి ధ్వనుల్ని గ్రహించే సాధనాలు రాబోతున్నాయి అంటున్నారు. అది గొప్ప ఆవిష్కరణ అవుతుంది. …..కాంతి సంవత్సరాల దూరం నుండి వచ్చే ధ్వనుల్ని రికార్డ్ చేస్తున్నారు.

అలాగే…మరణించిన వ్యక్తిలోని విజ్ఞానశక్తిని రికార్డ్ చేయగలిగే సాధనాలు వస్తే – ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

మెదడులో జ్ఞాపకశక్తి అంటే విద్యుదయస్కాంత కణాల అమరిక అని భౌతికంగా నిర్వచించుకుంటే సరిపోదేమో! ఒక అమరిక ఉంది, దీన్ని మరో అమరికలోకి మారిస్తే మరో విషయానికి 'సంజ్ఞ' అవుతుంది. '9'ని తిరగేస్తే '6' అవుతుంది. అంకెల్లో '7' తిరగేస్తే ఇంగ్లీషులో L(యల్) అవుతుంది. అంతేగానీ దాని గుర్తింపుని కోల్పోదు. –

ఏదో ఒక నిర్మాణం ఒక విజ్ఞానశక్తికి సంకేతం. ఆ సంకేతాలు మారొచ్చు. విజ్ఞానమూ మారొచ్చు. కానీ నాశనం కాదు –

నాశనం కాబడితే అది శక్తీ కాదు, పదార్థమూ కాదు.

ఇలా 'ఆలయ విజ్ఞానం' ఆధునిక శాస్త్రంలో ఒక నూతన ఆవిష్కరణకు మార్గం కాగలదేమో!

సంధించే ప్రశ్న:

ఐతే, 'ఆలయ విజ్ఞానం' మీద సంధించే ప్రశ్న ఒకటుంది.

'82 ఏళ్ళ వ్యక్తిలోని బీజ జ్ఞానమైన ఆలయ విజ్ఞానం – ఒక కొత్త ప్రాణిలోకి బదిలీ అయితే – ఆ పుట్టిన కొత్త బిడ్డకు వెంటనే 82 ఏళ్ళ విజ్ఞానాన్ని అందుకుంటాడా? గంధబ్బగా మారిన విజ్ఞానం ఎందుకు 82 ఏళ్ళ విజ్ఞానంగా వ్యక్తం కాలేక పోతోంది? అనేది గట్టి ప్రశ్న! ఈ ప్రశ్నకి బౌద్ధం దగ్గర జవాబు లేదు. – (ఉందేమో! నాకు తెలియదు)

నిజానికి …

ఆధునిక విజ్ఞానం కూడా ఈ విషయంలో ఇంతవరకు తేల్చిచెప్పలేదు. తల్లిదండ్రుల్నుండి శారీరక లక్షణాలు మాత్రమే డి.యన్.ఏ. ద్వారా అనువంశికంగా సంక్రమిస్తాయి గానీ, జ్ఞానం సంక్రమించదు అనే ఇప్పటివరకూ ఉన్న ఆధునిక పరిశోధనలు తేల్చాయి.

అయితే మనోవైజ్ఞానికులు ఈ పరిశోధనల్ని ఒప్పుకోరు. జ్ఞానం కూడా అనువంశికమే అంటారు.

ఈ రెండు అభిప్రాయాలూ బలంగానే ఉన్నాయి. పునర్భవం, గంధబ్బం విషయంలో బౌద్ధం మనోవైజ్ఞానికుల కోవలో ఉంటుంది.

ఐతే…బుద్ధుడు చెప్పిన కాలామసుత్త అతిగొప్ప వైజ్ఞానిక దృక్పధానికి కొలబద్ద. ఈ విషయంలో దలైలామాను " బౌద్ధంలోని ఈ విషయం ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి సరిపోదుకదా? మీరేమంటారు? అని ప్రశ్నిస్తే… " అవసరం అయితే మార్చుకుంటాం" అని సమాధానం చెప్పారు.

ఒక్కటి మాత్రం వాస్తవం. జనన మరణ క్రియను ఇంత శాస్త్రీయంగా నిర్వచించిన తాత్త్విక దృక్పధం మాత్రం బౌద్ధంలో తప్ప మరో చోట కన్పించదు. ఈ విషయంలో బుద్ధుని తర్వాత కీర్తించాల్సిన బౌద్ధ దార్శనికుల్లో మైత్రేయుడు, వసుబంధు, అసంగుడు, దిగ్నాగుడు, ధర్మకీర్తి, శాంతిరక్షితులు ముఖ్యులు.

బౌద్ధుల ఈ పునర్భవ సిద్ధాంతం....
వైజ్ఞానిక భౌతిక వాద దృక్పధానికి పునాది.
శాస్త్రీయ దృక్కోణానికి హద్దులు లేని జలధి.
ఇది మనోవైజ్ఞానిక మహానిధి. ఓ…జ్ఞాన జీవనది.

(తరువాయి వచ్చే సంచికలో…)

ఒక పాఠ్యాంశం (సబ్జెక్టు)గా మాత్రమే తెలుగును ఉంచడమంటే, తెలుగును ఎదగకుండా నెత్తిన మేకుకొట్టడమే

- ఈమని శివనాగిరెడ్డి (స్థపతి)
98485 98446

విజయనగర చక్రవర్తుల బిరుదులు - 4



శ్రీకృష్ణ దేవరాయలు, తన వారసునిగా సవతి సోదరుడైన అచ్యుత రాయల్ని ప్రకటించాడు. 1529లో శ్రీకృష్ణరాయని మరణం తరువాత, వయసులో చిన్నవాడైన అచ్యుతరాయల్ని సింహాసనంపై కూర్చొబెట్టటం కృష్ణరాయని అల్లుడైన ఆళియ రామరాయలికి ఇష్టం లేదు. అయితే అచ్యుతరాయలి బావమరుదులైన సలకంరాజు సోద రులు, ప్రధాని సాళువనరసింగరాయలి సాయంతో, అచ్యుతరాయలు, తిరుమల వేంకటేశ్వరుని సన్నిధిలో నాటకీయ పరిణామాల నేపథ్యం లో పట్టాభిషిక్తుడై క్రీ.శ.1529 నుంచి క్రీ.శ 1542 వరకూ పాలించాడు.

అంతర్యుద్ధాలు, బహమనీలు, కుతుబ్‌షాహీలు, గజపతుల కవ్వింపులతో నిలా, బావ మరుదుల, స్వతంత్రత, రామరాయలు వ్యతిరేకతల నడుమ, అచ్యుతరాయలు పాలన ఒడిదుడుకులతో సాగిందని చరిత్రకారుల భావన. అచ్యుతరాయలికి అరిరాయ విభాడ, అష్టదిక్కురాయ మనోభయంకర, అక్షవీరరాయ మనోభయంకర, కఠారిసాళువ, కర్నాటరాజ్యలక్ష్మీమనోహర, నవకోటినారాయణ, పాండ్యరాజ్యపరిపాలన, పాండ్యరాజ్యస్థాపనాచార్య, పూర్వదక్షిణ సముద్రాధీశ్వర, భాషగెతపులవరాయరగండ, మూరురాయరగండ, యవనరాజ్యస్థాపనాచార్య, శ్రీవీరప్రతాప అనే బిరుదులను ధరించాడు. **సదాశివరాయలు** (క్రీ.శ.1543-65) : అచ్యుతరాయలి తరువాత అతనికొడుకు మొదటి వెంకటపతి రాయలు సింహాసనాన్ని అధిష్టించాడు. చిన్నవాడైన అతనికి మేనమామ సలకం చినతిరుమల రాజు, పాలనా బాధ్యతలను స్వీకరించాడు. అయితే తిరుమలరాజు స్వార్థ బుద్ధితో మేనల్లుణ్ణి చంపించి తానే రాజైనాడు. పరిస్థితులను గమనించి, అదును కోసం ఎదురు చూస్తున్న అళియ రామరాయలు, గుత్తి కోటలో బందీగా ఉన్న (అచ్యుతరాయలి అన్న కొడుకైన) సదాశివ రాయల్ని విడిపించి, సలకం తిరుమల రాజుపైయుద్ధం ప్రకటించి, అతన్ని చంపి, సదాశివరాయల్ని సింహాసనంపై కూర్చోబెట్టారు. సదాశివరాయలు రాజైనా పరిపాలన అంతా రామరాయలే చూచుకొనే వాడు. తనకు నమ్మకస్తులైన పెమ్మసాని, రావెల, కటకం, వెలుగోటి వారిని రాజోద్యోగులుగా నియమించాడు. ముస్లింలను సైనికులుగా చేర్చుకొన్నాడు. దక్కను సుల్తాన్‌లు, పోర్చు గీసువారి రాజకీయాల్లో తలదూర్చిన రామరాయలు, సుల్తాన్ కూటమి చేసిన తల్లికోట యుద్ధం లో క్రీ.శ.1565లో మరణించాడు. అతని తమ్ముడు తిరుమల రాయలు సదాశివుని ప్రతినిధిగా, పెనుగొండ నుంచి పాలించాడు. విజయనగరం పతనమైన తరువాత, శిథిలాల మధ్య అతను జీవిస్తూ క్రీ.శ. 1568 – 69 వరకూ నామమాత్ర పాలకుడుగా మిగిలి పోయాడు. దీంతో క్రీ.శ 1569లో తిరుమల రాయలు స్వతంత్రుడై పెనుగొండ నుంచి క్రీ.శ.1572 వరకూ పాలించాడు.

సదాశివరాయలికి ఇందువంశశిఖామణి, ఈశ్వరనరసింహ కుమార, ఉత్తరదక్షిణపశ్చిమచతుసముద్రాధీశ్వర, కఠారిసాళువ, కలియుగచక్రవర్తి, కేతవరంభూపతి, గజింఫగండభేరుంగ, చతు సముద్రాధీశ్వర, ధరణీవరాహ, పరదార సహోదర, పరరాయ భయం కర, పూర్వపశ్చిమదక్షిణోత్తర సముద్రైకనాయక, మూరురాయర గండ, మేదినియమాసరగండ, రాజకులతిలకచూడామణి, శనివార సిద్ధి, వీరప్రతాప, సత్యరత్నాకర, హరిభక్త సుధానిధి, హిందూరాయ సురత్రాణ బిరుదులను ధరించాడు.

పరిపాలనలో సదాశివరాయలకు సహకరించి డీఫాక్టో చక్రవర్తి గా చక్రం తిప్పిన అళియరామరాయలు కర్నాటరాజ్యశ్రీ స్థాపనా చార్య, మహామండలేశ్వర, హరిభక్త సుధానిధి, ఆదవాని దుర్గాప హరణ, ఆముదానగర సాలభంజన, ఇమాందనమలక మానమర్ధన, ఉద్దగిరి రాజ్యపాలక, ఓరుగల్లు నగరపోషణ, కన్యాకుమారి భీమరధి తటాంత నిక్షేప విజయస్థంభ, కర్ణాటకవర్గసద్ధంధ నాసిక, కలబుర్గి కోట పాటిన దుర్య, కణ్యాణ పురవరాధీశ్వరి, కళ్యాణ నగర సాధక, కొండవీటి దుర్గనాయక, కొండపల్లి హరణ, గోలకొండపురదూషణ, గుత్తిదుర్గ నిర్వేదన, చంద్రగిరి దుర్గ రాజ్యాధీశ్వర, జూలూరు సమర నిర్వాహక, పెనుగొండ దుర్గ సాధన, బరీదుబలహరణ, బెదదకోట నగరసింహ సింహాసన, బెలమకొండ వల్లభ, ముదుగంటి దుర్గాధి నాయక, యాదగిరి దుర్గభేదన, యేదులఖాను సప్తాంగ హరణ, రణరంగ రామభద్ర, రాచూరు రాజ్యహరణ, రాయదుర్గావన దురం ధర, విజయ చరిత, సింహాసనా భాస్కర, విజయనగర సింహాసనా ధీశ్వర అనే బిరుదులను వహించాడు.

అళియ రామరాయలి కుమారుడైన శ్రీకృష్ణప్ప రాయదేవున్ని రాజకరికంఠీరవ, రాజతేజోనిధి, రాజరాజాన్వయాభరణ అనే బిరు దులు వరించాయి. అచ్యుతరాయలి మేనమామ తిరుమల దేవరా యలు, మాన్యగజపతి అనే బిరుదును ధరించాడు. ఇతడే ఆరవీటి వంశస్థాపకుడు. తిరుమల రాయలి తరువాత అతని కుమారుడైన మొదటి శ్రీరంగ(దేవ)రాయలు క్రీ.శ 1585 నుంచి క్రీ.శ. 1585 వరకు పెనుగొండ నుంచి విజయనగర రాజ్యాన్ని పాలించాడు. ఇతని కాలంలో కులీకుత్‌షా కొండవీడును, బీజాపూరు సుల్తానైన ఆదిలాషి కర్నూలును స్వాధీన పరచుకొన్నారు. ఇతనికి మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, వీరప్రతాప, అనే బిరుదులున్నాయి. మొదటి శ్రీరంగ రాయలి తరువాత అతని సోదరుడైన రెండో వెంకటపతి రాయలు క్రీశ.1585 చక్రవర్తి అయి, క్రీ.శ 1614 వరకూ పాలించి, విజయ నగర సామ్రాజ్యానికి గత వైభవ ప్రాభవం విజయనగర సామ్రాజ్యానికి గత వైభవప్రాభవాలను సంతరింప చేశాడు. ఇతడు కవులను పోషిం చాడు. ఇతనికి చతుసముద్రాధీశ్వర, రాజపరమేశ్వర, వీరప్రతాప అనే బిరుదులున్నాయి. చివరిపాలకుడైన శ్రీరంగరాయలకు కూడ దాదాపు ఇవే బిరుదులున్నాయి.

చలసాని నరేంద్ర
9849569050

ఆర్థిక ప్రగతి ఎవ్వరి కోసం? వృద్ధి రేటు ఏ ప్రగతికి కొలమానంగా ! ?



ఈ ఏడాది అత్యంత వృద్ధిదాయక ఆర్థిక వ్యవస్థగా చైనాను భారత్ అధిగమించనున్నదని, బలమైన దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను కలిగి ఉన్న భారత్ ప్రస్తుతం సంస్కరణాత్మక ఆర్థిక వ్యవస్థగా కనిపిస్తున్నదని సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక తెలిపింది. ఈ క్రమంలోనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఈసారి చైనాను భారత్ వెనుకకు నెడుతుందన్న విశ్వాసాన్ని ఆ నివేదిక వ్యక్తం చేసింది.

2-3 శాతం జీడీపీ లక్ష్యంతో మిగతా దేశాలు ముందుకెళ్తున్న సమయంలో భారత్ మాత్రం 7.5 శాతం వృద్ధిరేటును దాటాలన్న టార్గెట్ పెట్టుకోవడాన్ని స్వాగతించింది. ఈ విధంగా ప్రశంసనీయమైన రీతిలో వృద్ధి రేటుసాధిస్తున్న భారత్ రెండున్నర దశాబ్దాల ఆర్థిక సంస్కరణల అమలు తర్వాత ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకొంటున్నది.

గత రెండు దశాబ్దాలలో భారత్ జిడిపి ఆరు రెట్లకు పైగా పెరిగిన్నట్లు దావోస్ లో

ప్రపంచ ఆర్థిక వేదిక ప్లీనరీ సమావేశంలో ప్రసంగిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ గర్వంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు అగ్రశ్రేణి అంతర్జాతీయ సంస్థల సీఈవోలతో మోదీ సమావేశమై భారత్ అంటేనే వ్యాపారమని, మా దేశంలో పెట్టుబడులకు పెద్ద ఎత్తున అవకాశాలున్నాయని గ్లోబల్ సీఈవోలకు పిలుపునిచ్చారు

పెట్టుబడుల ఆకర్షణలో ప్రపంచ దేశాలలో భారత్‌కు ఐదో స్థానం దక్కింది. పెట్టుబడుల ఆకర్షణ, ప్రపంచ ఆర్థిక ప్రగతిపై ఆశావహ దృక్పథంతో రికార్డు స్థాయిలో వృద్ధి చెందుతున్న భారత్ మార్కెట్‌కు తమ సర్వేలో ఐదో స్థానం లభించిందని గ్లోబల్ కన్సల్టెన్సీ సంస్థ ప్రైస్‌వాటర్ కూపర్స్ (పిడబ్ల్యుసి) తన అధ్యయన నివేదికలో పేర్కొంది.

నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజి లలో రూ 3.5 లక్షల కోట్లకు పైగా లాభాలు చేకూరినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ఇదంతా చూస్తుంటే భారత్ ఇప్పుడు స్వర్గాన్ని పోలిన్నట్లు భావించవలసి వస్తుంది. ఇక్కడ ప్రజలు ఎందరో సిరిసంపదలతో వెలిగిపోతున్నట్లు అభిప్రాయం కలుగుతున్నది. కానీ వాస్తవ పరిస్థితులు తీవ్ర ఆందోళనను, కలవరాన్ని కలిగిస్తున్నాయి.

మన దేశంలో ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను ఆక్స్‌ఫాం తాజా నివేదిక కళ్లకుకట్టింది. గతేడాది సృష్టించిన సంపదలో 73 శాతం అత్యధిక ధనవంతులైన ఒక శాతం ప్రజల చెంతకే చేరినట్లు వెల్లడించింది. అంతేకాదు 67 కోట్ల పేదల జనాభా సంపద కేవలం ఒక శాతమే పెరిగిందని తెలిపింది. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు మొదలవుతున్న నేపథ్యంలో 'రివార్డ్ వర్క్, నాట్ వెల్త్' పేరిట ఆక్స్‌ఫాం ఈ నివేదికను విడుదల చేసింది.

భారత్ లో కుబేరులు అపర కుబేరులవుతుంటే పేదలు కడుపేదలుగా మిగిలిపోతున్నారు. ఒక్క శాతమే ఉన్న అత్యధిక ధనవంతుల కోశాగారాల్లోకే నాలుగింట మూడొంతుల సంపద చేరిపోయిందని బయటపెట్టింది. పేదల విషయంలో ఈ పెరుగుదల నామమాత్రమేనని తేల్చింది. కోట్లాది మంది కడు పేదరికంలో అష్టకష్టాలు పడుతుంటే అపర కుబేరులు మరింత సంపదను వెనకేసుకునేందుకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎలా తోడ్పడిందో చూడండని గణాంకాలతో తెలిపింది.

ఈ గణాంకాలను చూస్తుంటే అభివృద్ధి అంటే ఏమిటి ? ఎవ్వరి కోసం ? అనే ప్రశంసలు తలెత్తుతున్నాయి. కేవలం జిడిపి, వృద్ధిరేటు పెరుగుదలలనే అభివృద్ధిగా పరిగణించాలా ? భారతీయ బ్యాంక్ లలో నిరర్ధక ఆస్తులు రూ 9.5 లక్షల కోట్ల మేరకు ఉన్నట్లు తాజా గణాంకాలు తెలుపుతున్నాయి. అంటే ప్రభుత్వం అరచేయి పెట్టి అడ్డుకోని పక్షంలో దేశంలో ప్రధాన బ్యాంక్ లు అన్నీ కుప్పకూలి, మూతబడడానికి సిద్దంగా ఉన్నట్లు అర్ధం అవుతుంది. మన మొత్తం ఆర్థిక వ్యవస్థ ఒక పెద్ద ప్రమాదం అంచున ఉన్నది.


మోడీ ప్రభుత్వం ఎంతో ఘనంగా అవినీతిని అరికట్టడం కోసం చేపట్టిన పెద్ద నోట్ల రద్దు వాస్తవానికి నల్లధనం మరింతగా పెంచడంతో పాటు, రాజకీయ బ్రోకర్లు విపరీతంగా లాభబడడానికి మాత్రమే దోహదం చేసింది. ఈ చర్యతో పాటు జీఎస్టీ వంటి మరో కొన్ని చర్యలు కొద్దిమంది వద్ద సంపద మరింతగా పెరగ దానికి, చిన్న చిన్న వ్యాపారులు కుదేలు పడడానికి దారితీసింది. దేశంలో తగ్గిపోతున్న ఉపాధి అవకాశాలు, ఎగుమతులు, పెరుగుతున్న ఆర్థిక లోటు దేశం ఎదుర్కొంటున్న 1991 నాటికన్నా ప్రమాదకరమైన ఆర్థిక సవాళ్ళను వెల్లడి చేస్తున్నాయి. సామాన్య ప్రజల జీవితాలను పెనంలో నుండి పొయ్యిలోకి నెట్టివేసినట్లు అవుతున్నది.


వ్యవసాయ, గ్రామీణ రంగాలలో నెలకొన్న సంక్షోభకర పరిస్థితులు, అడ్డు అదుపు లేకుండా సాగుతున్న రైతాంగ ఆత్మహత్యలు పరిస్థితి తీవ్రతను వెల్లడి చేస్తున్నాయి. మూడేళ్ళుగా వర్షాలు బాగానే ఉన్న వ్యవసాయ రంగం ఎందుకు సంక్షోభానికి నెట్టివేయబడుతున్నదో ఢిల్లీలో ఆర్థిక విధానాలు రూపొందించే వారికి అర్ధం అవుతున్నదా ?

సంస్కృతాన్ని అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు

నూర్ బాషా రహంతుల్లా
9948878833

విక్టోరియా మహారాణి బంగారుపతకం తెలుగులో ఉంది











ఇది బుడ్డా వెంగళరెడ్డి గారికి విక్టోరియా మహారాణి ఇంగ్లాండులో చేయించి పంపిన బంగారు తెలుగు పతకం.నేను దానిని తీసుకొని పరిశీలించాను. దాని వెనుకవైపుతెలుగు అక్షరాలే ఉన్నాయి.తెలుగుఅంకెలున్నాయి. ఈ అక్షరాలు చదవటానికి అనుకూలంగానే ఉన్నాయి. *"1866 (1866)సంవత్సరములో సంభవించిన క్షామ కాలమందు నిరాధారముగా వుండిన తన స్వదేశస్థులపట్ల జరిగించిన వుత్కృష్టమయిన ఔదార్యమునకు గాను హర్ మెజిస్టీరాణి గారి వల్ల చేయబడిన శ్రేష్ఠమయిన గణ్యతకు ఆనవాలుగా బుడ్డావెంగళరెడ్డిగారికి బహుమానము ఇయ్యబడ్డది."*అని ఉంది.

ఆంగ్లపాలకులు ఆంగ్లంలోనే పతకం ఇస్తే ఎవరూ కాదనలేరు. పరభాష అనో,పాలితుల భాషఅనో వివక్షతో చిన్నచూపు చూడకుండా ఎక్కడికక్కడ మన ప్రజల భాషలునేర్చుకొని మరీ పాలించారు. పాలనలో తెలుగు అమలు చేసిన విషయంలో మన వాళ్ళకంటే బ్రిటీష్ పాలకులే కొంత నయమనిపించారు. కర్నూలు జిల్లా కోయిలకుంట్లలోనివ్యక్తికి బ్రిటన్ దేశం లోని లండన్‌లో తెలుగు అక్షరాలతో బంగారు పతకం చేయించి ఆంగ్లపాలకులు ఇవ్వటం అద్భుతమే. భాషాప్రాతిపదికమీదనే తెలుగు రాష్ట్రాన్ని సాధించుకున్న మనము మన ప్రజలకు తెలుగులో పరిపాలన అందించగలము.

తెలుగులో తీర్పులు ఇవ్వగలము. శాస్త్ర సాంకేతిక విద్యలను మాతృభాషలోకి మార్చగలము. ప్రభుత్వ కృషితో పాటు తెలుగు ప్రజలలో కూడా ప్రతి స్థాయిలోనూ తెలుగుకై కదలిక రావాలి. మన భాషలో మనల్ని మనం పరిపాలించుకుందాము అనే పట్టుదల కలగాలి. గట్టిగా అందరూ కలిసి ప్రయత్నిస్తే తెలుగులో పాలన సాధ్యమే.

2.9.14 న కోయిలకుంట్ల వెళ్ళి వారి వారసులను కూడా దర్శించాను. నన్ను ఎంత గానో ఆకర్షించిన అంశం బుడ్డా వెంగళరెడ్డి గారికి విక్టోరియా మహారాణి ఇచ్చిన పతకం వెనుక ముద్రించిన తెలుగు అక్షరాలు. ఆయన వారసులు దానిని ఆనాటి చెక్కపెట్టెతో సహా భద్రపరిచారు. ఆయన ఇల్లు, వారసులు, పతకం పెట్టె ఈ ఫోటోలలో చూడవచ్చు. ఈ బంగారు పతకం రూపం కూడా అమరావతి రాజధానికి సంబంధించిన రాజచిహ్నాంలాగా ఉందని సామల రమేష్ బాబుగారు చెప్పడం నా సంతోషాన్ని పెంచింది. మన రాజులు ఏర్పరచుకున్న రాజ చిహ్నాలు, పతకాల రూపాలను కూడా బ్రిటీష్ పాలకులు అత్యంత నిశితంగా గమనించి ఆయా ప్రాంతాల ప్రజల భాషలతోపాటు సంస్కృతీ చిహ్నాలను కూడా స్వీకరించి వాటి రూపాలలోనే పతకాలు కూడా ప్రదానం చేశారంటే ఈనాటికీ వారు మన ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలిచారనుకోవచ్చు.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

తెనాలి–తెలుగు సాహిత్య మహోత్సవంలో వివిధ సదస్సులు దృశ్యాలు




రాయలు పాత్రలో శాసనసభ్యుడు
ఈ మహోత్సవాల నిర్వాహకుడు
శ్రీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్



ప్రారంభ సభలో
శ్రీ మండలి బుద్ధప్రసాద్



ముగింపు సభలో
శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్,


శ్రీ గొల్లపూడి మారుతీరావు










అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
February 2018 Vol.3, Issue 12
Date of publication : 1st of every month
Date of posting : 3rd&6th of every month
RNI-APTEL/2015/62362
Postal Reg. NO.TEN\13\2018-20



If not delivered, please return to : 'The publisher, AMMANUDI monthly,
8-386, Jivaka bhavanam, ANGALAKUDURU (po), TENALI- 522 211, Guntur (dt) A.P. Cell: 9440 448244